భారతి

సంపుటము	ఆగస్టు, 1945	సంచిక
22	పార్థివ శ్రావణము	8

పురోగమనము

•

= శ్రీ దివాకర్ల వేంకటావధాని =

(భర్తృవియోగభీరువులై సహగమనమును, పశ్చాద్గమనము నొనర్చిన సాధ్వీమతల్లు లుండిరిగాని పురోగమన మొనర్చినవార లరుదు. హర్షుని తల్లియగు యశోవతి భర్త మరణశయ్యపై నుండఁగా నావార్త చెవినిబడుట కిష్టములేక చితి పేర్పించికొని స్వశరీరము నగ్ని కాహుతిసేయనుండెను. హర్షుఁ డీవార్త నాలకించి యామెకాళ్లపైఁ బడి "యమ్మా! నీవుగూడ మమ్ము నిర్భాగ్యులఁ జేసిపోవకు" మని యవరోధ మొనర్ప నాతని కామె యొసఁగిన సమాధానము.)

అప్రియుండవు కావు నీ కవగుణములు-లేవు, త్యాగార్హుఁడ వొకింత నీవు కావు
తనయ! నాయంకమునఁ బాలు ద్రావునాఁడె-మాహరించితి వయ్య! హృదంతరమును.

అరయఁగ నాప్రభువర్యుని-గురుతరమగు సుప్రసాదగుణమున దానం
తరితంబగు నాదృష్టికిఁ-దిరోహితుఁడ వైతి నీ విదే నిజమోయీ!

మఱియు నఖండరాజ్యసుసమావిషయాధికసక్తిఁ బూరుషాం
తరనిరతానురాగము నెదన్ వహియించి కృపావిహీనలా
సిరియును భూమిగాను గద! శీలవతిన్ జరితార్థ నైతి ను
ర్వర ఘనధర్మకీర్తి ధవళంబగు వంశమునన్ జనించితిన్.

మఱచితివేమొ? నేఁటి కసమానపరాక్రమబాహువీర్య భా
స్వరుఁడయి పెక్కుయుద్ధముల వైరుల నుక్కడఁగింపనేర్చె నే
పురుషవరేణ్యుఁ డాతనికిఁ బుణ్యవశంబున భార్యనైతిఁ గే
సరి కెనయైన కేసరిణి సర్వవిధంబులఁ బోలి నాయనా!

వీరునకుఁ బుట్టితి నిల-వీరునకుఁ గళత్రమైతి వీరులఁ గంటిన్
బౌరుషవిక్రీతను నే-గోరుట కింకేమి కలవు కోర్కెలు చెపుమా?

భరతభగీరథప్రముఖపార్థివులన్ బురుడించు రాజశే
ఖరుఁ డయినట్టి నీజనకుఁ గల్పనిభున్ గయివట్టికొంటిఁ జె
చ్చెర లభియించెఁ బట్టమహిషీబహుదుర్లభపట్టబంధ మా
దరమున ఫాలభాగమునఁ దాల్చు నదృష్టము నాకుఁ బుత్రకా!

పంతము దాల్చి సేవకయి పర్విడి వచ్చిన తత్సమస్తసా
మంతనరేంద్రకామినులు మంజులనూతనహేమకుంభసం
క్రాంతనదీపునీతసలిలమ్ములతో నభిషేకసత్క్రియన్
వింతగ నిర్వహింపఁగఁ బవిత్రితమయ్యె మదీయమౌళియున్.

అవనతిసేయవచ్చిన ధరాధిపసర్వకుటుంబినీకిరీ
టవిశదరత్నదీధితుల డంబగు పాదసరోజయుగ్మమున్
సవతుల మౌళి బెట్టితిని సర్వవిధంబుల నాశరీరమం
దవయవముల్ సమస్తము కృతార్థములై వెలుగొందెఁ బుత్రకా!

నేఁటికిఁ బుణ్యపుంగరిమ నీరసమై నశియించుచుండె నా
కేటికి రిత్తకోరిక లహీనమతిన్ త్యజియింతు మేను ము
మ్మాటికిఁ బ్రీతిమై నుదుటిమధ్యను గుంకుమబొట్టు పూర్వపున్
పాటలవర్ణయుక్తమయి భాసిలుచుండఁగ నే కుమారకా!


అత్యధికగౌరవంబున కాస్పదమగు-నాత్మవిభు మేను దగ్ధమైనట్టి వెనుక
ఇతరవిధంబున నేను వ్యర్థప్రలాప శతసహస్రము లాడ నశక్తురాల.

నను గనుచున్ బురస్కృతి నొసర్చి బహూకరింప నీ
జనకుని పాదధూళిగతిఁ జయ్యన ముందుగఁ బారిపోయి నా
వెనుకనె వచ్చుచుండెఁ బృథివీపతి శూరశిరోవతంసమం
చు నెదురుచూచుచున్న సురసుందరులన్ గని విన్నవించెదన్.

ఇప్పు డాపాదమస్తము నేకరీతి-దగులఁబెట్టుచున్న దుస్తరవియోగ
నామకహుతాశనునికంటె నను నిజమగు-శిఖిశిఖాతతు లింకేమి చేయఁగలవు?
మరణముకంటెను జీవిత-పరమావధి వేచియుంట బహుకష్టము దు
స్తరముంగద! తనయా నా-కొఱకై నీవేటి కిట్లు కుందెదవోయీ?

అతియుస్నేహ మింధనమై జ్వలించు-భర్తృశోకాగ్నికంటెను బావకుండు
చల్లగా నుండు నాతనివల్ల నాకు-శ్రమ ఘటింపఁగఁబోదు నిశ్చలు గుమార!
భర్త కైలాసనిభుఁ డిట్లు పరమపదము-జేరుచుండఁగ నాకేటి జీవితాశ!
యింక నీమేను వాడిపోయిన తృణమ్ము-కంటె మిక్కిలి తేలికగాదె! తనయ!

ఇంచుక తీపి గల్గి యొటులేనియుఁ గష్టముతోడ నేను జీ
వించిన పుత్రరాజ్యసుఖ మించుకయున్ రుచియింపఁబోదు సే
వించిన భర్త దుఃఖము సహించెదు పాతకురాండ్ర నెంతయున్
వంచనసేయు సంపదలు వత్స! ప్రయోజన మేమి? తెల్పుమా!
నిను బ్రతిమాలెదన్ జగతి నిల్వఁగఁదగ్గది కీర్తియేసుమీ
తనయ! శరీర మెప్పటికొ తప్పక నాశన మందితీరు న
మ్మనమున నున్న నిశ్చయము మాన్పఁ బ్రయత్నము సేయఁబోకు మీ
వనుమతి యిమ్ము ధైర్యముగ నయ్యనలంబున మేను వాసెదన్.



పరిదేవనము

●

=శ్రీ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి=

నీలిమబ్బుల చాటుగా వాలిచూచు
లలితసౌదామనీతనూలతసొబంగు
జూడ గన్నులు జాలని పాడుజీవ
నమున చీకటికోణాల నడువగలన-!

గుండె బండయి, లోకనిగూఢభావ
మర్మముల మూల మెరుగక, మసలి-దసిలి
ఏడ్వదోచక—లేశమే నేడ్వ రాక
నేడ్చుచుందును—ఏడువనివ్వ రేమొ!!

కట్టివేయుడు ఇంకను;—గళితశృంఖ
లామదస్విన్న సామజరాజమట్లు
కేళిసల్పుదు స్వచ్ఛందగీర్వనముల—
డేలియాడుదు ప్రేమంపు దివ్యతటుల!

ఇంక నే నాగలేనును ఈనికృష్ట
కష్టదాస్యోల్బణానికి!-కలగి-తొలగి-
అంధతమససంఘమ్ములు అవియవలెను!
కోకిలలు కంచుఘంటలు కొట్టవలెను!!

గుండియను జీల్చి-గొంతుకకొన విదిల్చి-
భావభమ్ములు మ్రోగింతు బూని తాళ
ములుగ!; వేదన నింకను మోయలేను -
పొంగు పరిదేవనమ్మును మ్రింగలేను!—

తెలుఁగు కవితలోని సంస్కృతి

❀

= శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి =

నాకు భాషలో, భావములో, కవితలో, వ్రాఁతలో, చివరకు కట్టులో, బొట్టులో సంస్కృతి కావలయును. కావలయు నని పదిమందిలో బల్లగ్రుద్ది చెప్పను. కాని నాకుఁ గావలయును. ఒకప్పుడు ఒక సంఘములో నన్ను సంస్కారి యనుకొనుట విని తల వాల్చుకొందును. ఒక సందర్భమున, ఒక పరిషత్తులో "వీరికి సంస్కృతి యేమో తెలియదు" దనుకొనుట విని నాలో నేను దుఃఖింతును. అక్కడ, ఇక్కడ నాకు నేను సంస్కారి నని నిర్భయముగాఁ జెప్పుకోలేను. ఇది నా స్వభావము. నా ఆడిన మాట, నా వ్రాసిన వ్రాఁత, నా కట్టిన కట్టు శుద్ధ - సంస్కారదూరముగా నుండవలె నని చాలవఱకుఁ బైకి తంటాలుపడుదును. ఆ తంటాలుపడుటయు నొక్కొక సందర్భముననే సుఁడీ! యువకబృందము కూడి, ఉడుకునెత్తు రోడి పాఱుచున్న సమయములో నేను మాటాడు మాట తిరువదవ శతాబ్ది దాఁటి పరుగులెత్తును. ఏతావతా, ఈ సంస్కార-అసంస్కార భావములకు సంఘమును బట్టి నాలో నుండుట, లేకుండుట తటస్థించుచున్న దని ఫలితార్థము. ఉద్యోగము చేయుచున్న వాళ్లలో "నేను సంస్కారి" ననుకొనుటయుఁ జచ్చినచావయ్యెడిది. అది లేనివాళ్లలో సంస్కారవాదమునకుఁ బతాక నెత్తుద మని ప్రయత్నించితిని. అక్కడ కదియు నయినది. లోలో నా సంస్కారాభిరతి పుటపాకప్రతీకాశమై యుడికి ఉండిపోయినది.

సంస్కారకుసుమపు కంపు నేను అణఁచిపెట్టిన నణఁగియుండునదియా? నేను మాఱిపోవుచున్నాను. నాతో నా భాష, నా భావము, నాకవిత, నా వేషము మాఱిపోవుచున్నది. "అయినది - వీఁడు మాఱిపోయినాఁడురా" అని నన్నుగూర్చి నవీనులు నవ్వులాట కారంభించిరి. "నే నేమి మాఱలేదే? — గ్రాంథిక భాష, ఛందోబద్ధమైన కవిత్వము నేను విడిచిపెట్టలేదే? ఇంక మాఱిపోవుట యేమి, వీరి మొగము" అని సమాధానపఱచుకొంటిని. ఏదో సమాధానము చెప్పికొన్నాను గాని, నిజము చెప్పవలసినచో నేను సగమునకు సగము సంస్కారి నయితిని. నన్ను కప్పి నాలోఁ బెద్దమార్పు వచ్చిపడినది. నా గ్రాంథికము పూర్వగ్రాంథికము గాదు. నాకవిత పూర్వకవిత గాదు. నా వేషము సరేసరి.

ఇది బహుచిత్రము! సంస్కృతిశబ్దము భయంకరమై మన మెఱుఁగకుండఁగనే మన ప్రత్యణువునను దావు చేర్పఱచుకొని యుండును. నవ్యులు నన్ను గూర్చి సంస్కారి యనుకొనవలయును. ప్రాచీనులలో నాకు అసంస్కారిబిరుదము రావలయును. ఇది నా యూహ. దీని భావము — నేను వట్టిభయస్థుఁడ నని, లోకవంచకుఁడ నని తేలినది. వలదన్నను విడిచిపెట్టని యీ సంస్కృతినిగూర్చి యీ పైపైధిక్కారము నా కెందులకో నాకే తెలియదు. పోనీ, నేను సంస్కారి నని గుండెపై చేయి వైచికొని చెప్పవచ్చునా? — అబ్బే! ధైర్యము లేదు. నేను ప్రయత్నము చేయుచున్న యుద్యోగము కాదేమో యని, మా కులవృద్ధులు చీవాట్లు పెట్టుదు రని సనాతనసంఘములో నా సభ్యత్వపదవి యూడిపోవు నని--ఏదేదో భయము. ఈ భయముతోఁ జచ్చినట్లు పడియుందునా? భాషను గూర్చి, కవితనుగూర్చి సంస్కార మత్యవసర మని

పత్త్రికలకు మాఱుపేరులతో వ్యాసములు పంపుచుం డును. పత్త్రికాసంపాదకులు ఆ వ్యాసముల కిచ్చిన బహుమానములు మరల నావే. మొత్తముమీఁద సం స్కారవాదులలోను, అసంస్కారవాదులలోను నాకు మాటరాకుండఁ గాలక్షేపము చేసికొనివచ్చుచుంటిని. ఈ వంచకత యింకముందు సాఁగునో, సాఁగదో ?

కొంచెము రూపభేదముతప్ప సంస్కారము, సంస్కృతియు నొక్కటే. సంస్కృతి యన సరిపఱు చుట యనికదా యర్థము! పూర్వవిషయము సరిగా లేదని మనకుఁ దోఁచినది సరిపఱుచుట సంస్కార మని తేల్చుకొంటిమి. పూర్వజన్మసంస్కారము, పూర్వ జన్మసంస్కారము అని వేదాంతు లనుచుండు మాట లోని సంస్కారశబ్దమునకు, మన సంస్కారశబ్దము నకుఁ గొంచెము భేద మున్నది. దానికి అనుభూతార్థ స్మృతి యని, దీనికి సరిపఱుచుట యని అర్థము. ఉప నయనాదిసంస్కార మన్న చోటి సంస్కారశబ్దము నకుఁగూడ సరిపఱుచుటయే యర్థము. వ్యర్థముగా సంస్కారమన్నంతనే కన్నెఱ్ఱఁజేయువా రున్నారు మనవారిలో. సంస్కారము అనఁగా ఇంచుమించుగా పరిణామము. అది తప్పనిసరిగ దినదినము ప్రజలలో విజృంభించుచునే యుండును. దానిని మన మాఁగ లేము. మతములో, మఱొకదానిలో సంస్కృతిని గూర్చి మనకేల! మన తెలుఁగుకవితలోని సంస్కృతిని గూర్చి ప్రకృత మనుకొనవలయును.

నన్నయాదులను సంస్కారు లనినచోఁ జాల మందికిఁ గిట్టదు. 'సంస్కారి' యనిన నొక పెద్దపులి యని వారి యాశయము. నన్నయవంటి కులబ్రాహ్మణు నకు—జపహోమతత్పరునకు సంస్కారిబిరుదము తగి లింపవచ్చునా? తప్పు-తప్పు-అని యందురు. తిక్కన శ్రీనాథాదులపట్లఁగూడ నీ తగవులాట తప్పదు.

కాదు. నన్నయ సంస్కారి. తనవెనుకఁ గల లక్షణేతర భాషను నన్నయ సంస్కరించెను. ఈ విష యమున భిన్న భావము లుండుఁగాక! మొత్తముమీఁద నిది సంస్కారమనక యేమందురు? భాషావిషయక సంస్కార మొక డొంక. దీనిని కదపరా దిప్పుడు. కవితాసంస్కార మొక్కటే ప్రస్తుతాభావ్యము. కాలమునుబట్టి, కవితనుబట్టి కవి సంస్కారి కాక తప్పదు. కవిత సంస్కృతి నందుచున్నఁగాని రమ ణీయతరము గాదు. సంస్కృతినందిన కవితయు, సంస్కారియగు కవియు శాశ్వతులు.

ఆ లెక్కకు వచ్చిన, నన్నయ యొక్కఁడేల! తిక్కన సంస్కారి. శ్రీనాథుఁడు సంస్కారి. పింగళి సూరన సంస్కారి. ఆధునికశకమున శ్రీ వీరేశలింగము సంస్కారి. శ్రీ వేంకటశాస్త్రి, శ్రీ సత్యనారాయణ వీరందఱును సంస్కారులే. ఇంకను జగినచో నిట్టివారు పెక్కురు. ఈ వేంకటశాస్త్రి ప్రభృతులైన యాధుని కులను "సంస్కారులు వీరు" అని విసరివేసినచో, నన్నయ తిక్కనాదులగు ప్రాక్తనకవులను ప్రక్కవా రేమందురో యోజింపుఁడు!

నేఁటికాలమున, ఆలంకారికవిఖ్యాతమైన 'భావ కవిత్వము' అనుదానివిగూర్చి కొందఱకు నెట్టి యప ఖ్యాతి వచ్చినదో, యటులె యీ సంస్కారిశబ్దము నకుఁగూడ వచ్చినది. నన్నయది భావకవిత యనుటకు, నన్నయ భావకవి యనుటకుఁ గొందఱు మీఁదఁబడు దురు. సంస్కారి యనుటకుఁగూడ నట్లే. అది యటుండె.

నన్నయ ప్రాథమికసంస్కారి. ప్రాథమిక సంస్కారి యనఁగనే నన్నయకుఁబూర్వము తెలుఁ గునఁ గవిత వెలసినటులు సువ్యక్తము. అసలు, లేని దానికి సంస్కృతియే యుండదు. ఉన్నదానికి వన్నెలుచిన్నెలుపెట్టి మెఱుఁగు కల్పించుటయే సంస్కృతి. ఏ బెజవాడశిలాశాసనాదులలోనో ఆంధ్ర కవిత అతివిరళముగ నుండియున్నది. దానిని నన్నయ పైకిఁదీసి సంస్కరించి విస్తరింపఁజేసినాఁడు. కాన నన్నయ సంస్కారి. ఇందు విప్రతిపత్తి యుండఁ గూడదు. నన్నయకవిప్రభుని కవితాసంస్కృతి యిట్టి దని శృంగగ్రాహికయా చెప్పఁజూచుట నగుఁబాటు నకుఁ గారణము. అతని భారతభాగము పద్యపద్యము

నను, గద్యగద్యమునను ఆతఁడు గావించిన సంస్కారౌచిత్యము వెల్లివిరిసినది. చివరకు అక్షరరమ్యతయుఁ దన కవితలోఁ జొనిపి, యందును సంస్కృతి చూపినాఁడు. వచనములు రచించుటలో నన్నయది పెద్ద తీర్పు. కందగీతములు, వచనములు తఱుచుగ వ్రాయుచు నడుమనడుమ నన్నయ శార్దూలాదివృత్తములు చేర్చును. ఆ విషయమున నతఁడు గావించిన యత్యద్భుతసంస్కృతి యనన్యదుర్లభము. ఆదిపర్వమున ఉదంకుఁడు ఉరగలోకమున కరిగి నాగపతులను "బహువనపాదపార్ద్ధి" ఇత్యాదిపద్యములు నాల్గింటిచేత స్తుతించును. అవి నాలుగును వృత్తములు. అక్కడ ఆ వృత్తములే చేర్చుట నన్నయకుఁ గల మహామహాచితీసంస్కృతులకుఁ దారకాణ.

"వ. ద్రోణుండు నర్జునుచేసిన పరాక్రమంబునకుఁ బరమహృష్టహృదయుండై ద్రుపదుం జూచి నగుచు నిట్లనియె—

క. మీ రెవ్వరయ్య ద్రుపదమ
హారాజులె యిట్లు కృపణులయి పట్టువడన్,
వీరికి వలసెనె యహహా! మ
హారాజ్యమదాంధకార మది వాసెనొకో?

గీ. ఇంకనైన మమ్ము నెఱుఁగంగవచ్చునొక్కొ?
యనుచు నల్లసంబులాడి ద్రుపదు
విడిచిపుచ్చె గురుఁడు విప్రుల యలుకయుఁ
దృణహుతాశనంబు దీర్ఘ మగునె?"

ఈ యక్షరపంక్తులలోని యందమేమి చెప్పఁగలము. పద్యము నెత్తుగడలో, పద్యములు వ్రాసివ్రాసి వచనములు చొనుపుటలో, సీసపద్యముదిగువ ఎత్తుగీతములు కూర్పుచేర్పులో నన్నయసంస్కృతీగరిమ మిన్నుముట్టినది. తొలుతఁ దెలుఁగుకవితకా ప్రభువు గావించిన యపూర్వసంస్కార మహూల్యాలంకారము.

తిక్కన నన్నయతరువాత పేరుగనిన సంస్కారి. ఆంధ్రావళి మోదముం బొరయునటులు ఈతఁడు సంస్కృతినొనర్చి తెలుఁగుకవితను వెలయింపఁజేసినాఁడు. "వివిధార్థగతిస్ఫురణమ్ము" కలిగి దక్షతతో నన్నయ తెలిఁగించినతరువాత భారతము పదునేనుపర్వములు తాను సాధారణజన సంప్రార్థ్యము, బుధసంతోషప్రదము నయిన రీతిని రచియించి కొంత సంస్కృతి చేసినట్లు తోఁచును. కేవలము నన్నయనే యనుకరించి స్వాతంత్ర్యము నెలువరింపనివాఁడు కాఁడు తిక్కన. నన్నయమీఁదఁ దిక్కనకు బ్రహ్మాండమంత గౌరవమున్నది. ఆ గౌరవము నన్నయగారి ఆంధ్రకవిత్వవిశారదత్వము, విద్యాదయితత్వము, మహితాత్మత, దక్షత పురస్కరించుకొని వచ్చినది. ఆ గౌరవము అటులుండుఁగాక. నన్నయతిక్కనలకు నడుమ రెండు శతాబ్దు లెడ మున్నది. అనఁగా, నన్నయ జనుక నించుమించు రెండువందల యేండ్లకు బయలుదేఱిన తిక్కనలోఁ గొంత సంస్కృతి వ్యాపించి, విరాటాది పర్వములను విలక్షణముగా వ్రాయించి తీఱినది. విలక్షణత యన మఱేమియు లేదు. నన్నయలోఁ దత్సమశబ్దముల పాలెక్కువ యని విమర్శకులు లెక్కలు చూపి వ్రాసియుంచిరి. తిక్కనలో తెలుఁగుపాలధికము మనకు సుస్పష్టముగ గోచరించుచునే యుండును. భాషావిషయకముగఁ గూడ దిక్కన సంస్కారము గావించెను. దానిని బట్టి నన్నయను సంస్కరింపవలెనని తిక్కనకు దురుద్దేశము లేదు. కాలపరిణామమును బట్టి తిక్కనలోఁగొంత సంస్కారభావన తనంతదాను వచ్చిపడినది. లాక్షణికముగ నన్నయ పెట్టుకొనిన కఠినబంధములు కొన్ని, మఱి యేకారణముననో తిక్కన సడలించుకొనెను. ఈ సడలింపు సమర్థత లేక యనుటకు జంకుపుట్టును. సంస్కార మనుటకు నేను సంశయముపడను.

నన్నయతిక్కనలతరువాత సంస్కారి నని పించుకొనినవాఁడు శ్రీనాథుఁడు. స్కాందములోని కాశీఖండము నితఁడు తెనిఁగించినాఁడు. ఆ పరివర్తనము పురాణముగాఁ గాదు, ప్రబంధఫక్కిని. ఈతని యితరకృతులన్నియు నూతనమైన కావ్యమార్గమున నడచినవి. పద్యముల నడకలో, సమాసముల కూర్పులో, తెలుఁగుపలుకుబడి చేర్పులో, అమూలకమగు క్రొత్తభావముల చేర్పులో, శ్రీనాథుఁడు కావించిన

డెల్ల చక్కని సంస్కృతి. మొత్తముమీఁద నీ కవి సార్వభౌముని జీవికయే విలక్షణ మైనది. తనకుఁ బూర్వమం దున్న కవులవలె నేమహారాజునో యాశ్రయించి వ్రాసికొనుచు నుండు నలవాటతనిలో లేదు. ఒకఁడు కాదని యొకనితోఁ జెలిమిచేసి దేశ దేశముల లోని రాజాధిరాజులఁ జూచినాఁడు. అపూర్వములైన కనకాభిషేకాది గౌరవములు చెందినాఁడు. గౌడడిండిమ భట్టు మొదలైనవారితో శాస్త్రార్థములు చేసినాఁడు. శ్రీనాథుని నూతనసంస్కార పరిమళము తెలుఁగులో నెల్ల వెల్లివిరిసినది. నన్నయతిక్కనల త్రోవనే మనము కూడఁ బోవుద మనుకొనక, తన స్వతంత్రతాముద్ర కవితాఘనరాశిమీఁద వేసికొని వెలసిన విద్యాధికారి శ్రీనాథుఁడు. ఈ కవిరాజుకవితాసంస్కృతి క్రీడాభిరామములోఁ బతాకనెత్తినది. కాశీఖండమందలి యీ పద్య ముదాహరణముగా నిచ్చుచున్నాను:

ఉ. "ఎట్టు పురాణము ల్పదియు
    నెన్మిదిఁ జెప్పితి? యెట్టు వేదముల్
  గట్టితి వేర్పఱించి? నుడి
    కారపు సొం పెసలార భారతం
  బెట్టు రచించి? తీవు ఋషి
    వెట్టయి? లొక్కదినంబుమాత్రలోఁ
  బొట్టకు లేక తిట్టెదవు
    పుణ్యగుణంబుల రాశిఁ గాశికన్."

వీరందఱను దాఁటిపోయిన సంస్కారిని చెప్ప వలసివచ్చినపుడు పింగళిసూరన్న. ప్రభావతీప్రద్యుమ్న, కళాపూర్ణోదయములలో నితని కవిత్వ సంస్కృతి కరడుకట్టినది. కళాపూర్ణోదయము వాఙ్మయప్రపంచమున కొక పార్వణచంద్రోదయము. కథలోఁ గాదు, కల్పనలోఁ గాదు, కవిత్వములోఁ గాదు, పాత్రౌచితిలోఁ గాదు సూరనకవి యీకావ్యమున నుత్తమజాతిసంస్కృతి వెలయించినాఁడు. నారదాదులచే 'బళిరా! పక్కివి వాఁడు'వని ప్రశంసింపఁబడిన కవివరుఁడు సూరనార్యుఁడు. సుగాత్రీశాలీనుల కథా చిత్రణములో నాతఁడు చూపిన సంస్కారనైపుణ్యము మన భావముల కందనిది. ఆకథలో నననేల, మొత్తము మీఁద కళాపూర్ణ మొక యెత్తు; ఆధునికకావ్య వాఙ్మయమెల్ల నొక యెత్తు. ఆవిధమైన కావ్య మంతకుమున్న తెలుఁగులో లేదు. కళాపూర్ణోదయమే ఆధునికకావ్యములకు సంస్కృతియన నేమో యొరవడికెట్టినది. ఈతని కావ్యములలోని సంస్కృతి యిట్టి దని పద్యములు కొన్ని యుదాహరణ మిచ్చుట యీకాగితపు కఱవుకాలములోఁ గూడదు.

ఈవిధముగా నన్నయనాఁటినుండి సూరన నాఁటిదాఁక కవిత సక్రమసంస్కృతి నందుచు బహుజనులచే నారాధింపఁబడుచున్నది. సూరననాఁటి నుండి యీనాఁటిదనుక నిట్టికవిత చక్కఁగఁ బరిణతి నందవచ్చుచుంటయు విస్పష్టము.

ఇప్పటివారిలో వీరేశలింగముగారు భాషను, కవితను, ఇంకను జూచినచో మతమునుగూడ సంస్కరించినారు. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు (తిరుపతి వేంకటకవులు) బహుముఖములుగాఁ గవితాసంస్కారము గావించినారు.

క్రియకు చేసి చెప్పఁబోవునది, యొకమాట. ఆనాఁడు మొదలు ఈవేళదాఁక చూచుకొనివచ్చినచో, సక్రమముగ, కావలసినవిధముగా, అనింద్యముగా మన తెలుఁగుకవిత సంస్కృతిమార్గమున నున్నది. సంస్కార మన్నంతనే గర్హ్య మనుకొనరాదు. అది సరియగుత్రోవలో నున్నచో శిరసావహింపఁదగినదియే. నవ్యసాహిత్యప్రవర్తకులలోఁ గొందఱు కవిభావకులు కావించు సంస్కృతి యేరి చూచుకొని నమస్కరింపుఁడు. సత్సంస్కృతికి లొంగనిచోఁ దిరస్కరింపుఁడు.

"సహృదయాః ప్రమాణమ్"

పాలకురికి సోమనాథునికాలము

★

= శ్రీ బండారు తమ్మయ్య =

వయిశ్శికతో భారతి ౧౯౪౫ ఫిబ్రవరి సంచికలో శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రకటించిన వ్యాసము చరిత్రజిజ్ఞాసువులు విమర్శకదృష్టితో లెస్సగా గమనింపఁదగియున్నది. సోమనాథుని ద్విపదబసవపురాణమున కాతని శిష్యప్రశిష్యుఁడు పిడుపర్తి సోమనాథకవి వెలయించిన పద్యబసవపురాణముయొక్క యవతారికనుబట్టి పాలకురికి సోమనాథుఁడు కాకతీయ చక్రవర్తి రెండవప్రతాపరుద్రుని (క్రీ. శ. ౧౨౯౦-౧౩౨౬) కాలమువాఁడని స్థూలదృష్టికి గోచరించు పూర్వాభిప్రాయమునే నీలగంగవరశాసనసాహాయ్యముతో సమర్థించుచు శ్రీ శర్మగారీవ్యాసమును వెలువరించినారు. శాసనాధారములఁబట్టి సోమనాథుని కాలమును నిర్ణయ మొనరించుటకయి శర్మగారొనర్చిన యీ యుద్యమము ప్రశంసనీయము. కాని పిడుపర్తి సోమనాథుని పద్యబసవపురాణావతారికయందలి విషయములఁబట్టి పాలకురికి సోమనాథుఁడు రెండవ ప్రతాపరుద్రుని కాలమువాఁ డగునని శ్రీ వీరేశలింగముపంతులు గారు ఆంధ్రకవిచరిత్ర మొదటి ముద్రణమునందును, శ్రీ చిలుకూరి వీరభద్రరావుపంతులుగారు ఆంధ్రుల చరిత్ర రెండవభాగమునందును ప్రకటించిన యీ పూర్వాభిప్రాయమును మార్చుకొని యాంధ్రకవుల చరిత్ర మొదటిభాగము పునర్ముద్రణమునందును, కాకతీయయుగాంధ్రచరిత్రనూత్న ముద్రణమునందును బూర్వోదాహృతులయిన యా చరిత్రకారులును, ఇతరత్ర మఱికొందఱు విమర్శకులును సోమనాథుఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలముననే క్రీ. శ. ౧౧౯౫ ప్రాంతమున బసవపురాణమును, దరువాతఁ క్రీ. శ. ౧౨౩౦ ప్రాంతమునఁ బండితారాధ్య చరిత్రమును రచించియుండు నను నూతనాభిప్రాయము నే కారణములను బట్టి నిర్ణయించిరో యా యుపపత్తులం దేనిని శ్రీ శర్మగారు తమ వ్యాసమునఁ జేర్కొని వాని నొకించుకయినఁ బరామర్శింపక యున్నకుండుట శోచనీయము.

కర్ణాటకవిచరిత్ర మొదటి భాగము ప్రకటించినప్పుడు దత్కర్తలు శ్రీ ఆర్. నరసింహాచార్యులుగారు కన్నడమున శృంగారసార మను నామాంతరముగల యుద్భటచరిత్రము శా. శ. ౧౧౪౪ (క్రీ. శ. ౧౨౨౨) లో రచించినట్లు చెప్పికొనిన సోమరాజు తన గ్రంథమునఁ బూర్వకవిస్తుతిలోఁ బాల్కురికి సోమనాథునిఁ బ్రశంసించుటచే సోమనాథుఁడు క్రీ. శ. ౧౧౯౫ ప్రాంతమువాఁ డగునని నిర్ణయించియున్నారు. దీనినిబట్టియే శ్రీ వీరేశలింగము పంతులుగారు ఆంధ్రకవుల చరిత్ర ప్రథమభాగ పునర్ముద్రణమున సోమనాథుని కాలమును గూర్చిన పూర్వాభిప్రాయమును మార్చుకొని కర్ణాటకవి చరిత్రకారుల నిర్ణయమును దామునుగూడ ననుగమించిరి. ఈ విషయమున శ్రీ నరసింహాచార్యులుగారు సోమరాజు గ్రంథమునుండి యుదాహరించిన పద్యము లివి:

మ. "ప్రమథానీక కథార్ణవేందుహరికే
వాచార్యనం ధైర్యనం
విమలజ్ఞాన సుదీపికాస్ఫురితచే
తస్సద్మనం పద్మనం
సముదంచ ద్వృషభ స్తవామరమహీ
జారామనం సోమనం
క్రమదిందం బలగొందు పేళ్వెనో సదా
నీకావ్యమం సేవ్యమం"

మ. "జననాథోత్తమ సోమరాజనసిద్ధి
కావ్యంబలం శాలివా
హనశాకాబ్దమ దెద్దొ సాసిరదనూ
టింపింద నాల్వత్తునా
ల్కనెయా రంజిత చిత్రభానువవరా
శ్వీజోత్సిత్రైకాదశీ
వనజాతారితనూజవాసరదొళా
దత్తల్ల మంగర్పితం."

కన్నడమునఁగాని, తెలుఁగునఁగాని బసవస్తవములను విరివిగా నొనర్చిన సోముఁడు పాల్కురికి సోముఁడుగాక మఱియొకఁ డెవఁడును గానరానందున సోమరాజు నుతించిన సోమన పాల్కురికి సోమనాథుఁడే కాఁదగునని శ్రీ నరసింహాచార్యులుగారును, శ్రీ వీరేశలింగము పంతులుగారునుగాక తదితరులుగూడ నంగీకరించిరి. ఇఁక సోమరాజు రెండవ పద్యమున నగ్గడించిన తత్కావ్యరచనా కాలమునుగూర్చి కొన్ని విమర్శనములు కన్నడమున వెలువడినవి. వానిలో ముఖ్యమయినవి.

(౧) సోమరాజు ఉద్భట కావ్యముయొక్క వ్రాఁతప్రతులు పెక్కింటిలో "సాసిరద నూటింపింద నాల్వత్తు నాల్కనె" యనుటకు మాఱు "సాసిరదనా నూర్నంద నాల్వత్తునాల్కనె" యను పాఠము కానవచ్చుటచే దానినిబట్టి గ్రంథరచనా కాలము శా. శ. ౧౪౪౪ (క్రీ. శ. ౧౫౨౨) అని యేర్పడునేగాని శా. శ. ౧౧౪౪ (క్రీ. శ. ౧౨౨౨) కాఁజాలదు. "సాసిరద నానూర్నంద" అను పాఠము వ్యాకరణదుష్టమగుటచే శ్రీ నరసింహాచార్యులుగారే దానిని "సాసిరద నూటింపంద" అని మార్చియుందురు.

(౨) శా. శ. ౧౧౪౪ చిత్రభాను సంవత్సరములో ఆశ్వయుజ శుద్ధైకాదశి గణన ప్రకారము ఆదివార మగునుగాని పద్యములోఁ జెప్పినట్లు బుధవారము కాదు. శా. శ. ౧౪౪౪ లో నది బుధవారమే యగును. కావున "సాసిరద నానూర్నంద" అనునదియే కవిపాఠమయియుండవలెను.

ఈ విమర్శనములకు శ్రీ నరసింహాచారి గారు ౧౯౨౯ లోఁ బ్రకటించిన కర్ణాటకకవిచరిత్ర మూఁడవ భాగమునవతారికలో సమాధానముల నొసఁగి, సోమరాజు కాలమునుగూర్చి తమ పూర్వాభిప్రాయమునే సమర్థించుకొనియున్నారు. వ్రాఁతప్రతులలోని పాఠమును దమకుఁ బూర్వాభిప్రాయ మొకటి లేనప్పు డకారణముగ మార్పవలసిన యవసరము లేదనియు, "సాసిరదనూటింపంద" అను పాఠము దమ కప్పుడు లభించిన వ్రాఁతప్రతులలోఁ గానవచ్చుటచేతనే గ్రహించితిమిగాని "సాసిరదనానూర్నంద" అను వ్యాకరణదుష్టపాఠము వ్రాఁతప్రతులలో నుండఁగా దానిని "సాసిరద నూటింపంద" అని తాము మార్చియుండలేదనియుఁ గ్రొత్త వాదమును దెచ్చిపెట్టఁదలఁచినవారికే తమ వాదానుగుణముగఁ గవిపాఠమును మార్పవలసిన యవసర మేర్పడునేమోగాని, కర్ణాటకవిచరిత్రము మొట్టమొదట వ్రాయునప్పు డట్టి కృత్యముతోడి నిమిత్తము తమకుఁ గలుగనేరదనియు, సోమరాజు తన కావ్యమునఁ బూర్వకవిస్తుతిలో హరీశ్వరుఁడు, పద్మరసు, సోమనాథుఁడు అను వీరశైవకవులు మువ్వురనుదప్ప నితరు లెవరిని బ్రశంసింపలేదనియు, ఈ మువ్వురుగూడ నించుమించుగ సమీపకాలమువారనియు, నందు మొదటి యిరువురు ఏక కాలమున క్రీ. శ. ౧౧౬౫ ప్రాంతమున నుండిరనుటకుఁ బ్రబలాధారము లున్నవనియు, సోమరాజు క్రీ. శ. ౧౨౨౨ ప్రాంతమువాఁడే యయినచోఁ బాల్కురికి సోమనాథుని తెలుఁగు బసవపురాణమును క్రీ. శ. ౧౩౬౯ లోఁ గన్నడించిన సుప్రసిద్ధవీరశైవ కవియగు భీమకవినయినఁ జేర్కొనకుండఁడనియు, మఱియుఁ గ్రీ. శ. ౧౫౫౯ ప్రాంతమునఁ గొంకణ తౌళవదేశములఁ బరిపాలించిన సాళ్వదేవభూపాలుని యాశ్రితుఁడయి క్రీ. శ. ౧౫౫౦ ప్రాంతమున "రస రత్నాకర" మను నలంకారగ్రంథమును రచించిన సాళ్వకవి తన గ్రంథమున సోమరాజుకావ్యమునుండి లక్ష్యముల నుదాహరించియుండుటచే సోమరాజప్పటికిఁ జాలపూర్వుఁడయియుండవలెననియు శ్రీ నరసింహాచారిగారు తమ సమాధానములో వ్రాసియున్నారు.

మఱియు క్రీ. శ. ౧౨౨౨ చిత్రభానుసంవత్సరములోఁ గాకున్నను నంతకుముందు గడచిన క్రీ. శ. ౧౨౨౧ వృష సంవత్సరములో ఆశ్వయుజ శుద్ధైకాదశీ బుధవారమే యగుననియు, శాసనములలోఁగూడ నిట్టి స్వల్పవ్యత్యయములు కొన్నిచోట్ల మాస తిథి వారములలో నేదియే నొకచోటఁ గానవచ్చుననియు, నందుచే నంతమాత్రమున శాసనకాలమునే మార్చుటకుఁ జరిత్రకారు లెవరు నంగీకరింపఁ జాలరనియు వారు సమాధాన మొసఁగినారు.

వ్రాఁతప్రతు లన్నిటిలో "సాసిరదనానూర్నంద" అను పాఠమే యున్నచో నందువలన 300 సంవత్సరముల కాలవిభేద మేర్పడుచున్నప్పు డా పాఠము వ్యాకరణ దుష్ట మయినంతమాత్రమున శ్రీ నరసింహాచారిగారివంటి ప్రామాణిక చరిత్రకారుఁడు స్వయముగ దానిని "సాసిరద నాఱింసంద" అని మార్చివేసి సోమరాజును మూఁడువందల సంవత్సరములు ముందుకుఁ దెచ్చుటకుఁ బ్రయత్నింప సాహసించునని సహృదయులు తలంపఁజాలరు. వ్రాఁతప్రతులు కొన్నిటిలోనయిన "సాసిరదనాఱింసంద" అను పాఠ మున్ననేగాని వారు దానిని గయికొని యుండరు. కొన్ని ప్రతులలో వ్యాకరణ దుష్టమగు మఱొక పాఠ మున్నచో దానినే కవిపాఠమని, నిర్దుష్ట పాఠము వేఱొండు కావచ్చునన్నను విజ్ఞులు గ్రహింపఁజాలరు. కావున శ్రీ నరసింహాచారిగా రొసఁగిన సమాధానములఁబట్టి సోమరాజు కాలము క్రీ. శ. ౧౨౨౨ అనియే తలఁచుట సమంజసము.

ఇంతకు నేది యెట్లున్నను నితరమార్గము లనేకము లున్నప్పుడు కేవలము సోమరాజుపద్యమును బట్టియే మనము సోమనాథుని కాలమును నిర్ణయింప నవసరము లేదు. సోమనాథుని గ్రంథములందలి కొంతి యంతస్సాక్ష్యమునుబట్టియు, మఱికొన్ని యితర ప్రమాణములఁ బట్టియుఁగూడ నాతఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలముననే ప్రసిద్ధికి వచ్చి యటు తరువాత మఱికొంతకాలము జీవించియుండునని నిర్ణయింపఁదగును. అందుకు వలయు ముఖ్యాధారము లీక్రింద నుదాహరించుచున్నాను.

(౧) కొండవీటి దండకవిలెలో శకసంవత్సరము లేని మొదటి ప్రతాపరుద్రుని శాసన మొకటి యుదాహరింపఁబడినది. అందులోని కొంతభాగమును కీ. శే. శ్రీ మద్దులపల్లి గురుబ్రహ్మశర్మగారు "కొండవీటి సామ్రాజ్యము" అను గ్రంథమున నుద్ధరించియున్నారు. అది యిది:

"దదౌ ధరణికోటాఖ్యం బ్రహ్మప్రీత్యై పురం ముదా
చంద్రార్ధమకుటప్రీత్యై చంద్రవాదిపురం దదౌ
శేశవార్పణబుద్ధ్యావై దదౌ విత్తుపురం భువి
సోమనారాధ్యగురవే పిడుపర్తిపురం దదౌ
ఆదౌ ప్రతాపరుద్రాఖ్యో భూపాలో ధర్మపూర్వకం
సప్తర్షి సంఖ్యయా గ్రామాన్ దదౌ సప్తద్విజాయతే
ఏవం ప్రతాపరుద్రాఖ్యః కృతవాన్ రుద్రసంఖ్యయా"

మొదటి ప్రతాపరుద్రుని కాలమునఁ గాని, రెండవ ప్రతాపరుద్రుని కాలమునఁగాని సోమనారాధ్య గురుఁడు మఱొకఁ డెవఁడును గానరాఁడు. కావున నీ శాసనోదాహృతుఁడయిన సోమనారాధ్యుఁడు మన పాలకురికి సోమనాథుఁడే కాఁదగును. ప్రతాపరుద్రుఁ డొసఁగిన పిడుపర్తి నాతఁడు శివరాత్రి కొప్పయ్య మున్నగు శిష్యుల కొసఁగియుండును. ఆ గ్రామమును బట్టియే తరువాత నీ వంశమువారికి "పిడుపర్తి" యను గృహనామ మేర్పడియుండెను. గుంటూరుమండలమున తెనాలితాలూకాలో నిప్పు డొక "పిడుపర్తి" ఉన్నది. పద్యబసవపురాణకర్త పిడుపర్తి సోమనాథ కవివంశ్యులగు శ్రీ పిడుపర్తి రామలింగయ్యగారీ గ్రామము తమ పూర్వుల కగ్రహారముగా నీయఁబడినదే యని నాకొకమాఱు తెలియఁబఱచిరి.

కాకతీయచక్రవర్తులలో మొదటి ప్రతాపరుద్రునకు రుద్రదేవుఁ డనియేగాని ప్రతాపరుద్రుఁ డను వ్యవహారము లేదని కొందఱు వాదించెదరు. శాసనములలో నీతఁడు తఱచుగా రుద్రదేవుఁ డని యుదాహరింపఁబడినను బ్రతాపరుద్రుఁ డను వ్యవహారముకూడ నీతనికి

లేకపోలేదు. ఈతనికి విద్యాభూషణుం డను బిరుదము గూడఁ గలదు. నీతిసార మను గ్రంథ మొకటి యీతఁడు సంస్కృతాంధ్రముల రెంటనుగూడ రచించినాఁడు. రెండవ ప్రతాపరుద్రునికంటెఁ బూర్వుఁడును, వాతని మాతామహి రుద్రమదేవికి సామంతుఁడును నగు బద్దెన (భద్రభూపాలుఁడు) తన నీతిశాస్త్ర ముక్తావళిలోఁ బూర్వోక్తమయిన నీతిసారమును చేర్కొనుచు నందుఁ బ్రతాపరుద్రుఁ డనియే వ్యవహరించినాఁడు.

చ. "పరువడి సాంధ్రభాషఁ గల
బద్దన నీతియు సంస్కృతంబులోఁ
బరఁగఁ బ్రతాపరుద్రనర
పాలునిచే రచియింపఁబడ్డ యా
వరవరు నీతిసారము వి
నంజరువం గడు మంచిదంచుఁ జె
చ్చెరఁ గవి నీతిపద్ధతులు
చేసె వినోదము బాలబోధకున్."

ఇట్టి వ్యవహారము ననుసరించియే రుద్రదేవునకుఁ గూడ బ్రతాప విశేషణము కొన్ని శాసనములలోఁ గూడ నెడనెడఁ బ్రయుక్తమయి యున్నది. అందుకుఁ బూర్వోదాహృత శాసనముగూడ నిదర్శనము కాఁ గలదు.

(౨) విశ్వారాధ్యుఁ డను కర్ణాటదేశ పండితుఁడు మహిమ్నము, మల్హణము, మలయరాజీయము, అనామయము, హాలాయుధము నను శివపంచస్తవములకు సంస్కృతభాషలో వ్యాఖ్యానమును రచించినాఁడు. అందు గ్రంథాది నాతఁ డీక్రింది విధమునఁ జెప్పి కొని చివరను "ఇతి శ్రీమచ్ఛివాద్వైత సిద్ధాంత పారావార పారీణ విశ్వారాధ్య విరచిత శివపంచస్తవ వ్యాఖ్యానే" అని వ్రాసికొన్నాఁడు.

"పాషా దీశ్వరలోక గామిమహిమ శ్శ్రీమత్తటాకాబ్జరాజారాధ్యాన్వయదుగ్ధసింధువిలసచ్చంద్రోవరాకారవాక్
పద్యప్రాత్తైః పదవాక్యతర్కభరతాలంకారసంగీతవి
ద్విశ్వారాధ్యవిభు శ్శివాగమముఖవ్యాఖ్యానకృ
ద్భాసతే"

"ఇత్యాది సంస్తుతో లింగణార్యముఖ్యవిచక్షణైః
శివపంచస్తవానాంతు వ్యాఖ్యానం నకృతం పురా
వ్యాఖ్యా హీత్యాదరాధికా దాఖ్యాతోఽహం మనీషిభిః
వ్యాఖ్యామి తేషాంతోషాయ ప్రఖ్యాతం స్తవపంచకం"

దీనిలో విశ్వారాధ్యుఁడు తాను తటాకాబ్జ రాజారాధ్యుని యన్వయ మను పాలసముద్రమునకుఁ జంద్రుఁడనని చెప్పికొన్నాఁడు. "తటాకాబ్జరా" జనునది "కెరెయపద్మరసు" అను పదమున కాతఁ డొనర్చిన సంస్కృతీకరణము. కెరె యనఁగాఁ గన్నడమునఁ జెఱువని యర్థము. కర్ణాటదేశమందలి బేలూరు గ్రామమునఁ బద్మరసు తన యద్భుత మహిమముచే నొక తటాకమును గల్పింపఁగా నాతనికిఁ గెరెయపద్మర సను వ్యవహార మేర్పడెను. ఈ పద్మరసు కన్నడమున వీరశైవ దీక్షాబోధ మన్నగు గ్రంథములు రచించిన కవివతంసుఁడు. ఆతఁడు ద్వారసముద్రమున క్రీ. శ. ౧౧౫౦, ౧౧౬౦ ప్రాంతమునఁ బరిపాలన మొనరించిన నరసింహబల్లాలుని యాస్థానమున దండనాథుఁడుగా నుండి పరమతీయ పండితులఁ బలువుర నిర్జించి పేరెన్నిక గన్నవాఁడు. ఆతఁ డించుమించుగఁ గల్యాణ బసవేశ్వరునకు సమకాలీనుఁడు. ఈతని చరిత్రము పద్మరాజపురాణ మను పేరితో క్రీ. శ. ౧౩౮౫ ప్రాంతమున నాతని వంశ్యుఁడు పద్మణాంక కవి రచించి యందుఁ దన వంశానుక్రమణికను వివరించుచు మల్లరసు, సకలేశమాదరసు, మాయదేవ, కెరెయపద్మరసు, కుమారపద్మరసు, విశ్వారాధ్య, దేవారాధ్య, గౌరారాధ్య, దేవార్య, వీరణార్య, పద్మణ, పద్మణాంక (గ్రంథకర్త) అనువారిని గ్రమముగా నొకరికొకరు పుత్త్రులుగాఁ జేర్కొని విశ్వారాధ్యునీ క్రిందివిధమున విశేషముగ వర్ణించినాఁడు.

"ఆకెరెయపద్మణార్యోదరార్ణవవసుధాకరం
కుమారపద్మరసాద్యరీకృతియనో పుగనిశం
నిరుపమకుమారపద్మరసార్యరాత్మజం
పరమతధ్వాంతప్రచండభాస్కరనిశ

శరణచరణాబ్జచంచచ్చంచరీకం నమస్కృత సమస్త
కరదలింగదో శివద్యః ప్రసన్న తేవ జేడు [లోకం
నిరతిశయసంవిత్సుఖమనెద్దు దార్యప్ర
సరచక్రవర్తి విశ్వారాధ్య రెత్సు శివాగ్రగో ల్యలై సతతం"

ఇట్టి పాండిత్యమహిమములకుఁ దావలమయిన విశ్వారాధ్యుఁడు శివపంచస్తవవ్యాఖ్యాతయే యనుట సంగతముగా నున్నందున, శివధర్మగ్రంథమాలికలోఁ బ్రకటితమయిన శివపంచస్తవి యవతారికలో శ్రీ చిదిరె మఠము వీరభద్రశర్మగారు రాతఁడు కెరెయపద్మరసు మనుమఁ డనియే నిర్ణయించినారు. కెరెయపద్మరసు క్రీ. శ. ౧౧౬౦ ప్రాంతమువాఁ డగుటచే వాతని మనుమఁడు విశ్వారాధ్యుఁడు క్రీ. శ. ౧౨౪౦ ప్రాంతమువాఁడయి పాల్కురికి సోమనాథున కించుమించుగ సమకాలీనుఁ డగును. ఈతఁడు తన గ్రంథములో మల్హణస్తవమున ౩౬ శ్లోకముల నిచ్చి వ్యాఖ్యానించుచు వ్యాఖ్యావసానమునఁ బండితారాధ్యచరిత్రములోఁ బురాతనప్రకరణమున మల్హణుని కథలోఁ బాల్కురికి సోమనాథుఁడు—

"తనరు సద్భక్తిఁ 'గాంతాకచప్రచయ'
యనుచు నద్యుక్తుఁడై హరు మనం బలరఁ
బ్రస్తుతాలంకారబంధురమధుర
విస్తారమతిమల్హణస్తోత్ర మనఁగ
నప్పుడు ముప్పదియాఱు శ్లోకములు
సెప్పినంతట మెచ్చి శివుఁడు మల్హణుని."

అని వ్రాసిన వాక్యములఁ బురస్కరించుకొని యీ క్రిందివిధమున వ్రాసినాఁడు :

"యద్యపి కాంతాకచేత్యాదిషట్త్రింశద్వృత్తై స్తోత్ర మిదం మల్హణేనాభాణీతి పాల్కురికి సోమేశ్వరేణ భణితం, తథా ప్యపరితనం వృత్తత్రయం బహు పుస్తకస్థితత్వా ద్బహుపాఠసమ్మతత్వా ద్వ్యాఖ్యాతం వస్తుతస్తు యుక్తిమద్భిః ప్రతిక్షిప్తం శ్రీమత్సోమేశ్వర వచనప్రామాణ్యా దితి సర్వం శివం."

కావున దీనినిబట్టికూడ సోమనాథుఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలమువాఁ డనుటయే సంగతముగా నుండును.

(౩) పండితారాధ్య చరిత్రావతారికలో సోమనాథుఁడు తాను "పేరెన్నఁబడిన శ్రీ బెలిదేవి వేమ - నారాధ్యులను పరమారాధ్య దేవు-మనుమని శిష్యుండ" నని చెప్పికొనినాఁడు. ఈ బెలిదేవి వేమనారాధ్యుఁడు బసవేశ్వర మల్లికార్జున పండితారాధ్యులకు సమకాలీనుఁ డనియు, నాతఁడు సూరసానమ్మ మొదలగు భక్తులు మల్లికార్జునపండితునియొద్ద కేఁగి బసవేశ్వరుని మహిమముల నాతని కెఱిగించి రనియుఁ బండితారాధ్య చరిత్రలోని దీక్షాప్రకరణమునుబట్టి తెలియనగును.

"కాంతసుణకదంబ కాంత సూరాంబ
పేరెన్నఁబడిన శ్రీ బెల్దేవి వేమ
నారాధ్యు లాదిగా నలరు జంగములు
దవిలి పండితవిభు దర్శించు వేడ్క
....
సన్నుతలీల మజ్జన మాచరించు
సమయంబునను సూరసానమ్మ జంగ
మము బెలిదేవ వేమనపండితులును
జనుదేర..................."

ఈ బెలిదేవి వేమన చరితము పండితారాధ్య చరిత్ర పురాతన ప్రకరణములోఁగూడ వర్ణింపఁబడినది. దానినిబట్టికూడ నాతఁడు బసవేశ్వరునకు సమకాలీనుఁడయి యాతనియెడ విశేషభక్తి కలవాఁడని తెల్లమగును. బసవేశ్వరుఁడు క్రీ. శ. ౧౧౬౭ ప్రాంతమువను, మల్లికార్జునపండితుఁ డటుతరువాత సమీపకాలములో క్రీ. శ. ౧౧౭౦ ప్రాంతమువను లింగైక్యమయియుందురని చరిత్రజ్ఞులు పలువు రంగీకరించిన విషయమే. కావున బెలిదేవి వేమనారాధ్యుఁడుకూడ నాకాలమువాఁడే యగును. దానినిబట్టి సోమనాథుని విద్యాగురులలో నొకఁడగు నాతని మనుమఁడు క్రీ. శ. ౧౨౦౦ ప్రాంతమువాఁ డగును. ఇందుచేఁగూడ సోమనాథుఁడు రెండవ ప్రతాపరుద్రుని రాజ్యకాలమున నుండెననుట పొసఁగనేరదు.

(౪) శ్రీశైలక్షేత్రమున జరగిన యొద్దోలగమున సోమనాథునకు బసవపురాణ కథానూత్రముల నెఱిఁ

గించిన పెద్దలలోఁ గరస్థలీ సోమనాథయ్య యొకఁడని బసవపురాణావతారికవలన వ్యక్తమగును.

"జంగమ రత్నంబు శరణసమ్మతుఁడు
లింగైక్యవర్తి గతాంగవికారి
పండితారాధ్య కృపాసముద్గతుఁడు
మండిత సద్భక్తి మార్గప్రచారి
విలసితపరమ సంవిత్సుఖాంభోధి
వలిఁ గరస్థలి సోమనాథయ్యగారు"

దీనినిబట్టి యీకరస్థలిసోమనాథుఁ డాకాలమునఁ బ్రసిద్ధుఁడగు మల్లికార్జున పండితారాధ్యునివలన దీక్ష నొందిన శిష్యుఁడని కావచ్చును. ఆతఁడు బసవపురాణ రచనాకాలము నాఁటికి వృద్ధుఁడయియుండును. దీనిని బట్టి కరస్థలి సోమనాథయ్య జీవించియున్న క్రీ. శ. ౧౧౯౫ ప్రాంతముననే బసవపురాణము రచింపఁబడె నని తలఁచుట సమంజసముగా నుండును.

(౫) పండితారాధ్యచరిత్రావసానమున సోమనాథుఁ డా గ్రంథరచనాకాలము నాఁటికి మల్లికార్జున పండితుని గురుపట్టమును స్వీకరించి నిర్వహించుచున్న యాతని మనుమలు, మనుమపండితుఁడు మున్నగు నలుగురిని, మల్లికార్జునపండితుని పుత్త్రుఁడు కేదారయ్యకు శిష్యుఁడయిన ఇవటూరి సోమనాథుని కుమారులు నాగీశ్వరుఁడు మొదలగు మువ్వురను పేర్కొని వారు తనయ తనయపరంపరలో త్తరపరంపరలుగా వర్ధిల్లి తేజరిల్లుఁ గావుతమని యాశీర్వదించి గ్రంథసమాప్తి గావించినాఁడు. ఆ పట్టును సావధానముగఁ బఠించువారికిఁ బండితారాధ్యచరిత్రను సోమనాథుఁడు రచించునప్పటికిఁ బూర్వోదాహృతులయిన మల్లికార్జునపండితుని పౌత్రులు, నాతని శిష్యసంతానమునకుఁ జెందిన ఇవటూరి సోమనాథయ్యపుత్త్రులు సజీవు లయి యున్నట్లు వ్యక్తమగును. ఇందువలనఁగూడ సోమనాథుని పండితారాధ్యరచనాకాలమును క్రీ. శ. ౧౨౩౦ ప్రాంతముకంటెఁ గ్రిందికిఁ దెచ్చుట కవకాశ ముండఁజాలదు.

(౬) సర్వేశ్వరశతకమును రచించిన యథావాక్కుల అన్నమయ్య తన గ్రంథరచనా కాలము శా. శ. ౧౧౬౮ (క్రీ. శ. ౧౨౪౬) అని స్పష్టముగఁ బేర్కొనినాఁడు. ఆ శతకమును సావధానముగఁ జదివినవారి కాతఁడు సోమనాథుని యనుభవసారమును, బండితారాధ్యచరిత్రమును బాగుగాఁ బరిశీలించి యందలి భావములను, బదజాలమును బలుతావుల ననువదించిన తెలుఁగు విశదము కాఁగలదు. అట్టి సంవాదములు కొన్ని భారతి సం. ౨౧ సం. ౧౧; సం. ౨౨. సం. ౩లలో శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు ప్రకటించిన "శివకవి యథావాక్కుల అన్నమయ్య" అను వ్యాసమునఁ జూడఁదగును. ఇదికూడ సోమనాథుఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలమువాఁ డను నిర్ణయమునకే తోడ్పడఁజాలును.

సోమనాథుని బసవపురాణమునుబట్టి క్రీ. శ. ౧౩౬౮ నాఁటికే భీమకవి తన కన్నడబసవపురాణమును రచించినాఁడు. సోముని పండితారాధ్యచరిత్రమును శ్రీనాథుఁడు క్రీ. శ. ౧౩౬౫ ప్రాంతము నాఁటికే పద్యకావ్యముగ ననువదించినాఁడు. సోమనాథుని యీ కృతులు రెండవ ప్రతాపరుద్రుని కాలము నగు క్రీ. శ. ౧౨౯౦, ౧౩౨౦ మధ్య రచింపఁబడె నన్నచో నవి విశేషవ్యాప్తి నంది యంత సమీపకాలములోఁ బయిని జెప్పిన కవులచే ననువదింపఁబడుటకుఁ దగిన యవకాశ ముండనేరదు. మఱియు సోమనాథుని కాలము నాఁటికి నూటికిఁ దొంబదివంతులు తేట తెనుఁగుపదములతోఁ గూర్పఁబడిన తిక్కనభారతము విస్తృతి వ్యాప్తియం దున్నచో

"ఉరుతరగద్యపద్యోక్తులకంటె
సరసమై పరఁగిన జాను తెనుంగు
చర్చింపఁగా సర్వసామాన్యమగుటఁ
గూర్చెద ద్విపదలు గోర్కి దైవార"
"అరూఢగద్యపద్యాదిప్రబంధ
పూరితసంస్కృతభూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబుగామి
జాను తెనుఁగు విశేషము ప్రసన్నతకు"

అని యాంధ్రకృతిరచనములో జాను తెనుఁగును గూర్చునావశ్యకతను గుఱించి సోమనాథుఁడు తన గ్రంథావతారికలో నంతగాఁ బలవరింపవలసిన యవసరము కానరాదు.

ఇట్టి బలవత్కారణములనుబట్టియే పిడుపర్తి సోమనాథుఁడు పాలకురికి సోమనాథుని యనంతరము ౩౦౦ సంవత్సరములకు వెలసిన యాతని శిష్యప్రశిష్య కోటిలోనివాఁ డవుటచేఁ దన వినికిలినిబట్టి యాతఁడు వ్రాసిన విషయములలోను, నాతఁడు చెప్పికొన్న వంశానుక్రమణికలోను గొన్ని వ్యత్యయములు దొరలి యుండు నని తలఁచి, పాల్కురికి సోమనాథుఁడు రెండవ ప్రతాపరుద్రుని కాలమువాఁ డను తొల్లిటి యభిప్రాయమును బోవిడిచి యస్మదాదు లాతని కాలము క్రీ. శ. ౧౧౬౦–౧౨౪౦ గా నిర్ణయించుటకుఁ గారణమయినది. ఆంధ్రపత్రిక దుందుభిసంవత్సరాది సంచికయందు నేను మొదట సూచించిన యీ నిర్ణయమును శ్రీ ప్రభాకరశాస్త్రిగారుకూడ బసవపురాణపీఠికలో ననుగమించిరి. తరువాతఁ గాకతీయ సంచికలోఁ బ్రకటించిన "పాలకురికి సోమనాథకవి" యను వ్యాసమునఁ గూడ నీనిర్ణయమునే నే నవలంబించియుంటిని. చరిత్రచతురాననులు శ్రీ వీరభద్రరావు పంతులుగారుకూడ దీని నామోదించిరి. ఇట్టి పరిస్థితులలో శ్రీ సోమశేఖర శర్మగారు తమ వ్యాసమున నీయుపపత్తులను జేనిని బరామర్శింపక యౌదాసీన్యము వహించుటకుఁ గారణము కానరాదు.

సోమనాథుని కర్ణాటదేశ నిష్క్రమణ విషయమున నాంధ్రదేశము త్వరలోఁ దురుష్కాక్రాంతము కానున్నదని దివ్యదృష్టిచే నెఱిఁగి తన యాచారనియమముల కచ్చట నవకాశ ముండదని శిష్యులతోఁ జెప్పి యాతఁడు కన్నడభూమి కరిగెనని పిడుపర్తి సోమనాథుఁడు పద్యబసవపురాణావతారికలోఁ జెప్పిన సంగతులు సరియైనవి కావు. క్రీ. శ. ౧౩౦౦ లోపున మహమ్మదీయు లాంధ్రరాజధానియగు నోరుగంటిపై దండయాత్రలు సాగించినట్లు కానరాదు. మఱియు సోమనాథునివంటి మహిమాన్వితుఁడు మహమ్మదీయుల దాడులకు వెఱచి జన్మభూమిని విడిచి పోయె ననుట సత్యసమ్మతము కాఁజాలదు. ఇంతకు దక్షిణాపథమునందలి కన్నడదేశముమాత్ర మా నాఁడు మహమ్మదీయ దండయాత్రలకు గుఱిగాక భద్రముగ నుండెనా? పిడుపర్తి సోమనాథున కించుకపూర్వుఁడో, సమకాలీనుఁడో యగు తోంటద సిద్ధలింగకవి కన్నడమున సోమేశ్వరపురాణము పేరితోఁ బాల్కురికిసోమనాథుని చరిత్రమును రచించియున్నాఁడు. దానిలో నిట్టి గాథ లేమియు నాతఁడు తెలుపలేదు. కర్ణాటదేశమునఁ గపుద్గిరి దక్షిణభాగమున విలోల్లు తారకాచలమునఁ గల్లియ మనుపురమం దగణిత శీలసంపన్నులగు శివభక్తు లనేకులు వసించుచుండి రనియు, వారిలోఁ జెన్నమ్మ యను మహాభక్తురాలు చతుష్షష్టి శీలనిర్వహణమునందు "సభూతో సభవిష్యతి" అను విఖ్యాతితో వెలయుచుండె ననియు, నీ వార్త విని సోమనాథుఁ డామెను సందర్శించు వేడ్కతోఁ దన పుత్త్రుఁడు చతుర్ముఖబసవేశ్వరుని, మిత్రుఁడు పాలకురికి వీరనామాత్యుని, శిష్యుఁడు చక్రపాణిరంగనాథుని వెంటఁగొని పాలకురికినుండి ప్రయాణమయి యాకళ్యక్షేత్రమునకుఁ జని యటఁ జెన్నమ్మ యొనర్చిన పూజల నంగీకరించి, యామెయాదరానురోధాది కారణములవలన తన చరమదశ వచ్చుటఁగడపి, కుమారుఁడు చతుర్ముఖబసవేశ్వరునకు గురుపట్టము కట్టి, తానొక సమాధి చేర్పఱచికొని యందు శివైక్య మయ్యె నని తోంటదార్యుఁడు వివరించినాఁడు. ఈ కళ్యక్షేత్రము బెంగుళూరుజిల్లా మాగడితాలూకాలో బెంగుళూరునకు నలుబదిమైళ్ల దూరములో నున్నది. అచ్చట సోమనాథుని సమాధి యిప్పటికిఁగూడ భద్రపఱుపఁబడి యున్నది. కావున సోమనాథుఁడు తన యంతిమదశలోఁ గన్నడభూమి కేఁగి యచ్చట శివైక్యమయిన విషయమున మనము తోంటదార్యుని వ్రాఁతలకే విశేషప్రామాణ్య మీయఁదగును.

ఇఁక శ్రీ సోమశేఖరశర్మగా రుదాహరించిన నీలగంగవరముశాసనము సోమనాథుఁడు రెండవ ప్రతాప

రుద్రుని కాలమువాఁ డని నిర్బాధకముగ, నిస్సంశయముగ నిరూపించుటకుఁ జాలియున్నచో మనము పూర్వోక్తవిషయముల నెట్లయినఁ బూర్వపక్షముచేయుటకుఁ బ్రయత్నింపవచ్చును. కాని యీశాసన మందుకు సమర్థముగా లేదనియే నామనవి. ఈశాసనము గుంటూరుజిల్లా వినుకొండతాలూకానీలగం గ వర మగ్రామములో నొక పొలములో నున్న శిలాఖండము పయి రెండు ప్రక్కలను జెక్కఁబడియున్నది. దానిలో మొత్తము ౬౬ పంక్తు లున్నవి. అందులోఁ గొన్ని భాగములు శిథిలములై శిలాఖండముకూడఁ బయిభాగమున రెండు చెక్కలయియున్నది. రెండవ ప్రతాపరుద్రునకు, నాతని మాతామహి రుద్రాంబకు సామంతుఁడుగా నుండిన అంబయదేవుఁడు శా. శ. ౧౨౧౨ (క్రీ. శ. ౧౨౯౦) సంవత్సరమునఁ ద్రిపురాంతకక్షేత్రవాస్తవ్యుఁడగు రెండ్రేవుల మల్లినాథయ్య యను మాహేశ్వరునకు మొల్లకల్లూరుగ్రామమును దానమొసఁగిన విషయము నిది వివరించును. దీనిని మొట్టమొదట ౧౯౪౦-వ సం.లో శ్రీ ఆర్. యస్. పంచముఖి,యం. ఏ.గారు ఎపిగ్రాఫియా ఇండికా (సం. ౨౦-భా. ౬) లోఁ బ్రకటించియున్నారు. దీనిలో మొదటి 3౦ పంక్తులలోను అంబయదేవుని వంశము, పరాక్రమము మున్నగునవి వర్ణింపఁబడినతరువాత 3౧-3౫ పంక్తులలో దానప్రస్తావమును దెలుపు "శాకే భానువర్క సంఖ్యావిలసితవిక్రుతే......"*అను శ్లోకము,నటుతర్వాత 3౬-౫౧ పంక్తులలో శాసనములందుఁ దఱచుగఁ గానవచ్చు ఫలశ్రుతిశ్లోకములును, దదనంతరము శాసనరచయితనామోల్లేఖనము గల శ్లోకము చెక్కఁబడి యంతటితో శాసనమందలి సంస్కృతశ్లోకభాగము సమాప్తము గావింపఁబడినది. అటుతరువాత ౫౨-౬౦ పంక్తులలో దానప్రస్తావనము మరలఁ దెలుఁగువచనములో లిఖింపఁబడినది. అపిమ్మట సందర్భరహితముగ ౬౧-౬౬ పంక్తులలో మరల నొక సంస్కృతశ్లోక మీక్రిందివిధముగఁ జెక్కఁబడినది:

"(దే)వీ యస్య(స్వకీయం) త్రిపురవిజయి(నే)
చక్షు(రు)త్పాట్యపూజా(ం)
(కృ)త్వా కేకీ తతో పి(ద్ధ)తరమమలం
రోచయా(భా్య)ప్రసి(ద్ధా),
పూర్వద్వారే కుమారక్షితిధ్రుమపరిత
స్తస్య రాశేః పురస్తాత్
రమ్యం సోపానమార్గం(సుఖకర)మమలం
దుష్యః ప్రతిజ్ఞాం విధాయ."

ఇది యర్థము కొంతవఱకయిన సరిపడుటకయి శ్రీ పంచముఖిగారును, దదుపరి శ్రీ సోమశేఖరశర్మగారును ఈ శ్లోకమున కొసఁగిన పరిష్కృతపాఠము. కుండలీకరణములందలి యక్షరములు వారి పూరణములను, బరిష్కరణములను సూచించును. శాసనమంతయుఁ బూర్తియైన తరువాత నీ శ్లోక మసంగతముగ నీ శిలపయి నెప్పు డెవరిచేఁ జెక్కఁబడినదో నిదమిత్థముగ నిర్ణయింపరాదు. ఇందుఁగూర్చి శ్రీ పంచముఖిగారుకూడ నిట్లు వ్రాసియున్నారు:

" Lines 61–66 also contain a verse in corrupt Sanskrit the sense of which is not quite clear "

బసవపురాణావతారికలో సోమనాథుఁడు తన కావ్యగ్రంథరచనమునకయి శ్రీశైలక్షేత్రమున నొడ్డోలగమున నుద్బోధనము గలిగించిన భక్తవరులఁ గొందఱఁ జెప్పుచుఁ దాను బయిని నుదాహరించిన పండితారాధ్యకృపానముద్ధరుఁడు కరస్థలి సోమనాథయ్యతో పాటు, కుమారాద్రికిఁ దూర్పుదెసను సోపానములు కట్టించిన రెంటాల మల్లినాథుని, శివునకు నిత్యము నయిదు కరవీరపువ్వుముల నర్పించు వ్రతము గలిగి

*" శాకేభానువర్క సంఖ్యావిలసితవిక్రుతే
వత్స(రే) భాద్రమాసే
దర్శేసోమస్యవారేసుకృతిని సమయే
ద్వాదశార్థోపరాగే
ప్రాదాదంబక్షితీంద్రః ప్రథితశివపురం
మొల్లకల్లూరినామ
గ్రామంమాహేశ్వరాయ ప్రకటితమ..."

యొకనాఁ డం దొకటి తక్కువకాఁగా నిజనేత్ర మర్పించి శివానుగ్రహమున సహస్రశాంబకము వడసి కీర్తిగొన్న దోచమాంబను వర్ణించి యున్నాఁడు.

"ఆది వేదాంత సిద్ధాంతపురాణ
వేదశాస్త్రాగమ విహితమార్గములఁ
దనుమనోధనని వేదన సమగ్రతను
బనుగొని జంగమార్చనలు సేయుచును
శీలంబుదనర సీమోల్లంఘన వ్ర
తాలంకృతిని బేర్చి యాచారలీల
నసలారఁగాఁ గుమారాద్రికిఁ దూర్పు
దెసను సోపానముల్ దీర్చి పాల్పార
మహితసద్భక్తి సమంచితవృత్తి
మహిఁ జను రెంటాల మల్లినాథుఁడును
నిరతిశయప్రీతి నిత్యంబు నైదు
కరవీరపుష్పముల్ హరునకర్పింప
నొక్కనాఁ డొకఁడందుఁ దక్కువయైనఁ
గ్రక్కునఁ దననేత్ర కమలమర్పించి
భవునిచే సహస్రశాంబకముఁ బడసి
ధ్రువకీర్తిఁ బేర్కొన్న దోచమాంబయును"

పూర్వోక్తమయిన నీలగంగవరముశాసనమున వెల్లకల్లూరునామకగ్రామమును శివపురముగా దాన మంజేసిన రెండ్రేపుల మల్లినాథుఁడే సోమనాథుఁడు పేర్కొనిన రెంటాల మల్లినాథుఁ డనియుఁ, గడపటి శ్లోకములో నుదాహరింపఁబడిన దోచయాఖ్యదేవియే సోమనాథుఁ డుగ్గడించిన దోచమాంబ యనియు శ్రీ సోమశేఖరశర్మగారి యభిప్రాయము. "రెండ్రేపుల" యను రూపమే క్రమముగ రెండ్రేల, రెండేల, రెండాల, రెంటాల అను పరిణామములఁ జెందియుండు నని వారి తలంపు. ఈ సమర్థనము కేవల మసంగతమని చెప్పనక్కఱలేదు. రెంటాల యనునది గ్రామనామము. ఆ గ్రామ మాపేరితో గుంటూరుజిల్లా పల్నాడు తాలూకాలో నిప్పటికిఁగూడ నున్నది. ఇంతకు ఛందోబద్ధమయిన సోమనాథుని బసవపురాణములోనే మల్లినాథుని యింటిపేరు స్పష్టముగ "రెంటాల" అని చెప్పఁబడియుండఁగా నిట్టి వాదమున కవకాశమే లేదు. తోంటదార్యుని సోమేశ్వర పురాణములోఁగూడ రెంటాలమల్లినాథుఁ డాపేరితోడనే యుదాహృతుఁ డయినాఁడు. కావున శాసనమందలి దానప్రతిగృహీత రెండ్రేపుల మల్లినాథుఁడు, సోమనాథుని మిత్రుఁడు రెంటాల మల్లినాథుఁడు నేకవ్యక్తియే యనుట సంగతము గాదు. ఇంతకు మల్లినాథునిఁగూర్చి సోమనాథుఁ డుగ్గడించిన ప్రశస్తి కుమారాచలద్వార సోపాన నిర్మాణము మున్నగునవి రెండ్రేపుల మల్లినాథుని విషయమున శాసనమున నేమియుఁ జెప్పఁబడియుండలేదు. మొదటఁ జెప్పిన సంస్కృతశ్లోకములో నాతని పేరైనను గానరాదు. ఇది స్రగ్ధరావృత్తము. నాల్గవ పాదములోఁ జివరను శిథిలములయినవి తొమ్మిది యక్షరములు మాత్రమే. "గ్రామం మాహేశ్వరాయ ప్రకటితమ (హానే మల్లినాథాహ్వయాయ)" అని యీపాదమునకుఁ గవిపాఠ మయియుండును. ఇందుఁ బ్రతిగృహీత గృహనామమును బేర్కొనుటకుఁగూడ నవకాశము కవికి లేకపోయినది. అందుచేతనే కాఁబోలు మరల దానప్రస్తావనము తెలుఁగున వచనమునఁ బ్రతిగృహీత యింటిపేరితోఁగూడఁ జివరను గూర్పఁబడినది. ఇందుఁగూడ నాతఁడు త్రిపురాంతక వాస్తవ్యుఁ డని చెప్పుటమాత్రమే గాని యాతని ప్రశస్తి యేమియు వివరింపఁబడలేదు. శర్మగారు సోమనాథుఁడు మల్లినాథునిఁగూర్చి చెప్పిన సోపాననిర్మాణము శాసనమునఁగూడ నాతనియెడఁ బేర్కొనఁబడిన దని తమ వ్యాసములో వ్రాసియున్నారు. కాని యిది పొరపాటని నా యాశయము. శాసనస్థ శ్లోకమును, తెలుఁగువచనమును వారు మరలఁ జిత్తగింతురుగాక! కడపట దోచయదేవిని గుఱించిన శ్లోకములోనే యామె నయనార్పణ పునరాదానమహిమతోపాటు కుమారాద్రిపయిని త్రిపురాంతకదేవుని యెదుట నామె నిర్మింపఁజేసిన సోపానప్రశంసగూడఁ బేర్కొనఁబడినది. దీనికిని, మల్లినాథుని విషయమున సోమనాథుఁడు చెప్పిన కుమారాచలప్రాగ్దిశాసోపాన నిర్మాణమునకును నెట్టి సంబంధము లేదు. దోచయాఖ్యదేవి నేత్రకమలసమర్పణవిషయమునఁగూడ శాసన

శ్లోకమందలి సంగతులకు, బసవపురాణమునఁ జెప్పిన సంగతులకు సంపూర్ణైక్యము గానరాదు. దోచమాంబ త్రిపురాంతకక్షేత్రవాసి యనికాని, యామె కన్య నర్పించి మరలఁ బడసినది త్రిపురాంతకదేవునివలన నని కాని సోమనాథుఁడు చెప్పలేదు. శివునకు నిత్య మయిదు కరవీరముల నర్పించు వ్రతము గల యామెకు వ్రతపరీక్షణమున జరిగిన విషయమే యాతఁడు పేర్కొనినాఁడు. నిత్యకరవీరపుష్పపంచకార్పన ప్రశంస శ్లోకమున లేనేలేదు. కావున సోమనాథుఁడు పేర్కొనిన దోచమాంబయు, శాసనమునఁ బేర్కొనఁబడిన దోచయదేవియు నేకవ్యక్తియే యని చెప్పుటకుఁ గూడ నవకాశములు లేవు. ఇంతకు నీదోచయ యెవరో శర్మగారు నిరూపింపఁ బ్రయత్నించలేదు. "దేవీ కృతాభిషేకాయా"మ్మను నైఘంటికప్రమాణమునుబట్టి దేవీశబ్దము సాధారణముగా రాజభార్యల విషయము నసే ప్రయుక్తమగును. ఈమె దాతయగు అంబయదేవుని భార్యయే యైనచో నంతటి మహిమాన్వితురాలి ప్రశంస శాసనమున నంత యుదాసీనముగ, నసంగతముగ, ననన్వయముగ శాసనాంతమున నుదాహరింపఁ బడనేల? అంబయదేవుని వర్ణనసందర్భముననే యామె విషయముగూడ వర్ణింపఁబడుట సాజముగదా! అట్లు జరగకుండుటకుఁ గారణమేమి? "దేవీ యస్య"అని యచ్ఛబ్దము ప్రయుక్తమయినప్పు డందుకు సంబంధించిన తచ్ఛబ్దవాచ్యుఁ డెవఁడో స్పష్టముగఁ జెప్పఁబడ వలెనుగదా! "శాకే భావ్వర్క-సంఖ్యా..."అను శ్లోకమునకుముందే యీ శ్లోకము చేరవలసి పొరపాటున శాసనముచివరఁ జెక్కఁబడిన దని తలఁచినను నప్పుడు గూడ రెండు శ్లోకములకు సమన్వయ మంతగాఁ గుదురకున్నది. అంబయదేవుని శాసనములలో నిది యొక్కటియేగాక యింకను ననేకములు లభ్యములయి యున్నవి. వానిలో నీలగంగవరము శాసనము వేసిన శా. శ. ౧౨౧౨ సం. నందే యాతఁడు వెలయించిన త్రిపురాంతక శాసనము ముఖ్యము, విపులమునయి యున్నది. అందులో నాతని విజయవివరములు, పుత్రికావివాహసమయమున నల్లున కొసఁగిన యరణము మున్నగు సంగతు లనేకములు విపులముగ వర్ణింపఁబడిన వని శ్రీ పంచముఖిగారు వ్రాసియున్నారు. అట్టియెడ విశేషమహిమాన్వితయగు దోచయాంబ యాతని భార్యయే యైనచో నామెప్రశంస యా త్రిపురాంతక శాసనమునఁ జేయకుండుటకుఁ గారణము కానరాదు. ఉపలబ్ధములయిన యంబయదేవుని శాసనములలో నెచ్చటను నాతని భార్యపేరు దోచయ యని చెప్పఁబడి నట్లు లేదు. చెప్పియేయున్నచో శ్రీ పంచముఖిగారు "దేవీ యస్య" యను శ్లోకమున కర్థము సంగతముగా లేదని వ్రాసియేయుండరు. ఈ శ్లోకమున దోచయ త్రిపురాంతక దేవునకు క్షేత్ర మర్పించి మరలఁ బడసె నని చెప్పుటచే నామె యా స్వామిని సేవించు త్రిపురాంతకక్షేత్రవాసిని యని యూహింపఁదగును. అంబయదేవునకుఁ ద్రిపురాంతకము రాజధాని గాదు. అతఁడు కడపజిల్లా వల్లూరు, గండికోటపట్టణములు రాజధానులుగాఁ బరిపాలించినట్లు కానవగును.

మఱియు నీ శ్లోకమునఁ గ్రియాపదములు సరిగా లేవు. రెండవ పాదమునఁ జెప్పఁబడిన "శశ్రే" (ప్రకాశించెను) అనునది భూతకాలికక్రియ. "భూతానద్యతనపరోక్షే లిట్" అను సూత్రముచొప్పున గడచినట్టియు, నేఁటిది కానట్టియు, వక్త స్వయముగా నెఱుఁగనట్టియు వృత్తాంతవిషయముననే లిడ్రూప ముపయోగింతురు. "శశ్రే" అనుటకన్న "భేజే" యనిగాని, "శేధే" యనిగాని యున్నచో నర్థము బాగుగాఁ గుదురును. వీనిలో నేది కవిపాఠమయియున్నను నిందుఁ బ్రయుక్తమయినది భూతకాలికరూపమే యనుట స్పష్టము. సోపాననిర్మాణ విషయమున నాల్గవ పాదమునఁ గ్రియాపదము లోపించినది. "ద్యుః ప్రతిజ్ఞాం విధాయ"అనుచో నర్థము కుదురుటలేదు. ఇచ్చట 'ద్యుః' అనునది "ద్యోః" అనుటకు మాఱుగా చేర్పడిన లేఖకదోషమేమో యని తోఁచుచున్నది. అట్లయినచో ద్యోః=స్వర్గమునకు, ప్రతిజ్ఞాం విధాయ = ప్రతినచేసి, అనఁగా స్వర్గమధిరోహించుటకయి కట్టిన మెట్టులో యనఁ ద్రిపురాంతకేశ్వరునెదుటఁ సుమారాద్రిపయి సోపానములు నిర్మించెనని యర్థ మేర్పడును. ఎట్లు

చూచినను శ్లోకమునఁ జేర్కొనఁబడిన దోచయాఖ్య యేదియో భూతకాలిక వ్యక్తియేగాని శాసనరచనా కాలమున జీవించియున్న వ్యక్తిగాఁ గానరాదు.


ఆమె యంబయదేవుని వంశమునకుఁగాక దాన ప్రతిగ్రహీతయగు రెంట్రేవుల మల్లినాథయ్యగారి వంశమునకుఁ జెందినదని తలఁచినను, "రెంట్రేవుల" యనునది శాసనమును జెక్కుటలోనే "రెంటాల" యను టకు మాఱుగాఁ దప్పుగాఁ జెక్కిన రూపమని యెంచి నను నీశాసనమందలి మల్లినాథుఁడు సోమనాథుని బసవ పురాణమునఁ జేర్కొనఁబడిన మల్లినాథుఁడుగాక యాతని వంశమునకుఁ జెందిన యా పేరు గల యాతని మనుమఁడో, మఱొకఁడో యైయుండుననియు, దోచ యాంబ యాతని పితామహియో, మఱియొకతెయో యైయుండుననియుఁ దలంపనగునేమో!

తోంటదార్యుఁడు సోమేశ్వర పురాణమున సోమనాథుని మిత్రుఁడు పాలకురికి మారనామాత్యుని దృగర్పిత పునరాదాన మహిమను వర్ణించు సందర్భ ములోనే తాదృశవీరభక్తి నెఱపిన భక్తుల మఱికొంద అను జేర్కొనుచు సోమనాథుఁడు బసవపురాణమున దోచమాంబనుగూర్చి చెప్పిన విషయములను దార్కాణ చేసి వానిని రెంటాలమల్లినాథుని పరముగా నిట్లు చెప్పి యున్నాఁడు:

"సల్లలిత కరవీరపుష్ప సైదంపూజ
సల్లియొందల రల్లదిరనోడి రెంటాల
మల్లినాథం తన్న నేత్రమం కి త్తర్పిసిదను నిజనిష్ఠయిం ద"

ఇట్లే సోమనాథుని బసవపురాణమును జూచి యందలి విషయములు లెస్సగా గుర్తింపక తార్కాణ చేసి రెంటాల మల్లినాథునియెడఁ జెప్పఁబడిన సోపాన నిర్మాణము కొన్ని వ్యత్యాసములతో నీలగంగవరము శాసనమున దోచయాంబనుగూర్చిన శ్లోకములో నామె పరముగాఁ జెప్పఁబడెనేమో యనికూడ నూహింప నవ కాశము కలుగుచున్నది.

బసవపురాణావతారికలో సోమనాథుఁడు రెంటాల మల్లినాథునకు, నాతని వెనువెంటనే పేర్కొ-నిన దోచమాంబకుఁ గల సంబంధ మేదియుఁ జెప్ప లేదు. దోచమాంబ రాజభార్య యనియైన నాతఁడు చెప్పలేదు. వాస్తవముగ నట్టి దేమయిన నున్నచో నాతఁ డుదాహరింపకుండునా? కావున నెట్లు చూచి నను సోమనాథుఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలము నఁగాక రెండవ ప్రతాప రుద్రుని కాలముననే యుండెనని నిర్ణయించుటకుఁగాని, యందు కను గుణముగా బసవపురాణము రెండవ ప్రతాపరుద్రుని రాజ్యారంభమున క్రీ. శ. ౧౨౯౦ ప్రాంతమునను, పండితారాధ్యచరిత్ర క్రీ. శ. ౧౩౨౦ ప్రాంతమునను రచింపఁబడెనని శ్రీ సోమశేఖరశర్మగారు తలంచినట్లు నిర్ణయించుటకుఁగాని నీలగంగవరశాసనమందలి విషయ ములు తగిన ప్రమాణములు కాఁజాల వని మనవిచేయు చున్నాను. కావున శ్రీశర్మగారును, దదితర పరిశోధకు లును బయివిషయముల నెల్ల బాగుగఁ బర్యాలోచించి యింకను సమ్యక్పరిశోధనముగావించి సోమనాథుని కాలమును నిర్బాధకముగ నిదమిత్థమని నిర్ణయింపఁ బ్రార్థించుచున్నాను.



- మందుమాత్ర మ్రింగుట -

రిడ్జివెల్ గారి చిత్తరువున కనువాదము.

చందమామ

●

— శ్రీ జనమంచి రామదాసు —

హృదయాంతరాళమ్ము పొంగిపొరలే వేళ
తీయతీయని గీతి విస్తరిల్లే వేళ
కోకిలమ్మల స్వనము ప్రజ్వరిల్లే వేళ
నీమోము చూపవా చందురూడా,
    సితకాంతి నివ్వవా చందురూడా.


అద్దాల మిద్దెలో నందగాడవటోయి
నీ చూపు నీ గుండె నవనీతమంటోయి
ఆననం బంతయు అమృతంబంటోయి
దారిచూపగదోయి చందమామా,
    దరిచేర్ప రావోయి చందమామా.

నీ సొగసు నీకాంతి నిత్యమల్లంటారు
మానవం బంతను మందాకి నంటారు
అందచందమ్ములకు నాటపట్టంటారు
ఆశదీర్పగ రావ చందురూడా,
    అమృతమ్ము ఒలికించు చందురూడా.

మనసులోని మచ్చ మాయమౌతుందంట
పద్మినీవనితకూ పరమమిత్రుడవంట
కాలచక్రము కీవు కౌగిలింతావంట
రాసిక్యతనుచూసి చందమామా,
    రమ్మురమ్మంటారు చందమామా.

బాపట్లలో కొత్తగా ప్రారంభింపబడిన వ్యవసాయ
కళాశాల భవనములు





చిన్నమదేవీ విజయము

[ఏకాంకిక]

= శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి =

స్థలము ౧. విజయనగరము. రాచనగరు చెంత నొక వీథి.

(నేపథ్యమున పంచమహావాద్యములు. కొందరు జనులు వడివడిగా నడచుచు ప్రవేశించుచుందురు.)

ఒక బ్రాహ్మణుఁడు—(వెనుకకు తిరిగిచూచి) త్వరగా రావయ్యా, మాధవయ్యా. సభ మొదలుపెట్టినట్లున్నారు. మనకు ఆలస్యమైనది.

(నేపథ్యమునుండి "జయీభవ; దిగ్విజయీభవ; ప్రబలరాజాధిరాజ, రాజప్రతాప, రాజపరమేశ్వర, అరిరాయభయంకర, మూరురాయరగండ, దుష్టశార్దూలమర్దన, వీరనారాయణ, జగదేకవిభాళ, జయ; కుమారవిక్రమ జయ; శ్రీకృష్ణదేవ మహారాయ జయ; దిగ్విజయీభవ" అని బిరుదములు వినబడును. మంగళవాద్యములు మ్రోగును.)

మాధవయ్య—(ప్రవేశించి) ఉండవయ్యా రవంత. అబ్బా! నడవలేను. ఈశ్వరయ్యా, కొంచెం నెమ్మదిగా పోదాం.

ఈశ్వరయ్య—అయినట్టే. మనం పోయేటప్పటికి అంతా అయిపోతుంది. తెనాలిరామలింగయ్య నగరికి పోయి చాలాసేపయింది.

మాధ—అది సరేగాని, ఏమిటయ్యా ఈ వేళ విశేషాలు, జరగబోయ్యేవి?

ఈశ్వ—ఓహో! ఏమనుకుంటున్నావు? ఈ దినం తెనాలిరామలింగయ్య గ్రామాంతరంనుండి రాజధానికి వచ్చాడు. ఆస్థానానికి వస్తాడు. ధూర్జటిగారినిగుఱించిన ఆసమస్య పూర్తిచేస్తాడు. ఆ బయటిదేశాల పండితులతో వాదం చేసి తరిమివేస్తాడు. పెద్దయ్యగారికి గండపెండేర బహూకరణం. ఇంకా చాలా విశేషాలు. భలే తమాషాగా ఉంటుంది. రా, రా. పోదాం.

మాధ—బలే! బలే! ఈదినం ఏమి స్వారస్యమైనా ఉంటుంది. సరేగాని, ఆ సమస్య ఏదో మరిచిపోయినాను, కొంచెం చెప్పవయ్యా.

ఈశ్వ—చాదస్తుడా, ఎంతలో మరిచిపోతావయ్యా! కృష్ణదేవరాయలవారి సమస్యలు ఈ దేశంలో ఆబాలగోపాలం ఎరగనివాళ్లు లేరు. నువ్వేమో మరిచిపోయినావని అంటావు. చెప్తా విను.

"స్తుతమతియైన యాంధ్రకవి
ధూర్జటిపల్కుల కెట్లు కల్గె నీ
యతులితమాధురిమహిమ........"

(నేపథ్యమునుండి)

"హా! తెలిసెన్ భువనైకమోహనో
ద్ధతసుకుమారవారవని
తాజనతాఘనతాపహారిసం
తతమధురాధరోదితసు
ధారసధారలన్ గ్రోలుటంజుమీ."

ఈశ్వ—అదుగోనయ్యా తెనాలిరామలింగయ్య, సమస్య పూర్తిచేస్తున్నాడు. (నేపథ్యమున కరతాళధ్వనులు) సభ మొదలుపెట్టారోయి, పదపద.

(నిష్క్రమింతురు.)

స్థలము ౨. రాయలవారి సభ.

(రాయలు, అష్టదిగ్గజములు, మంత్రులు, పరివారము ప్రవేశింతురు.)

వంది—జయీభవ. (ఇత్యాది పఠించును.)

రాయ — పండితులారా, కవీశ్వరులారా, విద్యావంతులారా, ఎవరైనను ఈసమస్యను పూరింపుడు.

"స్తుతమతియైన యాంధ్రకవి
ధూర్జటిపల్కులకేల కల్గె నీ
యతులితమాధురీమహిమ."

తెనాలిరామ — (నేపథ్యమునుండియే) హా! తెలిసెన్.

రాయ—ఓహో! తెనాలిరామలింగయ్యగారు వచ్చినారు.

రామలిం—(ప్రవేశించును.)

రాయ— రామలింగయ్యగారూ, ఏమి తెలిసినది?

రామలిం—"......హా! తెలిసెన్ భువనైక
ద్ధతసుకుమారవారవని [మోహనో
తాజనతాఘనతాపహారిసం
తతమధురాధరోదితసు
ధారసధారలుగ్రోలుటంజుమీ."

రాయ—(ఆశ్చర్యముతో సభయంతయుజూచి) ధూర్జటిగారూ, ఒప్పుకొందురా?

వంది — మహాప్రభూ, ధూర్జటిగారు నేడు రాలేదు.

రాయ—వేశ్యయేగదా, దోషమేమి?

అప్పాజి—మహాప్రభూ, నేడు రామలింగయ్యగారు వచ్చినందున ఆ వైదేశికపండితులకు వాదార్థము సెలవొసంగవలెను.

రాయ—అప్పాజీ, చాల సంతోషము. కానిండు. విద్యావినోదములు ప్రారంభింపుడు.

అప్పాజి—తిమ్మయ్యా, ఆ పండితులను రమ్మను.

(ఇరువురు పండితులు అట్టహాసముగా ప్రవేశింతురు.)

ఇరువురును—జయము జయము, శ్రీకృష్ణదేవరాయమహారాయా, నీకు జయము. నీవు సత్యమున హరిశ్చంద్రుడవు, దానమున కర్ణుడవు, ఐశ్వర్యమున దేవేంద్రుడవు, రూపమున మన్మథుడవు, ఆంధ్రసామ్రాజ్యమునకు అపరభోజుడవు, పండితుడవు, కవివి, నిరంతరవిద్యావినోదివి. మేము పండితులము, కవీశ్వరులము. నీ ఆస్థానమందలి కవులను జయించుటకు వచ్చినాము. ఆశుకవిత్వధోరణిలో మమ్ము జయించినవారు లేరు. గడియకు వేయిపద్యములు నిరాఘాటముగా చెప్పగలము. ఎటువంటి క్లిష్టసమస్యనైనను పూర్తిచేయగలము. అవధారణచక్రవర్తి, ధారణసార్వభౌమ, వాదిఘటాపంచానన, వాదిమత్తేభసింహ, కవితార్కికకేసరి మొదలైన బిరుదులు మాకు వందలువందలు. మా ప్రజ్ఞాపత్రములు వేనవేలు. మా గండపెండేరములు మోయుటకు మత్తేభములు చాలవు. పోయినచోట నంతయు ఏనుగుల నెక్కినాము. నానారాజసందర్శనములు చేసినాము. రాయలవారి ఆస్థానముమాత్రమే మాకు మిగిలియున్నందున వచ్చినాము. మీ పండితులను జయించి మా దేశమునకు గోదావరీతీరమునకు పోదలంచినాము. మహాకవీశ్వరులారా, పండితప్రకాండులారా, విద్యావంతులారా, మీతో వాదమనగా మాకు తృణప్రాయము. ఓడిచేయగలము మిమ్మందరను. ఈ చిన్న సమస్యను పూర్తిచేసి మీ పరువు నిలుపుకొనుడు చూతము.

"కుంజరయూథంబు దోమకుత్తుక జొచ్చెన్."

రామలిం—(ఒకమారు లేచి మరల కూర్చుండును.)

వాదిపండి—ఏమీ, ఎవరూ చెప్పలేరా? ఇంతేనా మీ శక్తి?

అలసానిపెద్దన—అబ్బాయీ, రామలింగయ్యా, కానీ.

రామలిం—ఓహో! సభాస్తారులారా! వినుడు. ఓయి వాదీ!

గరజాయి త్రాగి తురకల
పంజాతుల గూడి కల్లు చవిగొన్నావా?
లంజలకొడుకా? యెక్కడి
కుంజరయూథంబు దోమకుత్తుక జొచ్చెన్?

వాదిపండి—(కోపముతో) మహాప్రభూ, ఇది దౌర్జన్యముగాని వాదము గాదు. దూషించుటగాని పూరించుట గాదు. న్యాయము గాదు.

రాయలు—రామలింగకవీశ్వరా, ఈ సమస్యను ఒకవేళ మేమే యిచ్చియుండినయెడల నేమి చేయుదురు?

రామలిం—మహాప్రభూ! ఏలినవారి యాశ్రితులముగదా. వినుడు మరి—

రంజన చెడి పాండవు లరి
భంజనులై విరటు గొల్వ బాల్పడి రకటా
సంజయ విధి నేమందును
కుంజరయూథంబు దోమకుత్తుక జొచ్చెన్.

సభ్యులు—బళిబళి.

వాదిపండి—ఎవరయ్యా నీవు, అధికప్రసంగిగా నున్నావు!

రామలిం—మహాహంకారగర్వితదుష్టవాది మదమత్తేభకంఠీరవ, నిరర్థకబిరుదాడంబరకవీంద్రమేఘమహావాతూల, తుచ్ఛవాదిసనకవిద్రావణమహోలసుడ, వికటకవి, గండరగండ, గండభేరుండ, గోదావరీప్రాంతకవీంద్రతలగుండుగొండ, ఆసుకవిశ్వ లాడలాడాయమాన కవివృషభముక్కుత్రాడు ఇత్యాదిబిరుదులం గొట్టి, శతఘంట, సహస్రఘంట, లక్షఘంట, కోటిఘంట, అర్బుదన్యర్బుదఘంటాదికవీంద్రుల గర్వమును భంజించి, వారి బిరుదులు, గండపెండేరములు, శాలువలు, దుప్పట్లునహో పుచ్చుకొని రాయలవారి ఆస్థానమును ఆశ్రయించియున్న కవిమశకము తెనాలి రామలింగయ్య. ఈ కవిమశకమునకే భయపడుచున్నావు. కవిశార్దూలములు నీమీద లంఘించిన నేమైపోగలవు?

వాదిపండి—'శిశుస్త్వం మా ప్రలాప.' మహాప్రభూ! ఈపద్యమునకు చెప్పిన యర్థమును చెప్పక అన్నిపాదములు చక్కగా సమన్వయింపవలయును.

సీ. రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలప నన్నయ వేమధరణిపతికి.
(అదే మిగిలిన పాదములును)

గీ. భావభవభోగసత్కళాభావములను
(అదే మిగిలిన పాదములును)

రాయ—(సభవైపు చూచును.)

రామలిం—'పశుస్త్వం మా విలాప.' మహారాజా, ఇతడు పరమదుర్మార్గుడు. ఏలినవారి యాస్థానమునకు వచ్చి వేమభూపతిని పొగడుచున్నాడు. మా యేలినవారు సర్వదక్షిణాపథచక్రవర్తి కానున్నారు. దండుబయలుదేరెనా కృష్ణకాదు, గోదావరి, మహానది వరకు రాగలరు. అప్పుడు మీ ప్రభువులందరు మాయరిగాపు లగుదురు. నీసమస్యను నేను పూర్తిచేసినాను. ఈమారు ప్రశ్న నావంతు. నాపద్యానికి చెప్పవయ్యా వాదిఘటాపంచానన.

సీ. మేకతోకకు మేకతోక మేకకుతోక
మేకతోకా మేకతోక మేక
(ఇట్లే తక్కిన మూడు చరణములును)

గీ. మేకతోకతోక మేక మేకతోకతోక.
(ఇట్లే తక్కిన మూడు)

వాదిపండి—(ఆలోచించుట నభినయించి) దీనికి అర్థము లేదన్నచో నవమానమగును. చెప్పుట కష్టముగా నున్నది. కానీ, (ప్రకాశము) మహాప్రభూ, ఇది పట్టి అసందర్భప్రలాపము. ఇటువంటి పద్యములకు కూడ మేము అర్థముకల్పించగలము. రేపు ఏలినవారి సన్నిధిలో మనవిచేయగలము.

(సభ్యులు కొందరు నవ్వుదురు; కొందరు దగ్గుదురు)

రామలిం—తెడికిణతోం. అయినదా మీపని! ఎక్కెక్కిరించినారయ్యా మిమ్ము పీనుగులమీదను, లొట్టిపిట్టలమీదను!

ఒక సభ్యుడు— నిచ్చెనలు వేసి ఎక్కించి ఉంటారు.

రామలిం—ఈ పద్యమునకు అర్థము చెప్పుడు.

నరసింహకృష్ణరాయని
కరమరుదగు కీర్తి యొప్పె గరిభిద్గిరిభిత్
కరికరిభిత్ గిరిగిరిభిత్
కరిభిత్ గిరిభిత్ తురంగకమనీయంబై..

వాదిపండి—ఈపద్య మేగ్రంథములోనిది కవిగారూ?

రామలిం—తిలకాష్ఠమహిషబంధనములోనిది. నేనే వ్రాసితిని.

వాదిపండి— (ఆత్మగతము) ఈమహానుభావుడసాధ్యుడుగా నున్నాడే. ఉపాయముగా నిచ్చటినుండి తప్పించుకొనిపోవలయును. (ప్రకాశము) అబ్బబ్బ! అబ్బ! కడుపునొప్పిగా నున్నది. మహాప్రభూ, మాకు నేడు సెలవిప్పించవలయును. రేపు మేము వచ్చి, శతావధానము సహస్రావధానముకూడ చేయగలము. నేటికి సెలవు. (అని వడిగా నిష్క్రమి.)

రామలిం— శతసహస్రావధానముకూడ చేయగలరు! మహాప్రభూ, ఈ అసుకవులు మరల రారు.

రాయలు—

ఉదయం బస్తనగంబు సేతువు హిమ
వ్యూహంబునన్ జుట్టిరా
విదితంబైన మహిన్ మహేంద్రకవితా
విద్యాబలప్రౌఢి నీ
కెదురేరీ పదపార్థబోధఘటనా
హేలాపరిష్కారతా
రద నీరూపము రామలింగకవిచం
ద్రా సాంద్రకీర్తీశ్వరా.

రామలిం—ఏలినవారి అనుగ్రహమే అంతయు.

అప్పాజి — మహాప్రభూ, కవిపండితులలో నందరకును పెద్దరైన పెద్దనగారికి నేడు గండపెండేరము బహూకరించవలెను.

రాయలు—అవును. చాల సంతోషము. (నౌకరులు వరహాలపళ్లెమును తెచ్చి సభామధ్యమున నుంతురు. వానితో గండపెండేరముకూడ.) పెద్దనార్య! అందుకొనుడు.

అలసాని పెద్దన—మహారాజాధిరాజ!

శరసంధానబలక్షమాదివిదిక్షై
శౌర్యంబులం గల్గి దు
ర్భరమండత్వఖిలప్రవేశచలన
బ్రహ్మఘ్నతే ల్మనివన్
నరసింహక్షితిమండలేశ్వరుల నె
న్నన్వచ్చు నీసాటిగా
నరసింహక్షితిమండలేశ్వరుని కృ
ష్ణా రాజకంఠీరవా.

సభ్యులు—ఆహాహా! బళిబళి! బాగుబాగు!

రామలిం—(హహహా యని నవ్వి) మహాప్రభూ! ఈ పద్యము పనికిరాదు. తాతగారూ, ఏమి ఇట్లు చెప్పుచున్నారు? బిలము ప్రవేశించిన రాజకంఠీరవా యని తోకపట్టి పలికిత్తురా యేమి? ఇది దోషము కాదా? నేను చెప్పెదను చూడుడు.

కలనం దావకఖడ్గఖండితరిపు
క్ష్మాభర్త మార్తాండమం
డలభేదం బొనరించి యేగునెడ ద
న్మధ్యంబునన్ హారకుం
డలకేయూరకిరీటభూషితుని శ్రీ
నారాయణుం గాంచి లో
గలగం బారుచు నేగ నీవయనుశం
కం గృష్ణరాయాధిపా.

సభ్యులు—ఆహాహా, దివ్యముగా నున్నది.

పెద్దన—మహాప్రభూ, ఈ గండపెండేరమును, పారితోషికమును రామలింగయకే తగినవి.

రాయలు—రామలింగయగారూ, రండు.

రామలిం—ప్రభూ, పనికిరాదు. నేను పద్యము చెప్పుటకై చెప్పితినిగాని వేరుగాదు. తాత గారి పద్యము నిర్దోషము. బహుమతికి మాబోంట్లు కేవల మనర్హులుగదా. తాతగారూ, రండు. (అని స్వయముగా వారిని పిలుచుకొనివచ్చును. రాయలు గండపెండేర మును స్వయముగా కాలికి తొడుగును.)

(నేపథ్యమునుండి—"జయంజయం ఏలినవారికి. పదునెనిమిది తిరుపతులనుండిన్ని, దక్షిణ రెండు దేవ స్థలాలనుండిన్ని ఆయా ఆచార్యులు ప్రసాదములు తెచ్చియున్నారు. నానాదేశములు తిరిగి ఏలినవారి దర్శనానికి వేసులు వచ్చియున్నారు. అహముదానగ రమునుండి వేసుల రామున్ను, గోలకొండనుండి వేసుల గోపోకన్ని, వాయువేగి హనుమంతేయ్య, మనోవేగి పురుషామృగయ్య మొదలైనవారు వచ్చియున్నారు. ఇంకా ఏలినవారి దర్శనానికి రాణా జగదేవు, గని తిమ్మప్పనాయడు, రాచూరి రామినాయుడు, సేనా పతి పెమ్మసాని రామలింగమనాయడు, హండే మల్లా రావు, బోయి రామప్ప పదునెనిమిది కప్పణాలవారు, దళనాయకులు, అప్పరపిళ్లె, కుప్పరపిళ్లె, సాళువ నాయడు, కొమారతిమ్మప్ప, సంగ్గరాజు, సౌర్వప్రధాని తిప్పరసు, అయ్యప్పనాయుడు, కటికం విశ్వనాథ నాయడు, చెవ్వప్పనాయడు, అక్కప్పనాయడు, కృష్ణప్పనాయడు, వెలుగోటి యాచమనాయడు, కన్నడ బసవప్పనాయడు, సాళువ మేకరాజు, మట్ల అనంతరాజు మొదలైనవారున్ను, బొమ్మిరెడ్డి నాగారెడ్డి, బసువారెడ్డి మొదలైన రెడ్డి కొమాళ్లున్ను, కమ్మనాయ కులు వితలప్పనాయడు అల్లుళ్లు కొమాళ్లు రాచరికం వారు అమరనాయకంవారు అందరున్న ఏలినవారి దర్శనానికి కాచుకొనియున్నారు."

అప్పాజీ—మహాప్రభో, కవితాగోష్ఠి యైనది. ఏలినవారు కార్యాలోచనమందిరమునకు పోవలయును.

(సభ లేచును. రాయలు, మంత్రియు నొకవైపును, మిగిలినవారు మరియొకవైపు నిష్క్రమింతురు.)

స్థలము 3. నగరిబయట

తెనాలిరామ—(ప్రవేశించి)బళి. అద్భుతముగా నున్నది. ఈ జడబిళ్ల అంతయు నొకటే వజ్రము. పది కోట్ల వరహాలు చేయగలదు. అరచేతియంత యున్నది. దీనిలో బంగారమును చేర్చి పెక్కుమణులవలె చూపి నాడు. మంచి పనితనము. మాబోంట్లకేల? దేవేరులకే తగును. మరి దీనిని ఏలినవారికే చూపెదను. (వెనుకకు చూచి) ఓయి, ఆ బుడతకీచువర్తకుని మా యింటికడ నుండుమను. (ముందుకు నడచి) ఎవరురా అచ్చట! ఏలినవారిపు డెక్కడనున్నారు?

(నేపథ్యమునుండి—"తిరుమల దేవమ్మగారి నగ రికి వెళ్లినారండి.")

రామలిం—మంచిది. నేను తిరుమలదేవిగారి నగరికే పోయెదను. (నిష్క్రమించును)

స్థలము 4. తిరుమలదేవినగరు

(రాయలు, తిరుమలదేవి పాచికలాడుచు ప్రవే శింతురు. చేటికలు కొందఱు వారికి వీచోపులు వీచు చుందురు.)

రాయలు—నాదే గెలుపు.

తిరు—ఎట్లు ప్రభూ! తా మోడిపోయినారు.

రామలిం—(తటాలున ప్రవేశించి) ఇరువురును ఓడిపోయినవారే.

రాయ—రామలింగయ్యగారూ, రండు రండు. (తిరుమలదేవి లేచి నిలుచును. ఒక చేటి రామ లింగయ్యకు ఆసనమిచ్చును. విసరును.)

రాయ—ఎట్లు కవిగారూ? ఇరువురును ఎట్లు ఓడిపోగలము?

రామలిం—ఏల కాదు? ప్రభువుల విజయము లును, పరాజయములును వారి దేవేరులను చెందినవే గదా. కావున ఇరువురును ఓడినవారే.

తిరు—మరి తమ వాదముప్రకారము ఇరువుర మును గెలిచినట్లుకాదా?

రామలిం—ఆహా! కాకేమి. మీ కిరువురకును భేద మున్నదా. మండనమిశ్రుని శంకరాచార్యులవారు గెలిచినప్పుడు ఆయనభార్య తన్నుకూడా గెలిచిననే గాని గెలుపు పూర్తికాదని చెప్పలేదా? పరస్పరము మీ రొకరి నొకరు గెలిచిన నది గెలుపును గాదు, ఓడి పోవుటయు కాదు. కావున ఇరువురును గెలిచినట్లే, ఇరువురును ఓడినట్లే.

తిరు—కవులుగదా! నిరంకుశులు. మరి కవి గారూ, తాము నేడిచ్చటికి వచ్చుటచే మానగరు పావనమైనది. ఇటీవల వచ్చుటయే మానితిరిగదా.

రామలిం—అమ్మా, బొత్తిగా తీరిక లేకపోయి నది. నేను కొంతకాలముగా గ్రామాంతరము పోయి యుంటిని. పైగా వైదేశికులు కవులు వచ్చియుండిరి. లేనిచో మాకేమి, నిరంతరము ఏలినవారిని, దేవిగారిని వినోదింపకేయుటయేగదా మాపని. మరి నేడొక విశేషము. బుసరకేసువర్తకు డొకడు వచ్చియుండి నాడు. వానికడ నీయద్భుతమైన వజ్రపుజడబిళ్ల యుండినది. చూచితిని. అట్టి యపూర్వవస్తువును ధరించుటకు దేవిగారుతక్క నితరు లెవ్వరర్హులని తీసి కొనివచ్చితిని. ఇదుగో చూడుడు. (అని చూపును)

(రాయలవా రందుకొని దేవి కిత్తురు.)

తిరు—చక్కగా నున్నది. ఇట్టి దొకటి వలయు నని తలంచుచుంటిని. తలవనితలంపుగా వచ్చినది. రామలింగయ్యగారికి మనయం దెప్పుడును అకారణ వాత్సల్యము.

రామలిం—మహారాణిగారు తా మట్లు సెల వీయగూడదు. ఏలినవారు సాక్షాత్తు ఆ విష్ణువవతారము. 'నావిష్ణుః పృథివీపతిః'. సర్వదక్షిణాపథచక్రవర్తియొక్క పట్టమహిషియైన తాము సాక్షాత్తు ఆ మహాలక్ష్మియే. మీయిరువుర కటాక్షమే మాకు సకలైశ్వర్యములకు కారణము. తా మిట్లుపలుకవచ్చునా?

(తిరుమలదేవి ఆబిళ్లను ధరింపబోగా చేటికలు వచ్చి దానిని చక్కగా నమర్తురు. దూరమునుండి చిన్నమదేవిచేటికలు ప్రభావతీకళావతులు చూచు చుందురు)

ప్రభావతి—ఒసే కళావతీ, చూచావటే. ఈ తెనాలిరామలింగయ్య. ఈమెగారు మహాలక్ష్మియట. మన దేవిగారిని తక్కువచేయడానికి ఈ ఎత్తు. ఈమె మహాలక్ష్మి ఐతే ఈయన నారదమహామునికాబోలు.

కళావతి— ఎరగవటే ప్రభావతీ, రామలింగయ్య గడుసుదనం, టక్కరిమాటలు.

రామలిం—దేవిగారు ధరించడంచేత ఈవజ్రపుబిళ్లకు విలువ యేర్పడినది. మీభాగ్యము ఆపౌలోమి కైనా లేదు. ఈభరతఖండంలో ఇటువంటి ఆభరణం ఇంకొకటి లేదు. ఢిల్లీలో లేదుగదా పాశ్చాత్యదేశాలలోనూ లేనేలేదు. ఏలినవారి ప్రతాపం విని ఎక్కడివారున్నూ ఇక్కడికి రావడంచేత సకలాభరణాలున్నూ మన రాజ్యమునకే వచ్చుచున్నవి. మనము వదిలినవి ఇతరులకు. ప్రపంచమునందలి మేలైనవస్తువులు భరతఖండములోను, అందులో మేలువస్తువులు విజయనగరములోను, అందులోను మేలు శ్రీతిరుమలదేవిగారి నగరిలోను ఉన్నవి. సకలరత్నములున్నూ ఇక్కడికే రాగలవు. ఏలినవారికి తాము బహిఃప్రాణము. తమకు తర్వాతనేగదా మిగిలిన యంతఃపురమంతయు. కడమ దేవేరులందరును తమకు తర్వాతివారే. చిన్నమదేవి గారుకూడ తమకు చిన్నయే.

ప్రభావతి—(కోపముతో) చూచావటే చూచావటే, ఈరామలింగయ్యను. చిన్నమ్మగారి కేమి చేశారే ఈయన్ను. ఆమె నెందుకే వేలుపెట్టి మాపడం. నారదుడే జగడాలుపెట్టడంలో. రావే పోయి దేవికే చెప్దాం ఇతగాడి చేష్టలంతా.

కళావతి—రామలింగయ్యకు త్వరలోనే శాస్తి జొరుతుందిలే. (అని నిష్క్రి)

(నేపథ్యమున శంఖధ్వని)

ఒక చేటి— మహాప్రభూ, స్నానసమయమైనది.

రాయలు—(లేచి ఆత్మగతము) నేడు ఈరామలింగయ్యగారు చిక్కు తెచ్చిపెట్టినారు. చిన్నమదేవి చేటికలు చెప్పటకు పోయినారు. కానీ, ఎట్లగునో చూతము.

చేటి—ఏలినవారు ఇటు ఇటు.

(అందరు నిష్క్రమింతురు)

స్థలము ౫. చిన్నమదేవినగరు

(మంచముపై చిన్నమదేవి పరుండియుండగా చేటికలు చుట్టు విసరుచుండగా ఒకతె వీణను మీటుచుండును.)

చిన్నమ—ఒసే, ఆ పాట వద్దే, నాకేమో కష్టంగా ఉందే.

ముసలిచేటి—ఏ మ మ్మా, ఒ క వి ధ ం గా ఉన్నావు తల్లీ.

చిన్నమ—తెనాలిరామలింగయ్య వచ్చాడన్నది మొదలు మళ్లీ ఏమితంటా తెచ్చిపెడతాడో అని భయంగా ఉన్నదే. (తటాలున లేచి కూర్చుండి) ఒసే, ఏలినవారు ఇప్పు డెక్కడున్నారో చూచిరా.

ము. చే—ఆస్థానంనుంచిలేచి (అని సగములో)

చిన్నమ—లేచి?

ము. చే—లేచి తిరుమలమ్మగారి నగరికి వెళ్లారమ్మా.

మరియొకచేటి—అక్కడికే తెనాలిరామలింగయ్యగారు కూడా వెళ్లారండి.

చిన్నమ—(మంచముపైబడి) ఒసే, నాకేమో ఇవాళ ఒకమాదిరిగా ఉందే, అక్కడి కెందుకు వెళ్లాకే ఏలినవారు ఇక్కడికి రాక ?

ము. చే—ఊర్కే మొహమాటానికి పోయియుంటారమ్మా.

చిన్నమ—నా కేమో అనుమానంగా ఉందే.

ము. చే—పిచ్చితల్లీ, అనుమానా లెందుకమ్మా. ఏలినవారు మొహమాటానికి ఏ వేవో చేస్తుంటారు.

ఒకచేటి—(వడిగా ప్రవేశించి) ఎవడో ఒక బుడతకీసువాడమ్మా, నగలవర్తకుడు ఏవేవో మంచి మంచి ఆభరణాలు తెచ్చాడమ్మా. తెనాలిరామలింగయ్య అతన్ని తిరుమలమ్మగారి నగర్లోకి పిలుచుకొనిపోయినారు.

చిన్న—(ముసలిచేటిని చూచి) చూచావటే, నా అనుమానం బలపడుతున్నది. నా కేదో అవమానం చేయడానికి ఏదో ఎత్తు వేస్తున్నాడే రామలింగయ్య.

(ప్రభావతీ కళావతులు ప్రవేశింతురు)

ప్రభావతి—ఏమని చెప్పడమే దేవిగారికి ?

కళావతి—మరి చెప్పకపోతే ఏలాగే ?

చిన్న—ప్రభావతీ కళావతులా, ర ం డి. చెప్పండే అక్కడ ఏం జరిగిందో.

ప్రభావతి—ఏమీ లేదమ్మా. ఏ లి న వా రు ఇందాక తిరుమలమ్మగారి నగరికి వచ్చారండి. అక్కడ ఏలినవారూ, దేవిగారూ పాచికలాడుతూఉంటే పరియాచకాలాడుతూ రామలింగయ్యగా రక్కడికి వచ్చారు.

చిన్న—ఏం చేశాడే ఆ మ హా న భా వు డు. త్వరగా చెప్పి ముగించు.

ప్రభావతి—ఎవడో బుడతకీసు వా డ ట మ్మా, వర్తకుడు. గొప్పగా ఒక వజ్రపుబిళ్ల తెచ్చాడు. తెనాలిరామలింగయ్యగారు పదికోట్లవరహాలకు బేరం చేశారట. ఏలినవారి కిచ్చారు. ఏలినవారు తిరుమలమ్మగారి కిచ్చారు. ఎంత బాగుందమ్మా, చీకటిని చీల్చేస్తుంది.

చిన్న—అధ్వాన్నంగా ఉంది. త్వరగా చెప్పి ముగించవే దాని సంగతి.

కళావతి—అంతటితో ఊర్కోకుండా తిరుమలమ్మగారిని చాలాదూరం పొగడి 'చిన్నాదేవిగారు మీ కంటె చాలా చిన్న' అని ఇలాంటిమాటలు చాలా తక్కువపరుస్తూ మాట్లాడారమ్మా. మేము వినలేక వచ్చేశాము.

చిన్న—నా పాలిటి యముడే ఆ రామలింగయ్య. (అని ముసలిదానిని కౌగలించుకొని కన్నీరు నించును.)

ము. చే.— ఏమమ్మా, ఏం మునిగిపోయిందిప్పుడు. ఏదో ఒక రాయి ఆయన తెస్తే, అప్పుడక్కడున్నారుకాబట్టి ఏలినవారు ఆమెకిచ్చారు. అంతేమాత్రమేగదమ్మా. నీవు కోరితే ఆలాంటివి వందలు రావా ?

చిన్న—వందలు గిందలు. నామాట ఎందుకొత్తవలెనే ఆ రామలింగయ్య. అతని నోటి కడ్డము లేదే. ఏలినవారుకూడా నిలుపలేరుగదవే. నన్ను ఈ విధంగా అవమానం చేయడానికి నేనేం అపకారం చేశానే ఇతనికి ? ఏలినవారుకూడా ఆమోదిస్తే ఎందుకే ఈ బ్రతుకు ? (అని ఆభరణములు మొదలైనవి తీసి మంచముపై విసరికొట్టి తటాలున నిష్క్రమించును)

ము. చే.— దేవిగారికి కోపము వచ్చినది. బహుశః ఏలినవారు ఇక్కడికి వచ్చినా రావచ్చు. ఒసే, మీరంతా పనిపాటలు నిలిపివేసి ఎక్కడివారక్కడ చప్పుడుచేయకుండా ఉండండి.

(చేటికలు నిష్క్రమింతురు.) (చేటికలు నిష్క్రి.)

(నేపథ్యమునుండి 'ఏలినవారు ఇటు ఇటు.' అంతే రాయలవారు ప్రవేశింతురు.)

రాయ—ఏమాశ్చర్యము, ఈనగ రేమి ఇట్లు చిన్నబోయి యున్నది ?

(అని ఇటునటు చూచుచు నిష్క్రి.)

స్థలము ౬. కోపగృహము.

(ఒక చేటి విసరుచుండగా, ఒక చేటి పాదము లొత్తుచుండ, కొందఱు నిలిచియుండ, తెల్లచీర ధరించి ఆభరణములు మాని మంచముపై పొరలాడు చిన్నమదేవి ప్రవేశించును.)

చిన్న—(తటాలున లేచికూర్చుండి) అయ్యో, నేనేం చేశానే ఈ ఆరాటం తీరడానికి ?

సీ. కలలోననైన నవ్వులకైన నామాట
జవదాటనెంచు నో చంద్రవదన
ఏపదార్థంబు నాయెదుట పెట్టకమున్న
ఎవ్వారి కొసగ డోయినురుబోడి
చెలులు నాతో నేమి చెప్పుదురో యని
లంచంబు లిచ్చు నో చంచలాక్షి
తోడిచేడియలు నాతోడి వంతులకు రా
పైరింపజాల డో పన్నుతాంగి

గీ. అరమరలు లేని కూరిమి ననగి పెనగి
కొదలుతీరని కోర్కుల గూడియాడి
కపటమెరుగని మమతల గలసిమెలసి
యున్న విభు డిట్లు సేయునే యొలతాంగి.

ఒకచేటి—అమ్మా, ఏలినవారు వస్తున్నారు.

చిన్న—ఒసే, నాదుప్పటి లేవే. (అని ముసుగిడుకొని పరుండును)

(రాయలు మెల్లదిగా ప్రవేశించును. ఒకతెను చూచి నోటిపై వ్రేలుపెట్టి మిగిలినవారిని చప్పుడుచేయవలదని చేసన్నలచే సూచించి, చిన్నమదేవిని సమీపించును. దేవికి వీచుచుండిన దాసి చేతినుండి విసనకఱ్ఱను తీసికొని దేవికి వీచును. చిన్నమ తటాలున ముసుగు తీసి రాయలను చూచి మరల ముసుగిడుకొనును)

రాయ—ఏమి యీకోపమునకు కారణము? నిజముగానే నీకు కోపము వచ్చినదా, లేక నన్ను పరిహాసముచేయుచున్నావా ? నీ కెవరైన నపకారమొనర్చిరా ? నా కేమియు తెలియకున్నది.

మనముల మాటలం గ్రియల
మన్నన లీనొక నాడు పెట్టికా
మినులకు, గారవంబు మెర
మెచ్చులకై పచరింతుగాని పా
యని యనురక్తి నీయెడన
యగ్గలమై కనుపట్టు నాకు నీ

వనిచిన పంపు సేయుటయ
ప్రాభవమా టది నీవాలుంగ వే.
(అని చిన్నమదేవిని తాకజూచును.)

చిన్నమ—(లేచి పయ్యెద సర్దుకొని) ప్రభూ, నన్ను తాకవలదు. చాలును, చాలును. చిన్నమ అందరకన్నను చిన్న. రామలింగయ్యకే చులకనై పోయినాను. ప్రభుల కేమిలెక్క. నన్నింకనూ చిన్న బుచ్చవద్దు.

రాయ—ఏమీ, రామలింగయ్యగా రేమిచేసినారు?

చిన్న—చేయవలసిన పనియే చేసినారు. ఏలిన వారు సాక్షాత్తు విష్ణువు, ఆమెగారు మహాలక్ష్మి. జడ బిళ్ల మహాలక్ష్మికే తగును మహాప్రభూ, ఈ చిన్నదాని కేల?

రాయ— ఏమీ, ఈ రవంతరవకా అలిగెదవు?

చిన్న—లేదు మహాప్రభూ లేదు. తిరుమల దేవి అలిగిన లాభమున్నదిగాని మావంటివారు అలిగి మాత్ర మేమి? ఏగుట్టయో, ఏబావియో చాలును.

(అని బిరబిర నిష్క్రి.)

రాయ—(ఆత్మ)దీని కోపము మిక్కుటముగా నున్నదే. చూచెదగాక. (అని వెనుకనే నిష్క్రమించును.)

(చేటికలు ఒకరినొకరు చూచుకొనుచు నేపథ్యమువైపు చూతురు.)

నేపథ్యమునుండి చిన్నమ—
పతి ప్రాణసదృశబంధువు
పతి దైవం బేడుగడయ పతి సతులకు న
ప్పతియ కడు నేరదప్పిన
గతి కులకాంతలకు వేరు కలదే చెపుమా.
కలకాల మొక్కగతి పూ
సలలో దారంబుమాడ్కి పతి మదిలోనన్
మెలగెదు పురుషులు గలుగుట
తొలుజన్మమునోముఫలము తోయజనేత్రా.

ము. చే.—అమ్మగారు ఏలినవారిమీద చాలా కోపం చేస్తున్నారు. పాపం ఏలినవారు చాలా వేడుకొంటున్నారు.

(మరల నేపథ్యమునుండి—
ధన మిచ్చి పుచ్చుకొన్నను
మనమున నోర్వంగవచ్చు మగ డింతులకున్
జన మిచ్చి పుచ్చుకొన్నను
మనవచ్చునె యింక నేటి మాటలు చెపుమా.)

ము. చే.—చూడవే, చూడవే. పాపం ఏలిన వారు అమ్మగారికి దండం పెడుతున్నారు. అయ్యయ్యో, అమ్మగారు ఏలినవారిని తన్ని వేసింది. ఎంత పని! ఎంతపని! ఏలినవారి పాగ పడిపోయినది. అయ్యో! ఏలినవారికి చాలాకోపం వస్తున్నది.

(రాయలు నేపథ్యమునుండి.—'బుద్ధిహీనురాలా, ఎంతసేపటికిని కోపము మానవా? ఛీ! నీ మొఖము చూడరాదు. నా పాదాల్లో నీవు పడేదాకా నీ మొఖము చూడను. ఏమి దీమసము! ఏమి దీమసము!' అనుచు ప్రవేశించి కోపాటోపమున నిష్క్రమించును.)

(చిన్నమదేవి ప్రవేశించును.)

ము. చేటి—ఎందుకమ్మా అంతకోపం చేశావు?

చిన్న—పోవే బుద్ధిలేనిదానా, నీవా వారు బుద్ధులునేర్పేదానివి? (అని రాయలవారు పోయినవైపు చూచి) ఒసే, నిజంగానే ఏలినవారికి కోపం వచ్చినట్టుందే?

ము. చే—అదిగదమ్మా నేను చెప్పడమున్నూ. అంతదూరం ఎందుకు పెట్టుకొన్నావు తల్లీ?

చిన్న—(ము. చే. తో) ఒసే, నువ్వు పోయి వారితో మంచిమాటలు చెప్పి పిలుచుకొనిరావే.

(ముసలిది నిష్క్రి.)

చిన్నమ—అయ్యో, ఏలినవారు బదులుచెప్పకుండా పోతున్నారే? (అని రెండడుగులు ముందు పోయి) ముసలిదాన్ని కసరుతున్నారు. నేనైనా పోయి పిలుచుకొని వస్తాను. (అని నిష్క్రమించును)

చేటికలు—మనమూ పోదాంరండి. (నిష్క్రి.)

[సశేషము]

గ్రహణశూలపాలైన సిమ్లాసభ

❀

= శ్రీ కె. పార్థనాథశర్మ =

గడచిన జూను ౧౪-వ తేదీనాడు నే నొక గ్రామమున నుంటిని. వార్తాపత్రిక లక్కడ దొరకవు. ఆనాటి సాయంకాలమున సమీప పట్టణమునుండి నామిత్రు డొకడు అక్కడకు వచ్చి "ఈ నెల ౨౫-వ తేదీ నాటికి సిమ్లాలో నాయకుల సమావేశము జరుగునట్లు లార్డు వేవెల్ గారు నిర్ధరించినారు" అని చెప్పెను. ఆనాడు పున్నమ. అది చంద్రగ్రహణమని జ్ఞాపకము వచ్చినది. చంద్రుడు మకరరాశిలో 3°-౪౦'లో, సూర్యుడు కర్కాటకరాశిలో 3°-౪౦' లో ఉండగా ఆ గ్రహణము. కాన్ ఫరెన్సు ఇట్టిరోజునందా లార్డు వేవెల్ గారు నిర్ధరించుట? హిందువులలో చనిపోయిన వారికి తిలోదకములు విడుచు దిన మది! హిందూ దేశములో జాతీయ పరిపాలనా విధానమును సమకూర్చుటకు నాయకులతో సంప్రతించు విషయమున వైస్రాయి గారు ఇట్టికాలమందా కాన్ ఫరెన్సు సమావేశపరచుట? దేశముయొక్క అభివృద్ధికై తగిన రాజకీయ సంస్కరణములను ఇయ్యగోరి సహృదయుత్వముతో లండనుకు పోయి మంత్రులతో మాటలాడి నానాప్రయాసలు పడి పైవారి అనుమతి పొంది వైస్రాయిగారు కడకు కాన్ ఫరెన్సుకు గ్రహణదినము నిర్ణయించిరే అని నా మనసు చాల నొచ్చినది. గ్రహణకాలమందు సూర్య చంద్రులనడుమ పూర్ణకేంద్రములో జిత్తులమారి ఇంద్రగ్రహము తులారాశిలో 3°-౪౧' లో ఉండగలదు. అంతా ఇంద్రజాలముగా పరిణమించగలదు.

"ఈ కాన్ ఫరెన్సువలన ఏమియు ఫలము లేదు. ఎండమావులలో త్రాగుటకు నీ రెట్లు దొరకును? అంతా వట్టిశ్రమ" అని నామిత్రునికి చెప్పితిని.

జూన్ ౨౫-వ తేదీనాడు కాన్ ఫరెన్సు ౧౧-౩౦ ఎ. యమ్. లో ఆరంభమైనది. ఇదిగో అప్పటి గ్రహస్థితిని చూపు కుండలి:—

		కు 10-3 శు 17-35	X 7¼ వ 14-28
	[సాయనము] కాన్ ఫరెన్సుకుండలి		ర 3-15 రా 9-32 శ 12-54 బు 14-6
కే 9-32			
చ 28-19		ఇ 3-41	I 8¾ గు 19-59

లార్డు వేవెల్ గారు సకాలమున సభ నలంకరించియుందురు. పరస్పరపరిచయాదులు జరిగి సమావేశము ఆరంభమువునప్పటికి రమారమి అరగంట కాలమైనా జరిగియుండును. అనగా దశమకేంద్రము వరుణగ్రహము మీదికే వచ్చియుండును.

ఈ కాన్ ఫరెన్సులో ప్రధానపాత్రలు మూడు-ఇండియన్ నేషనల్ కాంగ్రెసు, మస్లిమ్ లీగ్, లార్డు వేవెల్. కాంగ్రెస్ జాతకము ఈ క్రింద ఉన్నది. రాజప్రతినిధిగారి జాతకము, మస్లిమ్ లీగ్ జాతకము దొరకి ఉండినచో చాలా బాగుండి యుండును.

పోనిండు. దొరకిన సామగ్రి ఏమనుచున్నదో చూతము గాక:—

కే 20-6	I 9-39	ఇ 23-7 వక్రి	
శు 22-30	కాంగ్రెస్ జాతకము [సాయనము]		శ 4-46(వ)
ర 6-47 X 6-45			
బు 29-11		చ 4-2 గు 5-10 వ 7-37	రా 20-6 కు 20-49

మంచి ఉత్సాహశక్తి గల మేషరాశి లగ్నము. సరిగా దశమకేంద్ర మధ్యములోనే గ్రహరాజు ఉన్నాడు. పుణ్యసహమము (Part of Fortune) సూర్యసంయోగములో ఉన్నది. (మకరములో ౬°-౩౪') గొప్ప ఆదర్శాలతో స్వదేశమునకు రాజ్యాధికారము సంపాదించు పుణ్యకార్యమునకు పూనుకొన్నదికదా కాంగ్రెస్సు? తన ప్రయత్నపు ఫలితములను చూపు నాల్గవ ఇంటిలో రాజ్యస్థానాధిపతియగు శని ఉండి రవిని ఎదిరించుచున్నాడు. కాంగ్రెస్ ప్రయత్నము ఫలించుటలో గొప్ప కష్టములు, చాల ఆలస్యము ఉన్నవని దీని అర్థము. ఈ జాతకమున ప్రత్యక్ష శత్రుస్థానము (సప్తమస్థానము) తులా రాశి. దానిలో చంద్ర, గురు, వరుణులు చేరి దశమస్థానమందున్న రవిని, దశమాధిపతియగు శనిని ద్వేషించుచున్నారు. అనగా కాంగ్రెస్ ఆదర్శాలకు ప్రతికూలించు సంస్థలు మూడని. గ్రహముల స్వభావముల ననుసరించి చూచినచో, వరుణగ్రహము అతివాదులు (Extremists), విప్లవకారులు (Revolutionaries), వామపక్షీయులు (Left-wingers) వీరిని సూచించగలరు. సనాతన ధర్మవారులు (Sanathanists, Hindu Mahasabhaites etc.), పాశ్చాత్య రాజనీతివేత్తలు (Foreign Politicians) వీరిని బృహస్పతి తెలుపగలడు. ఇక మస్లిములీగును సూచించువాడు చంద్రుడు. బాలచంద్ర ధ్వజాలంకరా మస్లిమ్ సోదరులు? రాజ్యాధిపతియైన శనికి కేంద్రమందున్న ఈ మూడు గ్రహములను చూచినచో కాంగ్రెస్ ప్రయత్నములకు ప్రతిబంధకము ఎచటనుండి రాగలదో సులభముగా బోధపడును. విశేషమేమనగా ఈ మూడు గ్రహములలో శనికి సరిగా కేంద్రబిందువందే నిలిచినవాడు చంద్రుడే. ఆక్షేపణ, లేక ప్రతిబంధకము ప్రబలముగా ఎచటనుండి రాగలదో వేరే చెప్పనవసరము లేదు. శని చంద్రుల కేంద్రవేధ సంకుచితదృష్టి నిచ్చునది. మస్లిములీగ్ మనస్తత్వమును ఇది చూపగలదు.

కాన్ఫరెన్సు కాలమందలి గ్రహములతో కాంగ్రెస్ జాతకమును పోల్చిచూతము. ఆనాడు సూర్యుడు సరిగా కాంగ్రెస్ కుండలిలోని శనైశ్చరునిపైననే ఆవాహనమైనాడు. జన్మకాలమందలి ప్రతిబంధక సామగ్రి అంతా ఈ కాన్ఫరెన్సుకు ఆకర్షింపబడినది. కాంగ్రెస్ జాతకమందలి చంద్ర, గురు, వరుణులనుండి కాన్ఫరెన్సుకాలపు రవికి కేంద్రవేధ తప్పలేదు. ఇదంతా బూటకమని తలచు అతివాదులు ఉండనే ఉన్నారు. హిందూసంఘపు హక్కులు, అభ్యాసములు నశించునని చింతించు సనాతనవారు లున్నారు. ఏ చీమ తుమ్మినా "నాస్తి" అనుటకు పరదేశపు రాజ్యతంత్రజ్ఞులు కాచుకొనియున్నారు. దేశమును రెండుగా చీల్చి, పాయలుజేసి, ఐకమత్యమును పాడు చేయుటకు మస్లిమ్ లీగువారు తయారుగా ఉన్నారు. ఈ మూడు గ్రహములలో చంద్రునిదే ప్రబలవేధ. కర్కాటకములో ౪-వ డిగ్రీలో కాంగ్రెస్ శనిపైన కూర్చున్న రవికి ఎదురుగా నిలచి, ఇంద్రునికి కేంద్రస్థానములో గ్రహణముపట్టియున్న చంద్రుని చూచినచో ఈ కాన్ఫరెన్సువలన కాంగ్రెసు ఆదర్శము నెరవేరదనియు, దానికి లీగే అడ్డము తగులుననియు స్పష్టమగుచున్నది. కాంగ్రెసు జాతకమందలి చంద్రుని మీద ఇప్పుడు ఇంద్రగ్రహము వచ్చికూర్చుండి కాన్

ఫరెన్సు గ్రహములతో చేయికలుపుకొనుట గమనించితి మేని, ముస్లిమ్‌లీగువారికి ఏదో రహస్యబలమో, ఊహాతీ మించిన మాయాశక్తియో ఉన్నదనవచ్చును. అట్లు కానిచో, వారి ప్రతిఘటనవలన లార్డ్ వేవెల్ అంత శక్తిమంతుడగు రాజ్యతంత్రవేత్త తన ఉద్దేశమునుండి విరమించవలయునా?

అది అట్లుండనిండు. కాన్ఫరెన్సునాడు కాంగ్రెస్ లగ్నాధిపతియగు కుజునిమీద గురువు నిల్చి నాడు. ఇది శుభసూచకమే అనవచ్చును. సద్భావ ముతో కాంగ్రెసుఅభిప్రాయములను మన్నించదలచి లార్డువేవెల్ వైట్‌హాల్ ప్రభువులను సమాధాన పరచి ఈ సమావేశమును తయారుచేసినాడు. ఈ గురువుపైన శుక్రునినుండి త్రికోణదృష్టి పడుచున్నది. సమావేశము జరుగు పట్టణము ఇండియాలో సుఖా వాసమునకు తగిన పట్టణములలో ముఖ్యమైనది. నాయ కులకు గృహవసతులు, ప్రయాణానుకూలములు, భోజన సౌకర్యములు చక్కగా సమకూరినవి. లం చ్‌లు, డిన్నర్లు యథేచ్ఛముగా జరిగియేయుండును. సమావేశమునకు చేరినవారు "భాయి, భాయి" అని మిత్రులుగా ప్రవర్తించినారు. గలాటాలు, హరతాళ ములు, కొట్లాటలు జరుగలేదు. నాంది బాగానే జరిగినది.

సిమ్లానగరపు అక్షాంశలో (Latitude) ఆ పట్టణపు రేఖాంశా (Longitude) కాలమునకు వచ్చు లగ్నము కన్యారాశిలో ౧౫°లో ఉండును. కాంగ్రెస్ జాతకములో చలితకుజుడు ఇప్పుడు ఆ డిగ్రీలోనే ఉన్నాడు. అచోటికే బృహస్పతి ఇప్పుడు వచ్చినాడు. గొప్ప ఆశలతో సిమ్లాపట్టణములో ఈ కాన్ఫరెన్సు జరుగుట చాల రమ్యముగా ఉన్నది.

తయారు కావలసియున్న రాజ్యాంగ కార్య నిర్వాహ సంఘమునకు (Executive Council) తగిన వారిని ఎన్నుకొనుడని లార్డ్ వేవెల్ కోరినాడు. కాం గ్రెస్ ఎన్నుకొన్నవారి పేర్లు గల పట్టీని ౭-౭-౪౫ నాటి సాయంకాలము ౭-౩౦ గంటలకు కాంగ్రెసు కార్యదర్శి వైస్రాయిగారి ఆంతరంగిక కార్యదర్శి చేతికి ఇచ్చినాడట! ఎంత మంచి ముహూర్త ములో ఇచ్చినాడో? అప్పటి గ్రహస్థితి ఇది:—

		కు 18-52 శు 29-47	వ 15-8 చ 17-35
	[సాయనము] కాంగ్రెస్‌వారు పట్టీ ఇచ్చినప్పటి కుండలి		రా 8-53 శ 14-28 ర 14-56
కే 8-53 I 4-0			బు 6-23
		ఇ 3-48 X 21-0	గు 21-31

లగ్నము మకరరాశి ౪°కి వచ్చియుండును. కాంగ్రెస్ కుండలిలోని రాజ్యస్థానాధిపతి అయిన శని (కర్కాటకరాశి నాల్గవ డిగ్రీ) అస్తమించుచున్న కాలమది. రాజ్యాశ అస్తమించవలసినదేకదా? తాత్కాలిక లగ్నానికీ, కాంగ్రెస్‌శనికీ పరిపడుమ ఉండు కాంగ్రెస్ జాతకపు చంద్రునిమీద ఇంద్రుడు కూర్చుండి ఉయ్యాల ఊగుచుండు కాల మది. కాం గ్రెస్‌వా రిచ్చిన పట్టీ లీగ్ సమ్మతించునా? మంత్రి వర్గములో ఉండవలసిన ముసల్మానులైదుగురూ తాను చెప్పినవారే ఉండవలయునని జిన్నాగారు భీష్మాకపు పట్టు పట్టినారు. తమ లీగులో చేరని ఎంతోమంది ముస్లిమ్‌మతస్థు లుండినా వారికి అతని దృష్టిలో విల లేదు. ఇదే శనిచంద్ర కేంద్రముయొక్క సంకుచిత దృష్టిఫలము. దీనిలో కొంచెము ఇంద్రజాలముకూడా లేకపోలేదేమో!

మరియొక విశేషము. ఈ కుండలిలో రవి ఉండునది కర్కాటకరాశి ౧౫-వ డిగ్రీ. కాంగ్రెసు సరిగా ౧౫ మంది పేర్లే ఇచ్చిన దట. వారిలో ఎవరి నైనా ఎన్నుకోవచ్చునని. కాని ఆ రవితో చేరి ఆనాడు శని కూర్చున్నాడు. లిస్టుకు శనిపట్టినది.

అప్పటి బుధుడు (కాంగ్రెస్ వ్రాసిన పట్టి) అప్పటి గురువునుండి ౪౫°ల చెడ్డదృష్టిలో నున్నాడు. లిస్టును గురువు (వైస్రాయి) ఉపయోగింపజాలడు. కాంగ్రెస్ జాతకములో చలితరాహువు ఇప్పుడు కన్యారాశి ౧౩-వ డిగ్రీలో, చలితకేతువు మీనరాశి ౧౩°లో ఉన్నారు. ఈ రాహుకేతువుల నడుమ చిక్కి తాత్కాలిక చంద్రుడు గిజగిజ లాడుచున్నాడు. గ్రహణముపట్టిన చంద్రుని ఫలము ఈ రాహుకేతువుల ద్వారా కాంగ్రెస్ జాతకమును చేరుకొన్నది.

కాంగ్రెసు జాతకములో తులారాశిలో ౪° లో నున్న చంద్రుడు ప్రతిపక్షులలో ముఖ్యుడనుకొన్నాముకదా. తనవారినే అయిదుగురిని తీసుకొనవలయునని జిన్నాగారు పట్టుపట్టగా, వైస్రాయిగారు ౪ రిని మాత్రమే తీసుకొందునని వారి పేర్లను జిన్నాగారికి రహస్యముగ చూపిరట. ఇంద్రుడు కాంగ్రెసు చంద్రునిపైన కదా ఇప్పుడుండుట!

సిమ్లానగరములో జరుగుచున్న ఈ నాటక పరివర్తనకు ఆకాశరంగమున సూత్రధారు లున్నారని అనిపించుచున్నట్లున్నది!

కాన్ఫరెన్సు ఆరంభమైన దినమున రాజ్యస్థానమందున్న వరుణగ్రహము రవికి ౧౯° దూరములో నుండినాడు. నికరముగా ౧౯ వ రోజునాడే-అనగా జూలై నెల ౧౪-వ తేదీన కాన్ఫరెన్సు కడసారి కూడినది. వరుణుని చేయి పడితే, పిడుగుపడినట్లే! జరిగిన ఫలము అందరికీ తెలిసియేఉన్నది. ఆదినము ౧౧ ఏ. యం. కు సభ. అప్పటి కుండలి ప్రక్కకాలమున చూడుడు.

లగ్నము కన్యారాశిలో ౧౩°. అచ్చటనే అప్పటి చంద్రు డున్నాడు. లిస్టు ఇచ్చిననాటి చంద్రస్థానమునకు ఇది నిండుకేంద్రము. అనగా లిస్టునాటి చంద్రునికి ఇది నైధనతార. అసలు కాంగ్రెస్ జాతకమునకు నైధనతారలోనే కాన్ఫరెన్సు ఆరంభమగుట. తారాబలము బాగా కుదిరినది! అది అట్లుండనిండు. కాం

		కు 23-38	శు 6-48 వ 15-29 X 17-0
	[సాయనము] కాన్ఫరెన్సు కడపటి సమావేశము		రా 8-32 శ 15-22 ర 21-21
కే 8-32			బు 16-20
		ఇ 8-58	I 17-45 చ 16-51 న 22-30

గ్రెస్ జాతకమున చలితరాహువుతో కడపటి కాన్ఫరెన్సునాటి చంద్రుడు సంయోగము! కాన్ఫరెన్సుకు రావు(రాహువు)కొట్టినది. ఫలమునకు గ్రహణము పట్టినది. బుధుడు (వ్రాతలు, తీర్మానములు) కాంగ్రెస్ కుండలిలో చలితశనికి (కర్కాటకరాశి ౧౩°) అర్ధకేంద్రపు (౪౫°) ప్రతికూలదృష్టిలో నిలచినాడు. కాన్ఫరెన్సు వ్రాతలలో, ఉపన్యాసములలో ముగిసినది. వార్తాపత్రికలకు సమృద్ధిగా సమాచారములు దొరకినవి. ఫలముమాత్రము గడ్డకట్టినది.

చంద్రగ్రహణపు దినమును మాని కాన్ఫరెన్సును మంచిదినమున ఆరంభించియుండినచో లార్డు వేవెల్ గారి ప్రయత్నము తప్పక నెరవేరియుండును. అతని కీర్తి రాజకీయరంగమున సువర్ణాక్షరములతో చెక్కబడియుండును. కాన్ఫరెన్సును వేరే దినమునకు మార్చవలయునని ఎవరో కొందరు ప్రార్థించగా, అది సాధ్యము కాదనిరట. ఏమి కారణమో మరి?

రాయిటర్సు ప్రత్యేకవిలేఖరి లూయీ మ్యాన్స్‌ఫీల్డ్ (Louis Mansfield) గారు ఇటీవలనే ఒక వింత సమాచారము వార్తాపత్రికలకు వ్రాసినాడు. యుద్ధారంభము కాగానే బ్రిటిష్‌యుద్ధమంత్రులు తమ మంత్రాంగములో జ్యోతిష్కులను చేర్చుకొనిరట. హిట్లర్‌కు ఈశాస్త్రముపైన చాలా నమ్మకము. శాస్త్రజ్ఞులతో ఆలోచించి ఫలానాదినమే, ఫలానాకాలము

వశే ఫలానాసేనాని ఫలానాస్థలమునకు, ఫలానా విధముగా సేనలను నడుపవలయునని నిర్ధరించి, ఆప్రకారమే అతడు జరుపునట. ఇదంతయు బ్రిటిష్‌వారు తెలుసుకొన్నారు. జర్మనీజాతకము, హిట్లర్ జాతకము, అతని సేనాపతుల జాతకములు మొదలుగా కొంత సామగ్రి వీరు సంపాదించుకొన్నారు. ఎప్పుడు, ఏవిధముగా, ఎట్టిపరిస్థితులలో జర్మనులు సేనలు నడిపి దండెత్తివత్తురో, ముందుముందుగా బ్రిటిష్‌వారి జ్యోతిష్కులు గ్రహములనుబట్టి ఊహించి యుద్ధమంత్రులకు చెప్పుచువచ్చిరి. ఆసలహాల ననుసరించి మనవారు ముందుగానే తయారుపడినారు. హిట్లర్ శుభకాలమునకై కాచుకొనిఉండగా ముందుగనే పోయి, శత్రువుల ప్రయత్నములు కొనసాగకుండా మనవారు ధ్వంసము చేయుచువచ్చినారట. ఆ విద్వాంసు లెవరని కుతూహలపడి ఎందరో అడుగగా, బ్రిటిష్‌మంత్రులు వారి పేర్లు చెప్పలేదట. ఇది యుద్ధరహస్యము!

గ్రహముల చారమువలన సూచింపబడుఫలమును ఉపయోగించుకొని యుద్ధమున జయమును పొందుచున్నవారు బ్రిటిష్ రాజ్యాంగమంత్రులు. అట్టివారికి ఈగ్రహణఫలము తెలియకుండునా? మరి, ఉద్దేశపూర్వకముగా ఇట్టి దినమును లార్డ్ వేవెల్ గారికి ఎవరైనా సూచించి యుందురా?

ఎట్లైననేమి, భారతభూమిఆశ ఈగ్రహణమువల్ల చెడినది. ఇట్టి క్రూరదినమున ఇంత మంచికాన్ఫరెన్సు జరుగుటకు ముహూర్తము పెట్టినారే అని భారతమాత తల్లడిల్లినది. జూన్ నెల ౨౩ తేదీన— కాన్ఫరెన్సుకు నాయకులు సిమ్లాకు ప్రయాణము చేయు సమయముననే — ఉత్తరహిందూస్థానమందు లాహోరు, అమృతసరము, రావల్ పిండి మొదలగు పట్టణములలో భూకంపము కలుగుటయే ఇందులకు సాక్ష్యము.



జ్యోతిర్వేదము

ఎక్కడ పుట్టిన దీవిశ్వము? ఎటనుండి వచ్చిన దీసృష్టి?

= శ్రీ గొబ్బూరు వెంకటానంద రాఘవరావు =

౪

"కో అద్ధా వేద క ఇహ ప్రవోచ త్కుత ఆజాతా? కుత ఇయం విసృష్టిః?

మనకు కనబడుచున్న ఈ విశాలవిశ్వము ఎక్కడ నుండి పుట్టుకొనివచ్చినది? ఈ సృష్టి ఎటనుండి వచ్చినది? అనేది ప్రశ్న లన్నిటిలో పెద్ద ప్రశ్న. ఈ సంగతి ఎవనికి తెలుసును? తెలిసినప్పటికిని "దీని సంగతి ఇది" అని ఢంకామీద దెబ్బకొట్టినట్టు గట్టిగా నిలబడి చెప్పగలవా రెవరు? అని వేదము ప్రశ్నించుచున్నది. ఈప్రశ్ననే విశ్వామిత్రఋషి మరొకవిధముగా వేసియున్నాడు:

"కో అద్ధా వేద క ఇహ ప్రవోచ
దేవాం అచ్ఛా పథ్యాకాసమేతి,
దదృశ్ర ఏషా మవమాసదాంసి
పరేషు యా గుహ్యేషు వ్రతేషు."
(ఋ. III-౫౪-౫.)

ఏమార్గము ననుసరించి పోయిన మనము దేవతానివాసముల నెఱుగగలము? ఆ మార్గము సరియైనదేనని ఎవరు నిర్ధారణగా ప్రవచనముచేయగలరు? దేవతలు నిజముగా ఎక్కడ ఉన్నారో, ఏమూల ఏ రహస్యప్రదేశములలో వారు దాగియున్నారో తెలియలేదు. దేవతానివాసముల పొలిమేరల చివర భాగములుమాత్రము దృశ్యాదృశ్యముగా కనబడుచున్నవి.

ఇక భాగవతద్వితీయస్కంధములో (౭౩,౭౪, ౭౫,౭౬) నారదుడు బ్రహ్మను విశ్వప్రకారమును గూర్చి చక్కగా ప్రశ్నించినాడు:

మ. "చతురాస్యుండవు, వేల్పుపెద్దవు
................భారతీ
పతి యిల్లాలట నీకు నో జనక నా
సందేహముఁ బాపవే."

శా. "ప్రారంభాదివివేక మెవ్వ డొసగున్
ప్రారంభసంపత్తి కా
ధారం బెయ్యది? ఏమి హేతువు? యద
ర్థం బేస్వరూపంబు?"

శా. "నాకుం జూడగ నీవు రాజవనుచు
న్నాడన్ యథార్థస్థితిన్
నీకం టెన్ ఘను డొక్క రాజు గలడో
నీవంతకున్ రాజవో
నీ కేలాధము రాదలంచి జగముల్
నిర్మించె దీచేతనా
నీకం బెందు జనించు? నుండు? నడగున్?
నిక్కంబు భాషింపుమా."

శా. "......తద్విభున్
సంభాషింపగవచ్చునే తలప నే
ఛందంబునా నాకృతిన్?"

ఈ ప్రశ్నలలో విశేషము లున్నవి. "భారతీ పతి యిల్లాలు, వాణీశ్వరా" అని సంబోధించి వాణీ హిరణ్యగర్భులకు గల భార్యాభర్తృసంబంధము సంగ్రహించినాడు. అందుకుకూడ మంచికారణము కలదు. సరస్వతిప్రభావము ఋగ్వేదమునందు ఇట్లు వర్ణింపబడినది:

"చోదయిత్రీ సూనృతానామ్-చేతంతీ సుమతీనామ్
యజ్ఞం దధే సరస్వతీ-ధియో విశ్వా విరాజతి."

"సత్యములు, మనోజ్ఞములు నైన పలుకులనే సరస్వతి పలికించును. ఆమెయనుగ్రహము వలన భావము లుత్తేజనుపొందును. అటువంటి అద్భుత శక్తులు గల సరస్వతి నీకు భార్యయై నీ ముఖమం దున్నది కనుక నీ పలుకులు అబద్ధములు, పేలవములు కాకూడదుసుమా" అను ధ్వనితో నారదుడు సాభిప్రాయముగా బ్రహ్మను ప్రశ్నించినాడు. అటుపిమ్మట "యథార్థస్థితిన్" "నిక్కంబు భాషింపుమా" అని చేటతెల్లముగా రెట్టించి అడిగినాడు. "ఔరా! నా విభుని మర్మము నెరిగితి వత్సా!" అని బ్రహ్మ నారదుని ప్రశ్నల నాదరించి మెచ్చుకున్నాడు.

ఈ నాటి వైజ్ఞానికులుకూడ "**Whence** & **whither**?"—ఈ విశ్వము ఎలాగు పుట్టినది, ఎక్కడకు పోవుచున్నది అనే ప్రశ్నకు సమాధానము తెలుప యత్నించుచున్నారు. ఇటువంటి ప్రశ్నలకు వేదాదిప్రాచ్యవాఙ్మయము ఏమి జవాబులిచ్చినది? ఆ జవాబులను నవీనవిజ్ఞానము ఖండించునా? ధ్రువపరుచునా.? అనేది ఈ జ్యోతిర్వేదములో మన ముఖ్య జిజ్ఞాస. ఈ మహత్తరసమస్యలను సాధించుటకు మనము ఏమి చేయవలెను? ఏమి పరిశోధించవలెను?

మన అజ్ఞానాంధకారమును నశింపచేయుటకు సృష్టిలో భగవంతుడు మనకు సూర్యచంద్రనక్షత్రాది జ్యోతిస్స్వరూపములను నిర్మాణముచేసి యున్నాడు. అందు చంద్రుడు మన భూగోళముచుట్టును గానుగ ఎద్దువలె తిరిగివచ్చుచున్న ఉపగ్రహము. భూమి సూర్యునిచుట్టును అదేవిధముగా ప్రదక్షించుచున్నది. మన సూర్యుడొక నక్షత్రము. నక్షత్రములు బ్రహ్మాండ తేజముతో మెఱయు గొప్ప సూర్యగోళములు. కాబట్టి విశ్వరహస్యము లెంతవఱకైన ఛేదించి విశ్వప్రకారము రవంతయైన తెలిసికొనుటకు మనకు ఖగోళపరిశీలన మవసరము; నక్షత్రవేధ ముఖ్యసాధనము.

చుక్కలు - చుక్కల గుంపులు - వాని రూపములు

ఆకాశమందు చుక్కలు వేలకొలది అన్ని దిక్కులను వ్యాపించియున్నట్లు కనబడును. ఆ చుక్కల వ్యాప్తిని, కూర్పునుబట్టి కొన్ని గుంపులుగా విభజించవచ్చును. ఆ గుంపులలో కొన్ని చుక్కలను కొన్నివిధములుగా కలుపుకొనుచు గీతలు గీసినట్లు భావించుకొనిన పక్షమున ఏవేవో కొన్ని రూపములు ఏర్పడగలవు. అది యేలాగున చేయవచ్చునని మీరు ప్రశ్నించవచ్చును.

మన హిందువుల ఇండ్లలోను, వాకిండ్లలోను ప్రతిరోజున ఉదయము ముగ్గుపిండితో ముగ్గులు పెట్టి బొమ్మలు వేయుట ఆచారమైయున్నది. పిండితో నేలమీద తెల్లని గీతలు పడునట్లు వేయుచు గుమ్మడి పండ్లవలెను, పడగలు గల పాములవలెను అనేకవిధములుగా ముగ్గుబొమ్మలు వేయుచుందురు. ఒకప్పుడు రవంత రవంత మాత్రము పిండి వేయుచు ముందు తెల్లని బొట్లు పెట్టి చుక్కలవంటి ఆ బొట్లమధ్య అనేక రేఖలు వేసి నేర్పుగా కలుపుచు ఎన్నెన్నో లతలు, పువ్వులు, చిలుకలు, హంసలు మొదలగు చిత్రములు ముగ్గుతో రచించవచ్చును. నేర్పుగలవార లీముగ్గులు పెట్టినపుడు ఆ ముగ్గుచిత్రములు చూచుట కెంతో ముచ్చటగా నుండును. అదేవిధముగా పూర్వులు ఆకాశముమీద మెఱయు చుక్కలను గుంపులుగా విభాగించి వాటి రూపసాదృశ్యములనుబట్టి ఒక్కొక్క-

గుంపునకు ఒక్కొక్క పేరు పెట్టిరి. ఈ చిత్రములో కొన్ని బొమ్మలు చూడనగును. ఈ చిత్రముయొక్క అడుగుభాగములో కుడిప్రక్క ఒక తేలురూపము కానవచ్చుచున్నది. ఈ చుక్కలను చూచినచో తేళ



కైనను ఇది రూపమున తేలును పోలియున్నదని అనుకొందురు. ఈ చుక్కలగుంపును అన్నిదేశములవారును వృశ్చికమనిరి. తేలుముఖమున నున్న మూడు చుక్కలు అనూరాధ అందుము; తేలుకడుపులో నున్న మూడు చుక్కలలో మధ్యది జ్యేష్ఠనక్షత్రము. ఇంద్రుడు జ్యేష్ఠకు అధిదేవత. తేలుకొండెలో కనబడు చుక్కలు మూలనక్షత్రము. మూలకు ఎడమభాగమున విల్లులో అలుగు పెట్టి ప్రయోగించనైయున్న పురుషరూపము కనబడుచున్నది. ఈ గుంపును మనవారు ధనుస్సు అనిరి. ఇంగ్లీషువారు ధనుర్ధారి అనునర్థమిచ్చు **Sagittarius** అనిరి. ధన్వి మన పురాణప్రసిద్ధుడైన మన్మథుడు. మన్మథుని దిగువభాగము గుఱ్ఱమును పోలియున్నట్లు పాశ్చాత్యులు భావించిరి. మనవారు ఆ రూపమును చిలుకగా భావించిరి. చెఱుకువింటివానికి చిలుక వాహనమనుటకు కారణమిదియే. ధన్వికి ప్రక్కగా ఒక మేకరూపము కలదు. ఈ అజరాశినిగూర్చి వెనుక నుంచి ముచ్చటించితిము. అజమునకు మీదిభాగమున గరుడపక్షి రూపము కలదు. గరుడుని కడుపులో కనబడు మూడు చుక్కలు శ్రవణ మనబడు శ్రోణీనక్షత్రములు. గరుడునిపై నెవరో ప్రయోగించిన బాణముయొక్క రూపము ఆమీద చూడనగును. అమృతమపహరించువేళ ఇంద్రుడు కోపముతో వజ్రమెత్తి గరుడుని కొట్టగా ఆవజ్రాయుధము గరుడుని 'ఏక పర్ణశకలము'నుమాత్రము ఛేదింపగలిగె ననుట సుప్రసిద్ధవిషయము. గరుడుడు సుపర్ణుడు; గరుత్మంతుడు నని ఋగ్వేదము.

ఆమీద, పటముయొక్క ఉత్తరభాగమందు ఒక పక్షిరూపము కానవచ్చుచున్నది. పాశ్చాత్యులు ఈ చుక్కలను **Cygnus** అనుచున్నారు. అనగా చిన్న హంస అని అర్థము. వేదములో ఇది హంస, హంస అని వ్యవహరింపబడినది.

హంసకు కుడిదిక్కున తీగలుగల ఒక యంత్రసాధన మున్నది. దీనిని పాశ్చాత్యులు **Lyra** అని

చెప్పెదురు. మనవారు వీరే యని చెప్పుచున్నారు. వీనికి కుడిప్రక్క ఒక బలాఢ్యుడు తలక్రిందుగా నుండి పెద్దఅడుగులు వేసి ఏమో కొలుచుచున్నట్లు కనబడుచున్నాడు. అతని కాలు ఒక పాముమీద నున్నది.

"ఇదం విష్ణు ర్విచక్రమే, త్రేధా నిదధేపదమ్, సమూహ మస్య పాంసురే"

అని వేదములో వర్ణింపబడిన విష్ణుని రూపమిది. విష్ణుమూర్తి వామనుడై మూడడుగులలో విశ్వమంతయు కొలిచి బలిచక్రవర్తిని పదభ్రష్టుని చేసిన కథ భాగవతములో ప్రసిద్ధము. ఈరూపమునకు కుడి ప్రక్క నవరత్నఖచితమైన కిరీటరూపము కనబడుచున్నది. వృశ్చికరాశిలో జ్యేష్ఠనక్షత్రమున కధిదేవతయగు ఇంద్రుడు వృత్రుని సంహరింపబోవుచు "ఓ విష్ణుమూర్తీ! పెద్ద అడుగులు వేసి త్వరగా రమ్ము! మనము వృత్రుని సంహరింపవలయు" నని అర్థమిచ్చు మంత్రములు ఋగ్వేదమున కలవు. (ఋ. viii ౨౯-౧౨) వృశ్చికరాశికిని, వామనరూపికిని మధ్య పాముతో పట్లుపట్టుచున్న సర్పధారిరూపము కానవచ్చుచున్నది.

ఈ చిత్రము రివరెండ్ గాల్ దొరగారు రచించిన **Easy guide to the Constellations** అను పుస్తకములో నున్న ౨౪-వ పటమునకు సరియైన నకలు. ఈప్రాంతము ఖగోళములో చాల ముఖ్యమైనదని మన వేదఋషులు ఆనాడే గుర్తించిరి. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్"- శరీరమునందు గల ఇంద్రియము లన్నింటిలో కన్ను ప్రధానమైనది. అదే విధముగా ఆకాశరంగమంతటిలో ఈభాగము మిక్కిలి ప్రధానమైనది. "దివీవ చక్షు రాతతమ్" అని ఋగ్వేదము. కనుకనే బుద్ధిమంతులు ఎప్పుడును దీనిపై కన్నుంచి చూచుచున్నారు. "సదా పశ్యంతి సూరయః." ఇదే విష్ణువుయొక్క పరమపదము. "త ద్విష్ణోః పరమం పదమ్."

ఈ నక్షత్రములను, వీని ప్రాముఖ్యతను మొదట బాగుగా గుర్తించినవారు వేదఋషులు. పాశ్చాత్యులకు తొలుత ఈ నక్షత్రసమూహముల పేళ్లు తెలియవు. వాటి ప్రాముఖ్యత అసలే తెలియదు. ఈ విషయము ప్రాక్ప్రతీచీవిమర్శకుల కందరకును బాగుగా ఋజువు చేయుట మిక్కిలి అవసరము గనుక గ్రంథవిస్తరభీతి కోర్చి, ఖగోళమును చక్కగా వర్ణించుచు కావ్యములు వ్రాసిన గ్రీకురోమనుమహాకవుల గ్రంథములనుండి కొన్ని పంక్తులుమాత్రము వ్రాయుచున్నాను. పై చిత్రములో తలక్రిందుగా నుండి మీదకు పెద్ద అడుగులు వేయుచున్న స్వరూపము సుప్రసిద్ధగ్రీకురోమనుకవు లిట్లు వర్ణించిరి; కాని దానికి పేరు లేదనిరి.

Manilius:—

"A constellation kneels without a name.

Aratos:—

"Near to the Dragon's head,
in toil-spent posture
Revolves a phantom whose name
none can tell
Nor what he labours at;
they call him simply
The man upon his knee.

"Like a toiling man revolves
A Form. of it no one can clearly speak
Nor to what toil he is attached; but
Kneeler they call him... [simply
He who is never far distant from the
Lyre
Whoever this stranger of the Heavenly
Forms may be..." (Robert Brown's
translation from Original Greek)


ఈ పంక్తులు చదివినతరువాత ఈ ఖగోళస్వరూపమును గూర్చి ఆనాటి పాశ్చాత్యులకెవరికిని ఏమియు తెలియదని నిస్సందేహముగా స్థిరపడుచున్నది. ఈ రంగపు ఖగోళములో ఈ పటముందు

చిత్రింపబడిన రూపములు చాల మోటుగా, అనాకర్షణీయముగా ఉన్నవి. వీటి పరస్పరసంబంధ మేమో పాశ్చాత్యరచయితలు తెలుపలేదు. వీటికి వరుస, వావి, ప్రమేయము, ప్రయోజనము ఏమియు వారు వర్ణించలేదు. అసలు పేరులే వారిలో ఎవరికిని తెలియవని స్పష్టమగుచున్నది. కొదువసంగతులు వారేమి తెలుపగలరు?

మన వేదకాలపు ఋషులు బహుకాలము దీక్షతో ఖగోళమును పరిశీలించిరి. వృశ్చికరాశికి పైని ఉత్తరముగా ఉన్న ఖగోళప్రాంతము విశ్వమునకు కేంద్రమువంటిదని గ్రహించిరి. విశ్వమునకిదే ప్రాదుర్భావస్థానము; ఇదే రాజధాని; ఇదే గమ్యస్థానము అని నిర్ధారణచేసిరి. సృష్టి ఇక్కడనే ప్రారంభమగును; పుట్టి, పెరిగి, పెద్దదై నలుదిక్కుల వ్యాపించిన విశ్వము ఇందే తుదకు లీనమగునని ఆ మహనీయులు నాడే స్పష్టముగా ప్రవచించిరి. విశ్వముయొక్క సమస్యను సాధించుటకు పూనుకొనిన వేదఋషులలో విశ్వామిత్ర, వసిష్ఠ, మేధాతిథి, దీర్ఘతమ లనువారు చాల ముఖ్యులు. ఈ క్రింద వ్రాసిన మంత్రరత్నములలో వారు ఈ విశ్వచక్రమును త్రిప్పుచున్న విశ్వప్రభుని స్థానము చక్కగా హద్దుపరిహద్దులతో నిశ్చయించినారు.

౧. యత్రా సప్తఋషీన్ పరం ఏకం ఆహుః
౨. మారుతస్య వేధసః
౩. విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః
౪. తమిద్గర్భం ప్రథమం దధ్ర ఆపో యత్ర దేవాః సమగచ్ఛంత విశ్వే, అజస్య నాభావధ్యేక మర్పితం, యస్మిన్ విశ్వాని భువనాని తస్థుః
౫. యత్ర గావో భూరిశృంగా అయాసః
౬. నపతయంతః పతత్రిణః
౭. యత్రా సుపర్ణా అమృతస్య భాగా మనిమేషం విదదాభి స్వరంతి
౮. ఇనో విశ్వస్య భువనస్య గోపా.

ఈ హద్దులు, ఆనవాళ్లు గల ప్రదేశములో విశ్వచక్రమును నడుపుచున్న విశ్వప్రభుని—"నక్షత్రాశి రూపమ్" అని శ్రుతులు తెలుపు నక్షత్రస్వరూపుని—ప్రాక్ప్రతీచీవిజ్ఞానమతసమన్వయదృష్టితో పరిశీలించి చక్కగా తెలిసికొందము.



నేను — తాను

శ్రీ నండూరి వెంకటసుబ్బారావు

తనువంత నారాజు
తపసె యని—నేను,
మనసులో ఒంకితో
మంతనము—తాను!

బతుకంత నారాజు
పాట యని—నేను,
పాటలో ఒంకితో
పల్లదము—తాను!

నిదరంత నారాజు
నీడె యని—నేను,
కలలోని ఒంకితో
కిలకిలలు—తాను!

జగమంత నారాజు
సాగసె యని—నేను,
అద్దాన ఒంకితో
విద్దెములు—తాను!

అక్కచెల్లెళ్ళు

[కథానిక]

★

= 'స్వైరవిహారి' =

ఇటీవల రామనారాయణకూ, రాజేశ్వరికీ మధ్య వివాదాలు మరీ ఎక్కువయినాయి. అంతకుముందు మూడునాలుగు రోజులనుండీ ఎందుకో ఒకందుకు తెరిపి లేకుండా పోట్లాడుకుంటూనే ఉన్నారు. కొంచెం మొగం చిట్లించుకొని, "అబ్బ! వెధవగోల, రోజూ ఇంటికి వచ్చేసరికి ఏదో ఒక జట్టీ. మరి యీ నాజన్మకు శాంతన్నది ఉండదుకాబోలు" అని రామనారాయణ విసుగుకొని, వెంటనే వీథిలోనికి వెళ్లిపోవడము అది వరకు మామూలయిన పద్ధతి. కాని ఆనాడు కార్యక్రమం కొంత భిన్నంగా జరిగింది. అతని కంఠస్వరం ఒక్కమారుగా మంద్రస్థాయినుండి తారస్థాయిలోనికి లేచింది; కొంచెం చెయ్యి చేసుకుందుకుకూడా తయారుపడ్డాడు. అయితే రాజేశ్వరికి దీని పైసంగతి తెలియకపోలేదు. విచిత్రంగా ఆమెగొంతు తగ్గటం, ముక్కూ కళ్ళూ విజృంభించటం జరిగింది. ఆమె బాష్పసిక్తమయిన వదనాన్ని గంభీరంగా పైకెత్తి— "కొట్టండి; మీయిష్టం వచ్చినట్టు కొట్టండి. ఆఖరుకు మనకు చేతనయినది పెళ్లాన్ని కొట్టడమేగా" అంది సస్థైర్యంగా కన్నీరు తుడుచుకుంటూ. ఆమె భయపడి తప్పించుకుందుకు ప్రయత్నం చేస్తే అతడు కొట్టేవాడేమోగాని, అప్పట్లో అతనికి నిజంగా కొంచెం భయం వేసిందనే అనాలి. అతడు నిరుత్తరంగా వెనక్కుతిరిగి ఆడేపోకగా నల్ల చెరువు మెట్లవైపుకు నడక సాగించేడు.

ఎదురుగా ఆకాశాన ఇంద్రధనుస్సు కరిగిపోతూ ఉంది. రోజూ సర్వసామాన్యంగా ఉండే ఆకాశం మీద అప్పుడప్పుడు హరివిల్లు కనిపిస్తూఉంటుంది. విల్లు యుద్ధోపకరణంకదా? దీనితో వానరాజు ఎండదొరను వెంటాడుతాడేమో? ఎవరు ఓడినా, ఎవరు గెలిచినా ప్రపంచానికి సఖ్యత ఎంత సహజమూ, అనివార్యమో వైరముకూడా అంతేకాబోలు! అయితే వీటిలో, వైరములో ఏమి ప్రభావముందో, ఒకమారు అడుగుపెట్టిందంటే, అంతవరకు ఎంతోకాలముగా వ్యాపించిఉన్న సఖ్యతను ఎప్పుడయినా బ్రతికిఉందా అనే స్థితిలోనికి తీసుకొనిరాగలదు! రానురాను మానవుడు తాను ప్రకృతిలోని అంతర్భాగాన్నే మాటను మరిచిపోయి, తక్కిన యావత్ప్రపంచమును తనకు దాసీభూతముగా చేసుకొందుకే శక్తినంతటినీ ధార పోస్తున్నాడు.

అతని భావన అతనికంటే జోరుగా సాగిపోతున్నది. మళ్లీ అప్రయత్నంగా ఆకాశంవయిపు చూసేసరికి, హరివిల్లు చాలాభాగం కరిగిపోయింది. రెండు చివరలను రెండు ముక్కలుమాత్రం మిగిలేయి. ఈమారతని ఆలోచనాధోరణి వేరు.

ఇంతవరకూ హరివిల్లు పూర్తిగానే ఉంది. ఇక నీ రెండు ముక్కలూ మళ్లీ కలియడం ఎలా సంభవమౌతుంది? ప్రత్యేకములయిన ఆ రెండుఖండాలనూ కలిపికట్టడానికి మామూలుత్రాళ్లు చాలవు; ఆరెంటితో అవినాభావసంబంధ మున్న ఇంకొక సజీవ సవర్ణ

పదార్థ మేకో మధ్యన ఉండాలనిపించింది రామ నారాయణకు.

అతడు చాలా ఆలస్యంగా ఇంటికి వచ్చేడు. ఇంటిదగ్గర వ్యవహారం గంభీరంగా గడిచిపోయింది. అతను భోజనానంతరము తమలపాకులు వేసుకొంటున్న సమయంలో ఆమె ముఖం దించుకొని నెమ్మదిగా అంది: "మద్రాసునుండి మా చెల్లెలు మావాళ్ల యింటికి వస్తుందట. నేనుకూడా చాలాకాలమాయి వెళ్లలేదు. రేపుదయం రైలుకు నన్ను దిగబెట్టండి."

యీ ప్రార్థనకు మూలకారణమేమో రామనారాయణకు తెలియకపోలేదు. ఒక్క నిముషం ఊరుకొని ఉరిమినట్లుగా "సరే" అని, సినీమా (రెండవఆట) కు బయలుదేరేడు.

* * *

రామనారాయణలో సహృదయత్వం లేక పోవాన్నే కాదు, సంకుచితత్వాన్నికూడా మొట్టమొదట కనిపెట్టి వెలికితీసుకొనివచ్చినది రాజేశ్వరే అవాలి. అంతవరకూ తనలో అసూయాగుణం ఉన్న సంగతే తెలియదు అతనికి. అయితే యిక్కడ ఒక చిన్న ధర్మసందేహం ఉంది. అతనికి అసూయాగుణాలు మిక్కిలీ సహజములై వాటి ఒరపిడికి తాళుకోలేని రాజేశ్వరివల్ల వెలికివచ్చేయో, లేక తన స్వభావానుగుణంగా రాజేశ్వరి అతనియం దసూయాగుణాలను పదే పదే ఆరోపించటంవల్ల ఇటీవల మాత్రమే జనించి విస్తరించేయో అన్నది కొంచెము సంశయాస్పదమే. కాని రామనారాయణను చిన్నతనంనుంచీ బాగా తెలిసినవారికిమాత్రం రెండవ పద్ధతే ఎక్కువ సమంజసంగా తోస్తుంది. అతడు అమాయకుడు కాడుగాని దుర్మార్గుడుమాత్రం కాడు; అతడు ఆడంబరం అంటే ఎక్కువ యిష్టపడడుగాని వేదాంతికాడు; అతని సహనశక్తి అపరిమితమైనదేకాని కోపంకూడా విపరీతమైనదే. అతనికి ఇతరులమీద తన్ను స్తుతిస్తున్నప్పటికంటె నిందిస్తున్నప్పుడే నమ్మకం అధికం.

అతను స్టెనోటైపిస్టుపని చేస్తూ ఆరేళ్లూ, రాజేశ్వరితో సంసారం చేస్తూ నాలుగేళ్లూ అయింది క్రమంగా. ఏ అభివృద్ధీ లేకుండా మొదలుపెట్టినప్పటికీ, యిప్పటికీ ఒక్కలాగే ఉన్నాయి పై రెండూకూడా. ఆరంభంలో, వీటికంటె తాను వాంఛించవలసిన దేమీ ఉండదనీ, వీటివలన తాను స్వర్గసౌఖ్యం కాకపోయినా, మానవమాత్రులకు సాధ్యమయిన సౌఖ్యం చాలావరకూ పొందవచ్చుననీ ఆశించాడు. కాని కాలక్రమేణా ఏమీ కొత్తలేకుండా అన్నిరోజులూ ఒకదాని ప్రతిబింబముగా ఒకటి ఉండడంమూలాన్ని అతనిలో ఒకవిధమయిన అసంతృప్తి పొడచూపింది. ఆ అసంతృప్తివహ్నికి ఇటీవల రాజేశ్వరితో అప్రయత్నంగా వచ్చే వివాదాలు ఆజ్యధారలైనాయి.

రాజేశ్వరి అందమైనదే. మొదట్లో ఆమె అందాన్ని చూసుకొని అతడెంతో ఆనందించటమేకాదు, గర్వించేవాడుకూడా. ఆ ఆనందాతిరేకంలో "నీఅంత చక్కనిది దొరకడం నిజంగా నాఅదృష్టమేసుమా" అనికూడా అతడెన్నోమార్లామెతో అన్నాడు. ఇది అతడు హృదయపూర్వకంగా అన్నదే. కాగా, ఇందువల్ల రాజేశ్వరిస్వాతిశయం వృద్ధిపొందడంలో విశేషమేమీ లేదు. ఇంతకూ ఏయిల్లాలు మాత్రం తన భర్తనోటివెంట ఇల్లాంటి ప్రశంసను విని గర్వించకుండా ఉండగలదు? కాని ఇక్కడే తెలిసో తెలియకో రాజేశ్వరి ఒక పొరపాటు చేసింది. తన అందాన్ని ఇంతగా స్తుతిస్తూవచ్చిన రామనారాయణ తాను అసహ్యించుకోవలసినవాడు కాకపోయినా, తనకు యీడైన చక్కనివాడు కాడేమో ననుకుంది. ఈరకపు భావనను అతనిని ఆమెదృష్టిలో తేలికపరచిన అనేక కారణములలోనూ ముఖ్యమయినదిగా గణించవలసివుంది. అంతటినుండీ ఆమె అతనితో ఏవిషయములోనూ హృదయపూర్వకంగా కలియలేకపోయేది. ఇటీవల వారిద్దరిమధ్యనూ ఆవిర్భవించిన అభిప్రాయ వైషమ్యాలకు ఈభావన చాలా దోహదంచేసింది.

రామనారాయణలోని శాంతిప్రియతనూ, సహనశీలాన్నీ గుర్తించినంత చక్కగా అతనిలోని కోపాన్నీ, పడలని పట్టుదలనూ ఊహించినట్టయితే, రాజేశ్వరి అతనితో అంతగా వివాదపడకపోయేదేమో? కాని

యిప్పుడు సమయం పూర్తిగా దాటిపోయింది. అతనిలోని నిగ్రహమనే తంతువు ఆగ్రహవిజృంభణకు బిగిసి బిగిసి చివరకు తెగిపోయింది. ఇక అతనిలో మిగిలినదల్లా ఆమెను ఎల్లాగైనా సాధించాలన్న పట్టుదల. ఆమెను శారీరకంగా బాధించి సాధించలేనన్న సంగతి అతనికి అనుభవపూర్వకంగా తెలిసినదే. ఇక ఆమెను సాధించటానికి ఉన్నదల్లా ఒక్కటే మార్గం.

* * *

లక్ష్మి రామనారాయణకు ఒక వేలువిడిచిన మేనత్తకూతురు. ఆమెకు పదమూడవ ఏట పెళ్లి అయింది. పెళ్లి అయిన ఆర్నెల్లకు భర్త టైఫాయిడ్ వచ్చి పోయాడు. ఆమెతల్లి నరసమ్మకూడా విధవే. దగ్గరబంధువు లెవ్వరూ లేరు వారికి. అయితేనేం, కాలక్షేపం చెయ్యక తప్పుతుందా? కొంత నగదూ, కొద్దిగా భూమీ ఉండడంవల్ల భుక్తికి బాధ లేకపోయేది. కాని, వయసులో ఉన్న లక్ష్మిని, తాత్కాలికానందంకోసం, పాశవికంగా కామించే వారి దృష్టినుండి తప్పించటం నరసమ్మకు రానురాను మరీ దుష్కరమనిపించింది. ఎంత లోకంతో సంబంధాన్ని తెగకొట్టుకొని ఉన్నా, లక్ష్మిప్రవర్తనమీద అనేకదుష్ప్రవాదాలు కర్ణాకర్ణిగా వారికి తెలిసేలాగ వాడుకలోకిరావడం నరసమ్మకు దీర్ఘమనోవ్యాధికారణంగా పరిణమించింది. మనోవ్యాధి కొంచెం ఆశ్రయం కల్పించుకున్న తరువాత శారీరకవ్యాధులకు కొదవా?

సరిగా అదేసమయంలో రాజేశ్వరి తనతో పోట్లాడి పుట్టింటికి వెళ్లిపోయినతర్వాత, పట్టణంజీవితంమీద విసుగుపుట్టి, రెండునెలలు నౌఖరీకి సెలవుపెట్టి రామనారాయణ బయల్దేరేడు స్వగ్రామానికి. అక్కడ అతనికి స్వంత ఇల్లుందిగాని, అందులో కొన్ని సంవత్సరాలుగా ఎవ్వరూ ఉండకపోవడంవల్ల, అది కొంత పాడుపడింది. అతడు తిన్నగా నరసమ్మఅత్తగారింటికి వెళ్లేడు. వెళ్లి చూసేసరికి ఆమెస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది. మేనల్లుడు తలవనితలంపుగా మంచి అదనుకు వచ్చేడన్న సానందమయిన ధైర్యంతో ఆమె చెప్పిన రెండుమాటలవల్లా అక్కడి వారి పరిస్థితి పూర్తిగా అవగాహనఅయింది రామనారాయణకు. అదివరకు లక్ష్మి వెళ్లి ప్రాధేయపడితే, ఆమెతో పరాచికా లాడిన వైద్యుడే, రామనారాయణ వెళ్లి మొహమాటపెట్టగా కాదనలేక వచ్చి యిచ్చిన నాలుగు పొట్లాలకూ ఫలితంగా నరసమ్మగారికి కొంచెం తెరిపిచ్చింది. కాని ఎక్కువభాగం ఆమెలోని ఈ మార్పుకు కారణం రామనారాయణఆగమనమే.

అప్పటికి శాంతించినా అక్కడే ఉంటే వ్యాధి పూర్తిగా నయమవడం అసంభవమనీ, అందువలన తనతో మర్నాడే పట్నం రావలసిందనీ పట్టుపట్టేడు రామనారాయణ. లక్ష్మికూడా అదే మంచిదంది. నరసమ్మగారు కాదనలేకపోయింది.

* * *

పట్నంవచ్చిన రెండురోజులకు నరసమ్మగారి వ్యాధి తిరగబెట్టింది. రామనారాయణ కుదిర్చిన డాక్టరు "పంతులుగారూ! లాభం ఉన్నట్టు కనిపించదు; చాలాకాలం అశ్రద్ధ చేసినట్టున్నారు"అని, కొంచెంసేపు ఆలోచించి, "అయినా, ఆఖరుప్రయత్నంగా ఒక ఇంజక్షను ఇచ్చిచూద్దాం; కొంచెం తెలివయినా వస్తుందేమో"అన్నాడు. రామనారాయణ నిరుత్తరంగా మంచందగ్గర నేల చతికిలబడ్డాడు. డాక్టరు అన్నట్టే అయింది. ఇంజక్షను ఇచ్చినతరువాత కొద్దిగా తెలివివచ్చింది. కాని ఆమె ఆట్టే మాట్లాడలేదు. రామనారాయణను 'బాబూ!' అని పిలిచి, కాళ్లదగ్గర ఉన్న లక్ష్మిని కళ్లతో చూపిస్తూ "జాగ్రత్త! నిన్ను నమ్ముకొని నేను పోతున్నాను"అని యింకా ఏమో చెప్పడానికి వ్యర్థంగా ప్రయత్నంచేసింది.

రామనారాయణకు బాగా జ్ఞానంవచ్చినతర్వాత సభావ్యమయిన ఏడుపు రావడానికి అదే మొదటిమారు. లక్ష్మి "అమ్మా!"అని శిలాప్రతిమవలె అలా చూస్తూ ఉండిపోయింది. డాక్టరు నీరవంగా నిలబడిపోయేడు.

కొంతసేపటికి డాక్టరు కటువుగా ఇంగ్లీషులో, "పంతులుగారూ! మీరే అలా ఏడిస్తే ఎలా కుదురు

యిప్పుడు సమయం పూర్తిగా దాటిపోయింది. అతని లోని నిగ్రహమనే తంతువు ఆగ్రహావిజృంభణకు బిగిసి బిగిసి చివరకు తెగిపోయింది. ఇక అతనిలో మిగిలిన దల్లా ఆమెను ఎల్లాగైనా సాధించాలన్న పట్టుదల. ఆమెను శారీరకంగా బాధించి సాధించలేనన్న సంగతి అతనికి అనుభవపూర్వకంగా తెలిసినదే. ఇక ఆమెను సాధించటానికి ఉన్నదల్లా ఒక్కటే మార్గం.

* * *

లక్ష్మి రామనారాయణకు ఒక వేలువిడిచిన మేనత్తకూతురు. ఆమెకు పదమూడవ ఏట పెళ్లి అయింది. పెళ్లి అయిన ఆర్నెల్లకు భర్త టైఫాయిడు వచ్చి పోయాడు. ఆమెతల్లి నరసమ్మకూడా విధవే. దగ్గరబంధువు లెవ్వరూ లేరు వారికి. అయితేనేం, కాలక్షేపం చెయ్యక తప్పుతుందా? కొంత నగదూ, కొద్దిగా భూమీ ఉండడంవల్ల భుక్తికి బాధ లేక పోయేది. కాని, వయసులో ఉన్న లక్ష్మిని, తాత్కాలికానందంకోసం, పాశవికంగా కామించే వారి దృష్టినుంచి తప్పించటం నరసమ్మకు రానురాను మరీ దుష్కరమనిపించింది. ఎంత లోకంతో సంబంధాన్ని తెగకొట్టుకొనిఉన్నా, లక్ష్మిప్రవర్తనమీద అనేకదుష్ప్రవాదాలు కర్ణాకర్ణిగా వారికి తెలిసేలాగ వాడుకలోకిరావడం నరసమ్మకు దీర్ఘమనోవ్యాధికారణంగా పరిణమించింది. మనోవ్యాధి కొంచెం ఆశ్రయం కల్పించుకున్నతరువాత శారీరకవ్యాధులకు కొదవా?

సరిగా అదేసమయంలో రాజేశ్వరి తనతో పోట్లాడి పుట్టింటికి వెళ్లిపోయినతర్వాత, పట్టణంజీవితం మీద విసుగుపుట్టి, రెండునెలలు నౌఖరీకి సెలవుపెట్టి రామనారాయణ బయల్దేరేడు స్వగ్రామానికి. అక్కడ అతనికి స్వంత ఇల్లుందిగాని, అందులో కొన్ని సంవత్సరాలుగా ఎవ్వరూ ఉండకపోవడంవల్ల, అది కొంత పాడుపడింది. అతడు తిన్నగా నరసమ్మఅత్తగారింటికి వెళ్లేడు. వెళ్లి చూసేసరికి ఆమెస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది. మేనల్లుడు తలవనితలంపుగా మంచి అదనుకు వచ్చేడన్న సానందమయిన ధైర్యంతో ఆమె చెప్పిన రెండుమాటలవల్లా అక్కడి వారి పరిస్థితి పూర్తిగా అవగాహనఅయింది రామనారాయణకు. అదివరకు లక్ష్మి వెళ్లి ప్రాధేయపడితే, ఆమెతో పరాచికా లాడిన వైద్యుడే, రామనారాయణ వెళ్లి మొహమాటపెట్టగా కాదనలేక వచ్చి యిచ్చిన నాలుగు పొట్లాలమూ ఫలితంగా నరసమ్మగారికి కొంచెం తెరిపిచ్చింది. కాని ఎక్కువభాగం ఆమెలోని 'యీ మార్పుకు కారణం రామనారాయణఆగమనమే.

అప్పటికి శాంతించినా అక్కడే ఉంటే వ్యాధి పూర్తిగా నయమవడం అసంభవమనీ, అందువలన తనతో మర్నాడే పట్నం రావలసిందనీ పట్టుపట్టేడు రామనారాయణ. లక్ష్మికూడా అదే మంచిదంది. నరసమ్మగారు కాదనలేకపోయింది.

* * *

పట్నంవచ్చిన రెండురోజులకు నరసమ్మగారి వ్యాధి తిరగబెట్టింది. రామనారాయణ కుదిర్చిన డాక్టరు "పంతులుగారూ! లాభం ఉన్నట్టు కనిపించదు; చాలాకాలం అశ్రద్ధ చేసినట్టున్నారు" అని, కొంచెంసేపు ఆలోచించి, "అయినా, ఆఖరుప్రయత్నంగా ఒక ఇంజక్షను ఇచ్చిచూద్దాం; కొంచెం తెలివయినా వస్తుందేమో" అన్నాడు. రామనారాయణ నిరుత్తరంగా మంచందగ్గర నేల చతికిలబడ్డాడు. డాక్టరు అన్నట్టే అయింది. ఇంజక్షను ఇచ్చినతరువాత కొద్దిగా తెలివివచ్చింది. కాని ఆమె ఆట్టే మాట్లాడలేదు. రామనారాయణను 'బాబూ!' అని పిలిచి, కాళ్లదగ్గర ఉన్న లక్ష్మిని కళ్లతో చూపిస్తూ "జాగ్రత్త! నిన్ను నమ్ముకొని నేను పోతున్నాను" అని యింకా ఏమో చెప్పడానికి వ్యర్థంగా ప్రయత్నంచేసింది.

రామనారాయణకు బాగా జ్ఞానంవచ్చినతర్వాత సశబ్దమయిన ఏడుపు రావడానికి అదే మొదటిమారు. లక్ష్మి "అమ్మా!" అని శిలాప్రతిమవలె అలా చూస్తూ ఉండిపోయింది. డాక్టరు నీరవంగా నిలబడిపోయేడు.

కొంతసేపటికి డాక్టరు కటువుగా ఇంగ్లీషులో, "పంతులుగారూ! మీరే అలా ఏడుస్తే ఎలా కుదురు

తుంది! మనము ఏవో ప్రయత్నాలు చేసే మానవులమే గాని దేవతలం కాముకదా! ఇక మీరు అలా విచారిస్తూ ఉంటే, మీ భార్య(అని లక్ష్మినుద్దేశిస్తూ) ఆమె ఆరోగ్యంకూడా బాగున్నట్టు లేదు. తగిన మందు తీసుకొంటూ త్వరలో యీ విషయాన్ని మరిచిపోతేనే తప్ప, ఆమెకుకూడా ఏదయినా అనివార్యమయిన వ్యాధి అంకురించడానికి అవకాశం ఉంది" అనడంతో రామనారాయణ మళ్లీ మామూలు మనిషి కాకతప్పింది కాదు.

* * *

లక్ష్మి ఆరోగ్యం విషయంలో రామనారాయణ తీసుకొనే శ్రద్ధ డాక్టరుగారికి మొదట ఆనందాశ్చర్యాలనూ, తరువాత క్రమంగా విసుగుదలనుకూడా కలిగించే స్థితికి వచ్చింది. అంతవరకూ రామనారాయణ అతని చేసే సంశయావళితో ముట్టడిస్తూనే ఉన్నాడు.

ఇక లక్ష్మిని ఆనందింపజేయడము సందర్భములో రామనారాయణ అదివరకు తనకు అపరిచితములయిన ఎన్నో మార్గాలను అవలంబించేవాడు. "నాకేం కష్టం లేదు—నేను బాగానే వంట చెయ్యగలను" అని ఆమె అంటున్నాకూడా హోటలునుండే భోజనం తెప్పించేవాడు. తాను సామాన్యమైన ఖరీదులకే కొన్న రెండు చీరలను కట్టుకొనే ఆమె ఎంతో మురిసిపోవడంతో అతనికి విలువైన మరి రెండు చీరలు కొనాలనిపించింది.

రైల్వేబుక్ స్టాలులోని ప్రతిపత్రికనూ, కథల పుస్తకాన్నీ కొన్నాడు అతడామెకోసం. మూడు రోజుల కొకమారయినా సినిమాకు తీసుకొని వెళ్లేవాడు. ఎప్పుడూ ఆమెను ఒంటరిగా ఉండనీయక ఏదోవిధంగా తనను తాను మరిచిపోయేట్టు చెయ్యడానికి బహుధా ప్రయత్నించేవాడు రామనారాయణ.

లక్ష్మి సుఖంకోసం రామనారాయణ అవలంబించిన పథాలు ఇదివరలోగాని, ఇప్పుడుగాని ఆమె మనఃపూర్వకంగా వాంఛించినవే అనలేం. అయినా తన తల్లికి అతనిమీద నుండే అభిమానమూ, తనకు సరైన వేళను ఆలంబనము ఇచ్చేడన్న గౌరవమూ ఆమెను అతని చేతిలోని కీలుబొమ్మను చేసేయి. అంతేకాని చిన్నతనంలో ఇద్దరూ కలిసిమెలిసి ప్రవర్తించిననాటి అనురాగగరిమ ఇన్ని సంవత్సరాల ఎడబాటుకూ, ప్రత్యేకవ్యక్తిగత వేదనలకూ క్షీణించక యింకా అక్షతంగా మిగిలి ఉందని విశ్వసించలేముకదా!

ఏది ఎల్లాగయినా ఇక్కడ ఒక చిన్న విశేషం. రామనారాయణకు సహజంగా సినిమాలూ, చీట్లాట, కథల పుస్తకాలూ, కబుర్లూ అంటే ఉన్న సరదా బహు పరిమితము. కాని తానే సర్వస్వమయిఉన్న లక్ష్మిని ఆనందపరచేందుకు ఆమెతోకూడా తానూ వీటికి అలవాటు పడుతున్నాడు. ఇక లక్ష్మి! ఆమెకు ప్రత్యేకించి ఎల్లాటి సరదాలూ లేకపోయినా, తనకు సరైన సమయంలో రక్షకుడుగా అవతరించిన రామనారాయణ ఉత్సాహాన్ని నిరోధించకుండా ఉండడానికి మాత్రమే వీటికి ఇష్టపడుతున్నది.

ఇతరములయిన అడ్డంకులు లేని సమయాలలో స్త్రీపురుషులమధ్య (అందులోనూ యౌవనమధ్యస్థంలో ఉన్నవారివడుమ) స్నేహం అక్కడితో అలా ఆగిపోవడం ఎక్కడోకాని సాధ్యంకాదు. మొదట్లో కేవలం లక్ష్మి దేహారోగ్యం మీదనే కేంద్రీకృతమయిన అతని మనసు నేడామె కనులకదలికలోని తారళ్యాన్నీ, మాటపొందికలోని మాధుర్యాన్నీ గమనించటంతో ఆగక ఆమెకరస్పర్శలోని కాంతత్వాన్నీ, సాహచర్యంలోని సౌఖ్యగరిమనూ ఆకాంక్షించసాగింది. ఇది మొదట్లో అతనికే ఏదో వింతగా తోచింది. కాని ఏదో వింత అన్నంత తేలికగా కాకుండా. ఈ విషయంలో అతని ఉత్కంఠ రానురాను అతివేలమయింది. అతడామెను చూడకుండా ఎడంగా ఉండలేడు. చూస్తూ నిగ్రహంగా ఉండడం మరీ దుర్భరంగా వుంది.

"లక్ష్మిమీద నాకు కలిగిన యీ మోహము ఎంతవరకూ సభ్యమయినది? చిన్నతనంలో ఆమె నాకు ఎంతో సమీపంలో ఉండేది కాదా? అప్పుడామెను

ప్రేమించడములో ఎటువంటి దోషమూ లేదుకదా! పరిస్థితులు మారినంతమాత్రాన హృదయాల్లో కూడా పరివర్తనం వచ్చితీరాలా? అది సాధ్యమా? అంతేకాక, హృదయాలు వశించిన వృద్ధులు ఏవేవో కారణాలు మనసులో పెట్టుకొని వేయించిన వివాహపు ప్రేముడి ముడులకు ఫలితంగా ఇంతకాలం ఒకరికి ఒకరు కాకుండా అయిపోయేము. ఇప్పుడు ఏకారణంవల్లనయితేనేమి? మెఱుపు మెరిసినట్లుగా ఆమె వచ్చి నాచేతిలో పడ్డది. అదృష్టవశాత్తూ వచ్చిన యీ అవకాశాన్ని స్వార్థం శూన్యంచేసుకొని జారవిడుస్తానే అనుకుందాం. అయితే యిప్పుడామె యేం చేసేది? ఎవరో ఒక రక్షకుడు అంటూ ఉండక తీరదుకదా స్త్రీకి?

"ఇవతల నాపరిస్థితికూడా ఇటీవల మరీ పాడుగా ఉంది. రాజేశ్వరికీ, నాకూ యీ నాలుగేళ్లలోనూ నాలుగువందలమార్లయినా వివాదాలూ, పోట్లాటలూ వచ్చిఉంటాయనుకొంటాను. అయినా దృక్పథాలే వేరుగా ఉన్న స్వాతంత్ర్యప్రియులయిన యిద్దరు వ్యక్తులు కలిసి కాలక్షేపంచేయడం ఎలా సాధ్యమవుతుంది? ఇక ఆమెకూ, నాకూ కుదరవట్టే. ఆమెకు ఆమెతండ్రి తెస్తున్న ధనముమీదనే గౌరవం. నాకు నాతండ్రిచేత జీవితసర్వస్వాన్నీ, యావదాస్తినీ పరార్థమై వ్యయింపచేసిన త్యాగశీలిమీదనే పూజ్యభావం. పూర్తిగా ఆయనకు పుత్రుడను కాలేకపోయేనే అని నావిచారం. మానసికంగానైనా ఆయనఅభిప్రాయాలనూ, చేతలనూ ఆరాధించటం ఆమెకు కంటకప్రాయం. ఇక మాకెల్లా కుదురుతుంది? అటువంటప్పుడు లక్ష్మికి నాహృదయంలో స్థానం ఇవ్వడంలో తప్పేముంది?"

—అతని యోచనాచక్రము హృదయమనే ఇరుసునాధారంచేసుకొని ఎన్నిరకాలుగాపరిభ్రమిస్తూవచ్చినా అయస్కాంతమువలె చివరకు సూచించే దిక్కులు రెండే—లక్ష్మిని హృదయాధిదేవతను చేయడం, రాజేశ్వరిని విస్మరించటమున్నూ. ఈ రెంటినీ తూచే సందర్భంలో అతని హృదయం ప్రాలేయాచలం మొదలు పరమాణువువరకూ ఉండే పదార్థాలన్నిటినీ తూకపురాళ్లుగా ఉపయోగించసాగింది.

మంచిచెడ్డల మాట ఎలాగున్నప్పటికీ, అదే పనిగా అజస్రమూ ఆలోచించడంమూలాన్ని రామనారాయణకు తన అభిలాషలో ఎటువంటి దుష్టప్రకృతిచ్ఛాయా లేదనిపించింది. క్రమంగా అది న్యాయ్యమూ, అవలంబనీయమూ అన్నట్టుకూడా తోచింది. అంతేకాదు. తనను నీరసంగా చూసి, నిర్లక్ష్యంచేసి, పుట్టింటికి వెళ్లిపోయిన రాజేశ్వరిని సాధించడానికి అదే ఉత్తమవిధానంగా రూపించింది.

లక్ష్మిని ప్రేమించడంవిషయంలో ఒక నిశ్చయానికి వచ్చినతరువాత రామనారాయణకు తక్కిన పని తానూహించినకంటె ఎన్నోరెట్లు సులువుగా నెరవేరినట్లనిపించింది. అనగా లక్ష్మికి తనమీద ఇటీవల కలిగిన గౌరవభావము అంత మహిమాన్వితమయేనా ఉండాలి; లేకపోతే, తనలాగే ఆమెలో కూడా చిననాటి స్నేహం ప్రణయంగా పరిణమించేనా ఉండాలి. ఏది ఎల్లాగయితేనేం? పుట్టిన ఉద్దేశానికి తుదికనుక్కోగలిగేననీ, కనుక్కొన్న లక్ష్యాన్ని సాధించితీరేననీ అతనిలో కలిగిన ఆనందము అతణ్ణి పారవశ్యదీనుణ్ణి చేసింది.

లక్ష్మిరామనారాయణ లిప్పుడు భార్యాభర్తలలాగే ప్రవర్తిస్తున్నారు. అసలు భార్యాభర్తృసంబంధంలో యింత ఆనందముందా అనిపిస్తున్నది హృదయాలు ఏకమయిన వారిద్దరికీ. అంతే కాదు. వారి అన్యోన్యసంబంధము ఎన్నోజన్మలనుండీ, ఎన్నోయుగాలనుండీ అవిచ్ఛిన్నముగా వస్తున్నట్టు వారిరువురికీ ఏదో అంతర్వాణి ప్రబోధించినట్టు తోచింది.

వారికి పరస్పరసాహచర్యంవలన రోజులు గంటలుగానూ, గంటలు క్షణములుగానూ గడిచిపోతున్నాయి. ఆమెను వదిలి ఉండలేక అతడు ఆఫీసుకు మరిఒక నెలరోజులు సెలవుపెట్టేడు. లక్ష్మికి యిదేదో సుఖస్వప్నం కంటున్నట్టు మాత్రమే ఉంది. అంతకాలం వయసుకు తగిన వలపూ, ఉత్సాహమూ లేక, ఒంటరిగానైరాశ్యంలో కాలం గడిపిన ఆమె

యీరకపుజీవితాన్ని ఒక్కమారుగా నిజమని నమ్మలేకపోయింది.

అతనికి వెనుక రాజేశ్వరితో కాపురంచేస్తున్నప్పుడు ఈమాత్రం సౌందర్యపిపాసా, ఉత్సాహోద్రేకాలూ లేకపోలేదు. కాని లక్ష్మిలోని సహానుభూతి, ఆత్మీయతాఫలితమయిన అనురాగమూ లేకుండా, అతని కాంక్షాపరిపూర్తికి అడ్డుచెప్పకపోవడాన్నే ఏదో మహాత్కార్యంగా భావించేది రాజేశ్వరి. అమాయకదృష్టిలో ఈరకపు భావనకూ, ఆమె పుట్టింటివారి ఆర్థికోన్నతికీ విశేషం సంబంధం కనబడదుగాని ఏస్త్రీ నడిగినాసరే, అదేనని చెప్పేస్తుంది అదే అసలుకారణమని. కాగా ఈసందర్భంలో తెలియజేయవలసిన దేమిటంటే—రాజేశ్వరితండ్రి బాగా రాబడి ఉన్న వకీలు. చెల్లెలుమగడు మద్రాసులో నెలకు నాలుగువందలు జీతం తెచ్చే లెక్చెరరు. ఆమె అన్న ఇంజనీరింగు చదువుకున్నాడు. ఈమధ్యనే ఎవరో ఒక జమీందారువంటివారు అతనికి తమ పిల్లనిస్తామని చెప్పవచ్చేరుకూడానట !!

ఆరకపు వాతావరణంలో పెరిగిన ఆమెకు రామనారాయణ స్టెనోటైపిస్టుపని చేసి తెచ్చే అరవై రూపాయలూ ఎందుకూ చాలనివిగా, ఏమీలేనికంటె ఏకొంచెమో ఎక్కువగా మాత్రమే కనిపించటంలో ఆశ్చర్యమేముంది? కేవలం పుట్టుకవల్లనే ధనికులయిన వారికంటె, శ్రమ పడిపడి జీవితలక్ష్యంగా భావించి ఆర్జించినవారికే ధనముమీద కాంక్షా, గౌరవమూ కూడా ఎక్కువగా ఉంటాయి. ఆరకపు వ్యక్తులతోనే చిన్నతనమునుండీ సంబంధము ఉన్న ఆమె హృదయంలో రామనారాయణకు ఎన్నడూ గౌరవనీయమయిన స్థానం లేదు. కాని తనలోని ప్రప్రథమ సౌందర్యపిపాస చల్లారేవరకూ అతనికి ఆమె తనను ఏరకపు దృష్టితో ! చూస్తున్నది అన్న ప్రసక్తే లేదు. అట్లాటి సమయంలో ఆమె అతని ఉత్సాహవల్లికి ఏ మాత్రం దోహదం కల్పించినా అతడామెను వినిశ్చలంగా ప్రేమించేవాడే; కాని కాలం గడచినా మార్పు లేకుండా, ఎప్పటికీ అతని ఆర్థికస్థితిమీదనే దృష్టినిలిపిన ఆమెను అతడు క్రమంగా ఏవగించుకొనే స్థితిలోనికి వచ్చేడు.

ఇక లక్ష్మి: ఆమెకు ధనమువల్లనే కలిగే సుఖదుఃఖాలు అనుభవపూర్వకంగా తెలియవనే అనాలి. తనకు సరిపడినకంటె ఎక్కువ ఉండీకూడా ఆమె నిన్నమొన్నటివరకూ ఆనందమంటే ఏమిటో తెలియని స్థితిలో ఆరాటపడింది. ఈ నాడామె రామనారాయణసాహచర్యంవలన పొందుతున్న ఆనందానికి కూడా అతని ధన మొక ముఖ్యకారణము కాదు. ఆమెలోని ఆనందమల్లా, తనలో అదివరకు అవ్యక్తంగా అణగిఉన్న అభిలాషలకు ఒక ఆకృతిని కల్పించి, వాటి సాఫల్యానికి తోడుపడుతున్న తనకు గౌరవనీయుడైన ఒక వ్యక్తిని ఆనందింపజేయగలుగుతున్నాననే తృప్తివలన కలిగినదే. అదివరకు రాజేశ్వరితో అన్ని సంవత్సరాల సాంసారికజీవితంలోనూ అతనికి అననుభూతమూ, అజ్ఞాతమూ అయిన తన్మయానందగరిమ లక్ష్మి సాహచర్యంమూలంగా ఇంత కొద్దికాలంలో సంప్రాప్తించడానికి ఆమెలోని యీ సహానుభూతిమంతమయిన సంతృప్తే ముఖ్యకారణము.

“ఇంక నే నెలాగూ నీదాననేకదా బావా! నువ్వు నాకోసం నీ మిగతాపనులన్నీ మానుకొని కూర్చుంటే ఎలాగ?” అన్న ప్రేమపూర్వకమయిన ఆమె సూచనవలన అతడు మళ్లీ ఆఫీసులో ప్రవేశించేడు. ఆఫీసుజీవితం వెనుకటికంటె ఎన్నోరెట్లు అసహ్యంగా ఉన్నా, సంతతదరస్మితాంచితమయిన లక్ష్మి ప్రసన్నవదనదర్శనంతో అతడు పారవశ్యవిలీను డయ్యేవాడు.

అతడామెను రానురాను మరీ గాఢంగా ప్రేమించడానికి తగిన కారణం లేకపోలేదు. ఆమె యిప్పుడు గర్భవతి. తమ అన్యోన్యప్రేమవృక్షపు ప్రప్రథమఫలము ఇక కొద్దిలో అందుబాటులో ఉన్నదన్నప్పుడు పరస్పరప్రేమసూత్రబంధితులయిన ఏ యువతీయువకుల హృదయాలు తన్మయానందలహరీతరంగమాలికలతో కలిసి నృత్యముచేయవు?

వస్తుందివస్తుం దనుకొంటున్న సరళ ఇంకా రానేలేదు; కాని రమ్మని పిలుపుగాని, వస్తున్నానని సూచనగాని లేకుండానే రాజేశ్వరి హఠాత్తుగా పుట్టింటికి వచ్చింది. ఆ తరువాత రెండునెలలకు సరళ వచ్చింది.

ఈ మారు రాజేశ్వరి వెనకటివలె "నాదికాని ఈ ఇంటి మంచిచెడ్డలతో నాకేమిపని ?" అన్నట్టు ఒంటరిగా ఉండడంలేదు. ఇంటిని అలంకరించటం లోనూ, ఇంటికి అయే ఖర్చువెచ్చాలను పరిచూడటం లోనూ, యథేచ్ఛాచారులయిన పనివాళ్లను అదుపు ఆజ్ఞలలో ఉంచడంలోనూ ఆమె అసమానమయిన ప్రతిభను ప్రదర్శించింది. సూక్ష్మంగా చెప్పాలంటే, పుట్టింటిలో యజమానురాలు లేకపోవడంవల్ల ఎంత ధనము ఖర్చు అయినా ఇంటివారికి సరైన సదుపాయము లేకపోవడము అనే ముఖ్యమయిన లోపాన్ని పూర్తిగా తొలగించిం దనకతప్పదు. రెండురోజులుగా ఆ యింటిలో వున్న దూరపుచుట్టానికికూడా, ఒక్క గంట ఆమె లేకపోతే, ఇంత యిల్లూ శతధా శకలీభూతము కాకతీరదనిపిస్తుంది. ఆమెచాకచక్యము అంతటిది.

సరళ వచ్చిన తరువాత ఆమెతో కాలక్షేపం చేయడంలో రాజేశ్వరి కొంతవరకూ ఇంటి వ్యవహారాన్ని చూడడం తగ్గించినా, అదివరకూ ఆమె ఏర్పరచిన నియమాలప్రకారం సాంసారికచక్రం సక్రమంగానే సంచరించేది.

ఎన్నో వ్యాపృతులతో, బాధ్యతలతో, ఆనంద జనకములయిన ఆందోళనలతో ఆమెకు కాలము అతి త్వరితంగా గడిచిపోతున్నది; కాని, అన్నిటికీ అడుగున, మరిచిపోవడానికి యత్నిస్తున్నకొద్దీ మరీ బలంగా భర్తతో పోట్లాడివచ్చేనన్న స్మృతి ఆమెను కలవరపెట్ట సాగింది.

అంతలో సంక్రాంతి వచ్చింది. అదివరకు సంక్రాంతికి రాజేశ్వరీరామనారాయణ లిద్దరూ కలిసే వచ్చేవారు. అతడు పండుగవెళ్లగానే వెళ్లిపోయే వాడు. ఆమె మరొక నెల్లాళ్లుండి వెళ్లేది. ఇదీ అది వరకు అలవాటయిన పద్ధతి. ఈ మారు (ఎలాగూ రాజేశ్వరి ఇక్కడే ఉందికదా అని) అతనిని రమ్మని రాసిన రెండు ఉత్తరాలకూ జవాబే లేదు. ఈనిరుత్తర నిరాగమన వ్యవహారానికి ఇంట్లోవారందరూ తలా ఒక రీతిని వ్యాఖ్యానం చేసేరు. రాజేశ్వరివర్తనం ఎంత గంభీరంగా ఉన్నా ఆమె రావడానికీ, అతడు ఉత్తరమయినా లేకుండా రాకపోడానికీ వారూహించిన కారణంలో విశేషం దోషంలేదు అనే అనాలి.

రాజేశ్వరిలోని పట్టుదలా, గుంభనమూ మచ్చుకైనా లేవు ఆమెచెల్లెలు సరళలో. ఆమెకంటె రాజేశ్వరి సహజంగా చక్కనిది కాకపోయినా, సమయస్ఫూర్తీ, వాక్చమత్కృతీ, ఆంగికవిన్యాసమూ ఆమె కొక విశిష్టమయిన ఆకర్షకశక్తి నిచ్చేయి.

ఇక, యింట్లోకూడా, రామనారాయణను అతనితోడి అల్లుణ్ణి చూసిన గౌరవభావంతో ఎన్నడూ ఎవ్వరూ చూడకపోయినా, అన్ని విషయాల్లోనూ రాజేశ్వరినే సరళకంటె ఎక్కువగా మన్నించేవారు అందరూను.

కాని యీమారు సరళ వచ్చినతరువాత రాజేశ్వరి ప్రాముఖ్యము రోజురోజుకూ తగ్గిపోతూవచ్చింది. ఆమె విసుక్కొని తొలగించిన పనిమనుషులు పోయి సరళతో ఫిర్యాదుచేసికొని తమ స్థానాన్ని పునఃప్రతిష్ఠించుకోవడమూ, తండ్రికూడా ఏ కారణంవల్లనో ఆమెమాటనే 'సబబుగా వుందనడమూ రాజేశ్వరికి ఎంతో అవమానజనకము లయేవి. ఈ అవమానకంటకములు ఒకింత స్తబ్ధమయిన స్మృతిభాగమును మరింత రెచ్చగొట్టేయి.

ఇక ఊళ్లోని చెలిమికత్తెలుకూడా సగంమంది తన ఉనికినే గ్రహించినట్టు లేదు. చాలామంది సరళను ప్రత్యేకించి ఇళ్లకు ఆహ్వానించి విందులు చేసేరు. బాగుండదేమో అన్న దృష్టితో తననుకూడా కొందరు ఆహ్వానించకపోలేదు. కాని వెళ్లడం తనకు ఏమంత గౌరవప్రదం ?

సరళభర్త తనకు రావడానికి వీల్లేదనీ, అందుచేత అవకాశం చూసుకొని, ఎవరినయినా సాయంతీసుకొని రావలసిందనీ రాశాడు. ఆమె వెంటనే ప్రయాణం కట్టింది. తండ్రీ అన్నదమ్ముడే కాదు, ఇంట్లోని దాసీలుసైతమూ బలవంతం చేసి, ఆమెను మరోక పది రోజులు ఉండడానికి ఒప్పించేరు. రాజేశ్వరి కిదేమీ తెలియని సంగతి కాదు. తననుకూడా ఇదివరకు ఇలా బలవంతపెట్టిఉంచడము మామూలే. కాని యీపర్యాయము తన నెవరూ మరోక రోజుకూడా ఎక్కువ ఉండమని కోరటంలేదు. అయినా తాను వెళ్తానంటే కదా తనను ఉండమనడానికీ, అవకపోవడానికీ. తనభర్త తనకోసం తహతహపడుతున్నప్పుడుకదా తనను మరికొంతకాలం ఉండమని బలవంతంచేయడానికి ఇక్కడివారికి వీలు. తానతనికి అక్కరలేకపోయినతర్వాత ఇక్కడివారికీ తన అవసరము లేదు. తప్పనిసరిగా భరిస్తారుగాని.

ఇన్నివాళ్లుగా ఆమెలో అణగిఉన్న వేదనావాహినికి నేడానకట్ట తెగిపోయింది. ఆమెకళ్లలో నీళ్లు గిఱ్ఱుమన్నాయి. ఎదుటివస్తువు లేవీ సరిగా కనిపించలేదు. తొందరతొందరగా తన గదిలోనికి వెళ్లి మంచంమీద బోర్లపడి వెక్కివెక్కి ఏడ్వసాగింది. ఆమెదుఃఖం తెరలుతెరలుగా వచ్చింది. ఆమె చిన్నతనంలోకూడా ఎన్నడూ అంత నిస్సంకోచంగా ఏడవలేదు. అనాడామె ఏడ్పులోకూడా ప్రత్యేకత. ఇదివరకువలె తన దైన్యమునకు ఇతరుల దౌష్ట్యమునుకాక తన తొందరపాటునే కారణముగా భావించగలుగుతున్నది ఆమె. ఆ సంధ్యసకె వెలుగులో ఆరంభించిన ఆమెయేడ్పు తండ్రితో సినీమానుండి వచ్చిన సరళ "ఏమే రాజా! నువ్వింట్లోనే ఉన్నావుటే? అన్నయ్యతో నాటకానికి వెళ్లేవనుకున్నాను." అనేవరకూ అలా నిర్నిరోధంగా సాగిపోతూనే ఉంది.

రాజేశ్వరి ఎంత గంభీరంగా ఉన్నా ఆమె యథార్థస్థితి అదివరకే కొంత అవగాహన అయింది ఆమెచెల్లెలు సరళకు. ఇక మరి ఆ గాంభీర్యముకూడా అవసరంలేకపోయింది. రాజేశ్వరి వేదనను వెలార్చటానికి వీలులేనప్పటి గాంభీర్యములోని క్లేశాన్ని మరి సహించలేకపోయింది.

మునుపు తాను ఏమి మాటాడినా, ఏదో ఒకవిధంగా ఎగతాళిచేసి నవ్వడంగాని, నిరుత్సాహంగా ఊరుకోవడంగాని అలవాటయిన రాజేశ్వరి అంటే కొంచెం బెదురుగానే ఉండేది సరళకు. ఆ జంకు తెరను తొలగించుకొందుకు ఆమె సోదరీత్వపు ప్రేమకు బలం చాలకపోయేది. కాని నేడు వారిద్దరిమధ్యను అదివరకున్న తెరలు వాటంతట అవే తొలగిపోయేయి.

తర్వాత సరళ ఉన్న పదిహేనురోజులూ ఒక్కక్షణమయినా ఒకరికొకరు విడిచిఉండలేదు. తక్కిన ప్రపంచమునుగూర్చిన స్మృతే లేదు వారిద్దరికీ. ఆ కొద్దికాలం ఒకరి కష్టసుఖాలు ఒకరు సానుభూతిమతులై వినడంతో, అపూర్వమయిన అనుబంధమేదో వారిని సరైన అక్కచెల్లెళ్లను చేసింది.

సరళ చెప్పిన మాటలవలన ఆమెభర్త ఎంత సౌమ్యుడైనా, ఆమె తనకంటె—కాదు తనపాటికూడా - సుఖపడలే దనిపించింది రాజేశ్వరికి. ఔను పాపం. ఏ సరదాలూ లేని రోగగ్రస్తుడయిన భర్తతోడి సంసారంలో ఏమాత్రం ఆనందం ఉంటుంది? తన శరీరానారోగ్యాన్ని ఎఱిగిఎఱిగి పెళ్లిచేసుకున్న అతనిని సరళ ఎలా ప్రేమించగలుగుతున్నదో? తానైతే ప్రేమించలేకపోవడమేకాదు, ద్వేషించేదికూడా. కాని సరళ అతని ఆనందమును మనసా వాంఛిస్తున్నదే! అలాటి పరిస్థితిలో తాను రామనారాయణప్రేమగౌరవములను తృణీకరించటం ఎంత అవమానకరమయిన సంగతి?

సరళను దిగబెట్టివచ్చిన మర్నాడే తండ్రితో కలిసి బయలుదేరింది రాజేశ్వరి. సరళవలన సూచనగా రాజేశ్వరిపరిస్థితిని విన్న తండ్రి ఆమె కోరడమే తడవుగా బయలుదేరేడు. (సశేషము)

కంపెనీప్రభుత్వంనాటి ఆంధ్రదేశపు రెవిన్యూవిధానాలు

★

= శ్రీ అజ్జరపు వెంకటరమణారావు =

కొత్తగా దేశంలో అధికారంలోకి వచ్చిన ఇంగ్లీషు వర్తకసంఘంవారి ఆధిపత్యాన్ని ఆంధ్రదేశపు జమీందారులు అంగీకరించినా రెవిన్యూపరిపాలన యావత్తూ వీరి చేతుల్లోనే వుండిపోయింది. అది తమ స్వాధీనం చేసికొని యీ ప్రజలతోగాని, పరిస్థితులతోగాని పరిచయం లేని పరాయిప్రభుత్వం తమంతటతామే వ్యవహారాలను సమర్థతతో నిర్వహించుకొనే సావకాశాలులేక, తాత్కాలికంగా ఆనాటి ఘమలులో వున్న విధానాలనే అనుసరించడం వుత్తమం అనుకొంది.

రాజమంద్రి పరగణాముటుకు ఇదివరకు నైజాముప్రభుత్వంలో వున్నతోద్యోగి అయిన హుస్సేనుఆలీఖానుకు క్రీ. శ. ౧౭౬౬ నుంచి ౧౭౬౯ వరకు కౌలు యిచ్చారు. ౧౭౬౯ నుంచి కంపెనీవర్తక కేంద్రాలలోని వర్తకసంఘసభ్యులనూ, వారి సలహాదారులనూ యీ రెవెన్యూవిషయాలనుకూడా చూడవలసిందని వారి ప్రభుత్వం నియమించారు. ౧౭౬౯లో మచిలీపట్నంజిడారేవులోని తమ వర్తకకేంద్రం అధికారంకింద కొండపల్లి, ఏలూరు, రాజమంద్రి పరగణాలను అప్పగించారు. ఈలోవుగా వారి ప్రభుత్వం నియమించిన సర్క్యూట్‌కమిటీసభ్యులు ౧౭౮౩ నుంచి ౧౭౮౮ వరకూ తెలుగుదేశం యావత్తూ పర్యటనంచేసి పంటలనుగురించి, ప్రజలనుగురించి, పరిశ్రమలు, వర్తకం, జమీందారులు, వారి సిబ్బందీ, వారి రెవెన్యూపరిపాలనావిధానాలు, వారి హవేలీలు, హక్కులు, వారి ఆధ్వర్యం పుట్టుపూర్వోత్తరాలు, వారు వసూలుచేసే సొమ్ముల మొత్తాలు, వాటికి ప్రాతిపదికమయిన సూత్రాలు—యీ యావద్విషయాలనుగురించీ తమకు సాధ్యమయినన్ని విషయాలను సేకరించి ప్రచురించారు.

ఈసర్క్యూట్‌కమిటీసభ్యులు అందిచ్చిన పరిస్థితుల జాబితా కేవలం జమీందారులు, గ్రామకరణాలు, తదితరగ్రామీణులు యిచ్చిన సమజాయిషీనాధారంచేసికొన్నదేగనుక అందులో మనవారికేవిధంగానైనా ప్రమాదం వస్తుందని తోచే ఏవిషయాలయినా వుంటే వాటిని మరుగుపరచి తక్కిన విషయాలనే వారికి తెలియజేశారు. అందులో జమీందారుల పూర్వోత్తరాలు ఏమిటి? వీరెవరు ? వీరి అధికారం యొక్క తత్వమేమిటి ? వీరీనాడు చలాయించే అధికారానికి పునాదులయిన హక్కులు ఏనాటివి ? అనే విషయాలనుగురించి యీకమిటీ జమీందారులు యిచ్చిన అభిప్రాయాలమీదనే తన అభిప్రాయాలను చెప్పుకోవలసివచ్చిన పరిస్థితులుగనుక, విదేశప్రభుత్వానికి ఎంతవరకూ యీపరగణాల సంగతులు అర్థమయినాయి, అవడానికి తగిన సావకాశాలు ఏమివున్నాయి అన్నవిషయం మనం గ్రహించాలి.

మన దేశంలో తురుష్కప్రభుత్వాల ఆధిపత్యం ఉచ్ఛదశలోవున్న కాలంలోనయినా జమీందారులే రెవెన్యూఉద్యోగులు. వీరు మోతుబరీ కలిగి, తమ చుట్టుపక్కలలో పలుకుబడి వున్న ఘరానామనుష్యులు

గనుక పరిసరాలలో వున్న భూముల సాగుబడీ, పాడి పంటలూ చూస్తూ, పంటలమొత్తాన్ని, విలువను ఏటేటా పరిచూస్తూ, హెచ్చుతగ్గులను గుర్తిస్తూ పన్నులలో రైతులకు యథాతథంగా తగిన పరిష్కారానికి సాయంచేస్తూ, వారిలో వచ్చే తగాదాలను తీరుస్తూ, వారికి అవసరమయినప్పుడు సేద్యానికి కావలసిన సొమ్ము బాకీయిస్తూ, వారిచ్చిన పన్నులను ప్రభుత్వానికి వారి తరఫున చెల్లిస్తూ ప్రభుత్వం పన్నులలో యిచ్చే కొంతభాగాన్ని, యిళ్లపన్నులమీద వచ్చే ఆదాయంలో కొంత భాగాన్నీ పుచ్చుకుంటూ, యివిగాక పన్నులు లేని మాన్యాలను అనుభవిస్తూవుండేవారు. వీరి కీమాన్యాలు గాక, యీ పై సుంకాలలోనుంచే కమీషను నూటికి పదిపాలు ముట్టేది. వీరు ప్రభుత్వాధికారంసాహాయంతో ప్రభుత్వంతరఫున పనిచేసే రెవెన్యూఉద్యోగులేగాని భూమిలో అధికారం కలిగి రైతులమీద సర్వాధికారం వహింపగలిగే భూస్వాములుమటుకు కారు. రైతుకు భూమిలో సహజంగా వుండే హక్కు అతనిదే. కులక్రమాగతంగా పన్నులు వసూలుచేసే యీవుద్యోగం చేస్తోన్నంతమాత్రంలో వారికి రైతాంగంమీద ఏవిధమయిన యితరఅధికారమూ లేదు.

కాని ఇంగ్లాండుదేశంలోని భూముల సాగుబడి, భూస్వాముల అధికారం, భూమిలో హక్కులేక భూస్వాములు ఏనాడు పొమ్మంటే ఆనాడు పోవలసి వచ్చే రైతుజనం పరిస్థితులతోటి పరిచయం ఉన్న పరాయిప్రభుత్వంవారికీదేశంలో భూస్వాముల కున్న పలుకుబడీ, పెద్దతనం వున్న మన జమీందారులను చూడగానే మన దేశపు భూమిపరిస్థితులు తమ దేశంలోలాంటివే అని పొరపాటుపడింది. ఈపొరపాట్లే, యీ అనాలోచితపు నిరాధారపు నమ్మకాలే మన దేశపు రెవెన్యూవిధానానికి పునాదులయి విపరీతమయిన విపత్తును తెచ్చిపెట్టాయి.

"తెలంగాణపు జమీందారులు ఇంగ్లాండుదేశంలోని ప్రభువులవలెనే తమ భూములమీద అన్నివిధాలయిన హక్కులూ కలిగిన స్వతంత్రప్రభువులు. మన దేశంలో వున్న భూస్వాములలాగే వీరూ అధికారంలో వున్న ప్రభుత్వానికి కొంత సుంకం కట్టి, స్వతంత్రంతో జీవిస్తున్నారు" అని వీరిని గురించి కొత్తగా వచ్చిన వర్తకసంఘంవారింటికి వ్రాశారు. మచిలీపట్నంఓడరేవులో స్థిరపడి, అటూ యిటూ వున్న పరగణాల రెవిన్యూవిధానాలను పరిచూడవలసిన వర్తకసంఘాధ్యక్షునికీ, 'సలహాదార్లకూ యీవిధానం అంతే అర్థమయింది. "ఈ జమీందారులంటే మన ఫ్యూడలుభూస్వాములవంటి పెద్దలు అంటే సరిపోతుంది. ఈ రాజులు ప్రభుత్వానికి కొంత కప్పం కట్టి యుద్ధసమయంలో సైన్యాలను పంపడం తప్ప యింకే విధంగానూ రాజ్యాధికారానికి బాధ్యులు గారు" అనే యీ వర్తకసంఘసభ్యుల కానాడు నమ్మకం.

భూమిమీదా, సముద్రంమీదుగానూ జరిగే వ్యాపారంపై విధించే వర్తకసుంకాలు, పొగాకు, తమలపాకులు, గంజాయి, సారా, గూడాకు, భంగ్, నల్లమందు, చెక్కలు మొదలయిన దినుసులపయిన సాలీనా విధించే పన్నులు, ఎగుమతి దిగుమతిపన్నులు యిన్నింటిలోనూ జమీందారులకు భాగాలుండేవి.

ఇక రెవెన్యూవిధానం ప్రకారం పంటలో ఆరవవంతు మటుకే రైతుకు మిగిలేది. జమీందారులు వారికిష్టమయినవారికీ, వారికి యిష్టంవచ్చిన విధంగా భూములను కవులూకదపాల కిస్తున్నారు. ధనరూపకంగా శిస్తు చెల్లించాలని నిర్ణయించినా పంటభాగా పంచితే పంటనే యిమ్మని నిర్బంధించేవారు. పంట పోతే శిస్తు యిచ్చేదాకా నూటికి నెలకు నాలుగు, లేక అయిదు రూపాయలు వడ్డీ చెల్లించమనేవారు. మంచి భూములు తమకిష్టమయినవారికే యిచ్చి పేద రైతులను తమ కుటుంబాలతో, పశువులతో, పనిముట్లతో సాయంచేయమని నిర్బంధించేవారు. రైతులకు యింతమోపయిన భూమిపన్నే గాక, యింకా ధాన్యంమీద, వుప్పుమీద, పశువులమీదా ప్రతి నాలుగయిదు మైళ్లకు సుంకాలు చెల్లించుకోవలసి వచ్చేది. చౌకీలు లెఖ్ఖలేకుండా పెరిగిపోయినాయి; దాన ధర్మాలకని ఒక కొత్తరకం పన్ను వసూలుచేయడం

ఆరంభించారు. వీటితో ప్రజాసామాన్యజీవితం మరీ దుర్భరమయిపోయింది. ఇన్నీగాక, జమీందారులకు మామూళ్లు అని వేరే వసూలుచేయించేవారు. రైతులకు యీనిర్బంధాలను గురించి మొరపెట్టుకుంటే వినే ప్రభుత్వం లేదు; ఇదివరకు ప్రభుత్వాలవలె యీ జమీందారులు తిరగబడిననాడు వారిని శిక్షించి అధికారంలో వుంచగలిగిన ప్రభుత్వం కాదు కంపెనీ. అందుచేత యీరైతుల దురవస్థకు ఆనాడు విమోచన ఏమీ కనిపించలేదు.

గ్రామోద్యోగులు రెవెన్యూ విధానంలోని అన్యాయాలను అడ్డుకొని, ఆ పరిస్థితుల నభివృద్ధిచేయడం లేదు గాని, అధికారంపోయిన పరిస్థితులలో తమకున్న పలుకుబడిని ఉపయోగించుకొని, స్వలాభం కోసం ఎన్ని పాడుపనులయినా చేయడానికి వెనుకంజ వేయడం లేదు. కొంతమంది ఎన్నో భూములను కలిపి వేసికొని చిన్న చిన్న జమీందార్లు అయిపోయారు. గ్రామలెఖ్ఖలు వారిదగ్గరనే వున్నాయి. వారే రెవెన్యూ వసూలుదారులు. ఇంక వారికి సాధ్యంకానివి యేమున్నాయి? ఇదివరకు ప్రభుత్వాధికారం బలవత్తరమయిన రోజుల్లో ప్రభువులు దేవాలయాలకనీ, సత్రములకనీ, బాటసారుల పోషణార్థమనీ కొన్ని గ్రామాలనూ, బ్రాహ్మణులకు కొన్ని అగ్రహారాలనూ కొన్ని పన్నులు లేకుండానూ, కొన్ని తక్కువ పన్నులకూ దానపట్టాలు వ్రాసి యిచ్చారు. వీరితోపాటే గ్రామోద్యోగులకూ, కరణాలకూ, గ్రామనౌకర్లకూ, గ్రామావసరాలకు పనికివచ్చే కొంతమంది పాటక జనానికీ కొన్ని యీనాములను యిచ్చారు. వీటన్నిటి సంఖ్య యీకాలంలో హద్దుపద్దులు లేకుండా అమాంతంగా పెరిగిపోవడం ప్రారంభించింది.

ఈ పరిస్థితులకు పరిష్కారంగా సరూక్యులర్ కమిటీ కొన్ని సూచనలను చేసింది: (i) ఈరెవెన్యూ విధానాన్ని తణిఖీచేయడానికి కొన్ని హవేలీ భూముల లోనూ, జమీందారీలలోనూ తెనుగు రెవెన్యూ నౌకరులపైన ఇంగ్లీషు సూపరువైజరులను నియమించమంది. (ii) అంచనామీద శిస్తులు నిర్ణయంచేస్తామంటే రైతులకు మోసం తగులుతుంది గనుక ఆవిధానం ఆపాలంది. (iii) సర్వేవిధానం అమలుపరచి, పంటలో కొంత భాగాన్ని అయినా, లేక దాని విలువనయినా నిర్ణయించి ప్రభుత్వం పుచ్చుకోవాలంది. (iv) భూములను ఏటేటా వేలంవేసే విధానాన్ని మానుకోవాలని సలహాయిచ్చింది. (v) నాలుగయిదు పరగణాలు కలిపి ఒక్కొక్క తెనుగు మేనేజరుకు ఒప్పగించి, యీ మేనేజర్లను ఇంగ్లీషు సూపర్‌వైజర్లవద్ద తాబేదారులుగా ఉంచాలంది. (vi) రైతులు యివ్వవలసిన పన్ను, పంటలూ, వారికీ ప్రభుత్వానికీ రావలసిన భాగాలూ కౌలులోనే స్పష్టీకరించాలంది. (vii) అన్యాయంగా, ఆధారం లేకుండా అమలుజరుగుతోన్న అనేక రకమయిన వర్తకసుంకాలను రద్దుచేయాలంది. (viii) ఇవన్నీ అయిన తరువాత న్యాయమయిన సూత్రాల ప్రకారం ఒక శాశ్వతపన్నువిధానం అమలు జరపాలని అంది.

శాశ్వత పన్ను చట్టం అమలుజరపాలంటేగాని, యితర మార్పులను చేయాలని తలుచుకుంటేగాని ఏ విధంగానూ సరియయిన సంగతులు మనకు తెలియక పోవడం గొప్ప యిబ్బంది అని యింటివద్ద వారి ప్రభుత్వంవారన్నారు. ఈజమీందారులను అధికారంలోనుంచి తొలగించి, వారి సిబ్బందీలను మానిపించి, వారి కోటలను కూల్చి, వారి నధీనంలోకి తెచ్చుకోవాలన్నారు సరూక్యులర్ కమిటీ. ఇది సాధ్యంకాదని అధికారంలో వున్న వర్తక సంఘసభ్యులు అన్నారు. అప్పుడు బంగాళాదేశంలోలాగే యిక్కడా క్రీ. శ. ౧౮౧౬ నుంచి రెవెన్యూబోర్డు నొకటి స్థాపించి రెవెన్యూ సంబంధమయిన యావద్విషయాలకూ బాధ్యత వహించమన్నారు.

క్రీ.శ. ౧౮౨౩లో ఓరమ్ (Oram) అనే ఇంగ్లీషు సూపరువైజరు యీనాటి రెవెన్యూ విధానంలో వున్న లోపాలనూ, వాటికి తను సూచించే పరిష్కారాలనూ తన ప్రభుత్వానికి తెలియజేశాడు. ఒక కంపెనీ ఉద్యోగిని తెనుగురెవెన్యూ ఉద్యోగులమీద అజమాయి

నీకి పంపా లన్నాడు. భూమి కొలతలు, పంట మక్తాలూ, ప్రభుత్వభాగం, సైన్యభాగం, భూముల శిస్తురివిషనలు యీవిషయాలన్నీ ఇదివరకు కానంగో లాగే యిప్పటి మాపరుసైజర్లు చూచుకోవా లన్నాడు. శిస్తులనుమటుకు యథావిధిగా యిదివరకులాగే వర్తక కేంద్రాలలోని సంఘాధ్యక్షులకే వెళ్లిస్తే బాగుంటుందని తన అభిప్రాయం అన్నాడు.

క్రీ. శ. ౧౭౯౨ సం. దాకా యీవర్తకసభ్యుల సలహాసంఘాలు ప్రభుత్వాధికారంతో పరిచయం లేకుండానే గడపగలిగినా, అప్పటినుంచీ ప్రభుత్వాధి కారంకిందకి చేరుకున్నాయి. లార్డు హోబర్టు గవర్నరు అవడంతోటే యీ వర్తకసంఘాధ్యక్ష పదవులకూ, వారి సలహాదారులకూ అధికారం చెలాయించమన్న కాలానికి స్వస్తిచదివించాడు. కాని జమీందారుల అధికారంమటుకు ఏమీ వాసితగ్గలేదు. వారి సిబ్బందీ దళాల సంఖ్య పలచబడలేదు. ఈ ఖర్చులకు యిచ్చుకోవలసిన పన్నుల భారంతో ప్రజలు ఘూర్ణిల్లిపోతు న్నారు. ఇంతవరకు అధికారంలో వున్న వర్తక సంఘాధ్యక్షులకే రెవెన్యూపరిపాలన పేరిట యీజమీం దారుల కలవాటయిన ఘోరప్రవర్తనవిషయమే తెలి యదు. వారికి వర్తకవ్యాపారవిషయాలలోని లావా దేవీలుతప్ప రెవిన్యూపరిపాలనగురించిన సంగతులేవీ అర్థంకావు. అందుచేత రెవిన్యూవిధానం ఏవిధంగా వుండాలి అనే సమస్యను తేల్చవలసివచ్చింది. క్రీ. శ. ౧౭౭౮ సం.లో సర్ థామస్ రంబోల్డు జమీందారుల నందరినీ తనతో సంప్రతించి తమతమ పేష్కషు విషయం పరిష్కారంచేసికోవడానికి మదరాసు రమ్మని కబురుపంపాడు. అంతవరకూ ప్రయాణం చేయడానికి బత్తెఖర్చులకు డబ్బులేదని జమీందారులు ఆందోళనచేస్తే విసేవా రెవరున్నారు! ౧౭౮౩ నుంచి ౧౭౮౮ వరకు రంబోల్డు వీరందరితోటీ వారివారి భూముల శిస్తులు నిర్ణయించాడు. మామూలుజమాబందీ పైన మాటికి ౧౦౦ పాళ్లు అదనం యీపద్ధతిప్రకారం రైతుకు కట్టాడు; వారీపన్నులు చెల్లించుకోలేక పోయారు. బకాయీలుపడడం ప్రారంభించినాయి. ౧౭౮౩ లో సర్క్యూట్ కమిటీ తన నివేదికను తయారుచేసి, ప్రభుత్వాని కప్పగించింది. క్రీ. శ. ౧౭౮౩నుంచి ౧౭౮౬ దాకా సంవత్సరంవారీశిస్తులు ఏర్పాటుఅయినాయి. ఈమార్పు మంచికోసమే వచ్చిన ట్లనిపించింది. బకాయీలుతీరడం ఆరంభమయింది. ఈసారి క్రీ. శ. ౧౭౮౬ నుంచి ౧౭౮౯ వరకూ కవులు కదపాలను నిర్ణయించారు. ఇవి అవగానే యింకోసారి ౧౭౮౯ నుంచి ౧౭౯౪ వరకూ యింకోఅయిదేళ్లకు కలిపి ఒక్క సారిగా భూమిశిస్తులను వ్రాయించారు.

ఇక హవేలీభూముల పన్నువిధానం పరిశీలిస్తే, వాటి దుస్థితి మరీ అన్యాయంగా వుంది. రంబోల్డు చికాకోలు, మచిలీపట్నం హవేలీలకు క్రీ. శ. ౧౭౭౭ నుంచి ౧౭౮౭ వరకూ పదియేండ్లదాకా స్థిరమయిన శిస్తువిధానం ఏర్పరిచాడు. పంటలో చెరిపాలు ప్రభుత్వమూ, ప్రజలూ పంచుకొంటున్నారు. ప్రభుత్వా నికీ ప్రజలకూ కూడా యీవిధానంవల్ల ఎన్నో రకా లయిన అనర్థాలు సంభవించాయి. ఈ అవస్థలను తొల గించాలంటే యింకా ఎంతో మంది ఉద్యోగులు కావాలి. ఈఖర్చులకు ప్రభుత్వం అంగీకరించదు.

ఇంతేకాకుండా దేశభాష లర్థంకాని యింగ్లీషు ఉద్యోగులను యీ రెవిన్యూవిధానాల పరిష్కారం కోసం నియమించడం ఏమిటని సర్ ఛార్లెస్ వైట్ వంటి ఇంగ్లీషుప్రభుత్వాధికారులే ప్రశ్నించారు. అతి దుస్తరమయిన బాధ్యతలను అప్పగించి, బతక డానికి చాలని జీతా లిస్తే, అదనంగా రాబడి వచ్చే అవకాశాలు వున్నప్పుడు వాటిని వుపయోగించుకో వడంకోసమే యీవుద్యోగులు తొందరపడవలసి వస్తుంది. అంతటితో ప్రభుత్వపు పరపతి పోయి, పరిపాలన అన్యాయంగా జరిగిపోతుంది అని యీ తక్కువజీతాల ప్రమాదాన్ని గురించి ఇతడు మాట్లా డాడు. కారన్‌వాలిస్ ప్రభువుకూడా యీ సంగతిని బాగా గ్రహించినవాడు. "మీ కీదేశంలో బాధ్యతా యుతమయిన పరిపాలన సాగాలంటే, మీరిచ్చే జీతా లను హెచ్చుచేయించాలి; తిండికి చాలని జీతాలు

యిచ్చి, వారిని పీడిస్తే రెవిన్యూవుద్యోగు లీయగ చాల్లకు ఆగలేక, స్వయంగా పీలయినపుడల్లా అన్యాయపు ఆర్జన సాగిస్తారు. ఇది మన ప్రభుత్వ విధానానికి తీరని అపచారం, మన పరిపాలనకు అమోఘమయిన అవమానం అని వ్రాశాడు. అయితేనేమి, ఈ ప్రమాదకరమైన సాంఘిక దురవస్థకు వాడుకొందు కదా యీనాటికయినా విమోచన లేకపోవడమే రెవిన్యూ పరిపాలనా విధానంలోని లోపం.

ఆనాడు అమలులో ఉన్న రెవిన్యూవిధానం చాలా అసంతృప్తికరంగా ఉందన్న విషయం అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. రెవెన్యూ బోర్డు వర్తక సంఘసభ్యుల సంఘాలిక అనవసరం గనక వాటికి స్వస్తిచెప్పడం మంచిదని చెప్పింది. ఉత్తరసర్కారులను కలెక్టర్ల అధికారానికి అప్పగించడం నయం అంది. జమీందారులను, సిబ్బందీని హతమార్చి వారిని రెక్కలుకట్టిన పక్షులలాగా చేస్తేనేగాని, దేశంలో శాంతికి అవకాశమే లేదంది. వారిని తమతమ కోటలన్నిటినీ కాళీచేసి బ్రిటిషువారి అధీనంచేయాలని కోరాలంది. ఈకలెక్టర్లను నియమించినా, తమ అధికారానికి ఏవిధమయిన అడ్డంకులూ ఏర్పడవని కంపెనీకి తెలియజేయడం మంచిదని అంది.

క్రీ. శ. ౧౭౯౮ లో మదరాసు ప్రభుత్వం ఒక అధికారప్రకటన చేసింది. ప్రతిజిల్లాలోని జమీందారులూ, ప్రజలూ కొత్తగా తమ రెవెన్యూ విధానాలను పరిమాడడానికి వచ్చిన యీ కలెక్టర్లకు యావద్విషయాలనూ చెప్పవలసిందని అందులో ప్రకటించారు. జమీందారులూ, ప్రజలూ యిందుకు ఒప్పుకొన్నారు. ఈవిధానం క్రీ. శ. ౧౮౦౩ లో శాశ్వతపన్ను విధానం అమలుజరిగేదాకా సాగింది.

రాయలసీమమటుకు క్రీ. శ. ౧౮౦౦ లోనే కంపెనీప్రభుత్వాధికారంకిందికి చేరుకొంది. ఆనాటి రాయలసీమ ఆర్థిక రాజకీయ దురవస్థకు దేశ చరిత్రలోగాని, ప్రపంచచరిత్రలోగాని సాటి లేదని చరిత్రకారులన్నారు. అరాజకం అంత త్వరలో అంత మొందించగలమన్న విశ్వాసం కంపెనీ ప్రభుత్వానికైనా లేనేలేదు. బళ్లారి, గుత్తి, తాడిపత్రి, యాడికి, చిన్నపల్లి, రాయదుర్గం, కోడికొండ, పెనుకొండ, హరపనహళ్లి, కూడ్లిగి, ఆదోని, కడప మొదలయిన పరగణాలుగా దేశం అంతా చీలికలయివుంది. ఇందులో ౧౨ పరగణాలకు మన్రోనే స్వయంగా అధికారం వహించమన్నారు. తక్కిన పది చిన్న పరగణాలూ అతని అజమాయిషీలోనే ఉన్న విల్లియం థాకరీ,కోక్రేన్ (William Thackery,Cochrane) అనే యింకో యిద్దరు రెవెన్యూ ఉద్యోగుల అధీనంలో ఉంచబడినాయి.

సర్ థామస్ మన్రో యీ రాయలసీమకు సర్వాధిపత్యం ప్రభుత్వపు తొలికాలంలో వహించడం తప్పనిసరిఅయింది. అతను అధికారంలోకి రాగానే ప్రప్రథమంగా రెవిన్యూవిధానంలో రైతువారీ పద్ధతి నవలంబించి, రైతుల నందరినీ పిలిపించి, వారికి కౌలుకదపాలను వ్రాయించి యిప్పించినాడు. అక్కడ రాజ్యాధికారం వహించిన రోజుల్లో, అరాజకపు ఆందోళనలో, అధికారస్థానంలో మొలకెత్తిన పాళెగార్లు, గ్రామాధికారులు ఉత్తర సర్కారులలోని జమీందారులవంటి అధికారవర్గాలు. ఈరైతువారీ విధానాన్ని, ప్రభుత్వానికీ రైతుకూ యాదృచ్ఛికంగా ఏర్పడిన సన్నిహిత ప్రతిపత్తినీ ఏవగించుకొని తమ ప్రాధాన్యానికి అంతరాయం కలిగించి తమకు నాధారంచేసుకోకుండా, తమ కిదివరకే రైతుజనంమీద ఉన్న ఆధిపత్యాన్ని పోగొట్టి తమ నధఃకరించడమే కాకుండా రైతుల కిదివరకు పరిపాటిగాని ఒకవిధమయిన స్వాతంత్ర్యం యీ రెవెన్యూ పరిపాలనా విధానంతో ప్రారంభించడం యీ అధికారవర్గాల కెంతమాత్రం యిష్టంలేక కొత్తగా వచ్చిన రైతువారీ పన్నువిధానాన్ని ప్రతిఘటించడం ప్రారంభించారు. కాని మన్రోమటుకు యీ ప్రతికూలాందోళనను అతిదారుణమయిన అధికారప్రవర్తనతో అణగార్చినాడు. వారి కోటలను కూల్చి, ఎదురుతిరిగినవారిని బందీ చేయించి, అనేకవిధాల అవమానించడం జరిగింది.

రాయలసీమలోని రెవిన్యూవిధానంలో రైతువారీవిధానాన్ని అమలుజరపడానికి మన్రో చేసే యీ దురంత సాహసాన్ని ప్రభుత్వం తీవ్రంగా గర్హించింది. కాని యిదంతా ప్రభుత్వాధికారప్రతిష్ఠకోసం, శాశ్వతత్వం కోసమే చేశానని మన్రో సమాధానం చెప్పాడు. అదిగాక, తరువాత యీపరగణాలనుంచి వసూలుచేయబడిన రెవిన్యూవసూలుమొత్తాలే యీవిధానంలోని లాభదృష్టిని ప్రభుత్వాని కర్థంచేశాయి. ప్రజలు తిండి లేక మలమల మాడిపోవలసివచ్చినా, పంటలు పండక పోయినా, వర్షాలే లేక, యీతిబాధలే తటస్థించినా పన్నులు తగ్గిస్తే రైతులకు సేద్యంలో వుండే అభిమానం తగ్గిపోతుందని విచిత్రంగా వాదించిన రెవెన్యూ అధికారి మన్రో తరువాత యీ రైతువారీవిధానాన్ని గురించీ, దాన్ని ప్రాశస్త్యాన్నీ ఉగ్గడిస్తూ చెప్పిన కబుర్లు చూస్తే మన కాశ్చర్యం కలిగించకపోదు! అయితేనేమి, మన్రో రాయలసీమలో ప్రతిష్ఠాపనచేసిన యీ రైతువారీపన్నువిధానంవల్ల మన తెనుగురైతుల ఆర్థికోద్ధరణకోసం, వారి విమోచనకోసమే తాపత్రేయ పడినట్లుగా భావించే చరిత్రకారులుకూడా వున్నారు.

రెవిన్యూవిధానం సరిగా జరగాలంటే, మొత్తం భూమివైశాల్యం, అందులో రకరకాల భూముల పరిమితులు వగైరా జాబితా అవసరం గనుక మన్రో మొదట భూమిసర్వేవిధానం ఆరంభంచేయించాడు. ఈ సర్వేఫలితంగా మొత్తం సాగుఅవగలిగే భూమివిస్తీర్ణత, భూమిలో పండే పంటనుబట్టీ, చెల్లించే శిస్తునుబట్టీ ఏర్పడిన అంతరాలు, ఎంతవిత్తుకు ఏరకంభూమిలో ఎంత సాగుబడికి సావకాశం వుంటుంది, బంజరు భూములు ఎన్ని, పాడుపడిన బీడుభూములు ఎన్ని— యీవివరాలన్నీ యీసర్వేవల్ల స్పష్టీకరించాక పన్నుల సంగతి ఆలోచించడం ప్రారంభించారు. పంటలో ప్రభుత్వానికి రావలసిన భాగంయొక్క విలువను కొన్ని సంవత్సరాలనుంచి అమలులో వున్న ధరల అంచనా నాధారంచేసుకొని, ధనరూపేణా నిర్ణయించి చెల్లించవలసిన దన్నారు. ఎక్కువ పన్నులు యిచ్చుకోవలసిన బాధ్యతేగాని, యితర రెవెన్యూ వుద్యోగుల మోసాలకు ఆహుతికావలసిన అవసరంగాని లేకుండా, ఈ రైతువారీపద్ధతి నవలంబించిననాటినుండీ, భూమిలో అధికంగా ఉత్పత్తి అయ్యే ఫలసాయాన్నంతటినీ రైతే అనుభవింపగలిగే సావకాశం ప్రప్రథమంగా సృష్టించామన్నారు. అయితే యీ రైతువారీరెవెన్యూ విధానంలో ఒకసారి నిర్ణయింపబడిన పన్నులు, మార్పు లేకుండా, అలాగే వుండిపోలేదు. రైతుపరిస్థితులూ, భూమియొక్క సారం అభివృద్ధి అవుతూన్నకొద్దీ క్రమేణా పన్నులను హెచ్చుచేయడం రైతువారీవిధానంలో పరిపాటి. కాని యీ హెచ్చించడమటుకు మితిమీరికాకుండా, కొన్ని హద్దులలోనే ఆపబడుతుందని ప్రభుత్వం ప్రకటించారు.

ఈ రైతువారీ విధానంప్రకారం ఏ యేటా కోత కాలంముందు కలెక్టర్లూ, అతని వుద్యోగులూ గ్రామాలకు పోయి, రైతులనందరినీ ఒకచోటికి పిలిపించి, పండిన పంటప్రకారం పన్నులునిర్ణయించడం వారివిధి. పంటనుగురించిన భోగట్టా మొదట అయిన తరువాత, అప్పుడు ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తాన్నిగురించిన నిర్ణయం జరగాలి. పంటలు బాగా పండి ఏవిధమైన క్షామకారణాలూ లేకపోతే, యథాప్రకారం సర్వే కొలతల ననుసరించి, నిర్ణయింపబడిన రేటుప్రకారమే వారు పన్ను చెల్లించవలసివుంటుంది. అలా కాక, యీతిబాధ లేమయినా వుండి, వర్షాలు పోయిగాని, పంటలు పోయిగాని, యితరకారణాలవల్లగాని రైతు పరిస్థితులు పాడుగా వుంటే పన్ను కొంత తగ్గించికట్టడానికి సావకాశమేకాకుండా రైతు విత్తనాలు, యితర వ్యవసాయసామగ్రులూ కొనుక్కోడానికి తగిన ధనం బాకీయివ్వడానికి సాయం జరిగేది. ఈ రకమయిన అప్పులనే తకావీ అనడం మామూలు.

ఈ రైతువారీపద్ధతిని పన్నులు నిర్ణయించడం ప్రారంభం అయినప్పటినుంచీ "రైతుకు తను పొలంలో నాగలితో దున్నకముందే, విత్తులు చల్లకమునుపే,

తను భవిష్యత్తులో ప్రభుత్వానికివ్వవలసిన పన్ను విషయం పూర్తిగా తేలిక అయినదన్న విషయం తెలుసును గనుక, భూమిలో ఫలసాయం అభివృద్ధిపొంది అధికంగా లాభాలువచ్చినా, ప్రభుత్వంకూడా వాటా కావాలని అంటుం దన్న భయం పోయింది. అతని పట్టాలో అతని భూమివివరాలే కాకుండా, యివ్వవలసిన పన్నుకూడా స్పష్టీకరింపబడడంవల్ల గ్రామాధికారులు అదనంగా వసూలుచేయడానికి ప్రయత్నిస్తే, ఆందోళన చేసి ప్రభుత్వానికి యీ అన్యాయాన్ని తెలియజేసుకోడానికి తగిన సావకాశా లున్నాయి. ఆ విధంగా రైతుయొక్క హక్కులను భద్రంగా కాపాడడమేకాకుండా, అవసరమయితే ప్రభుత్వం యింకో చోట అప్పుతెచ్చుకోవలసిన అవసరం లేకుండా, రైతులనే పన్నులను ఎక్కువకట్టమని అడగవచ్చు; యీ పన్ను శాశ్వతంగా స్థిరపరచకపోవడంలో వున్న సులువే యిది" అని రాయలసీమలో ప్రవేశపెట్టిన రైతువారీ విధానాన్ని గురించి మాట్లాడుతూ మన్రో అన్నాడు.

సిద్ధాంతరీత్యా యింత ఆనందకరమయిన రెవెన్యూ విధానమునే మన్రో రాయలసీమలో అమలు జరిపించాలని ఆరంభించినా ఆ నాటి రాయలసీమ పరిస్థితులు హృదయవిదారకమ్మయిన పంథాలో నడిచాయి. క్రీ. శ. ౧౮౦౧-౧౮౦౩ లలో వర్షాలే లేక పంటలు పోయి, దేశం అంతా దుర్భిక్షంతో వేగిపోయింది. మన్రో అంతటివాడే యీ దురవస్థను, యీ అవాంతరానికి మార్గం అన్వేషించడానికి అవకాశాలు లేక అలమటించిపోయాడు. ఎంతో కాలం పట్టలేదు. ఒక్కసారిగా విపరీతమయిన కరువు, కాటకం ప్రబలిపోయింది; ప్రజలు యీగల్లా చనిపోయారు. ఆహార పదార్థాలు- బియ్యం, ధాన్యం, జొన్నలు యిదివరకు ధరలకు నాటికి మూడువందలరెట్లు, నాలుగువందల రెట్లు పెరిగిపోయినాయి. ప్రజలు గుంపులుగుంపులుగా హైదరాబాదు, మైసూరు సంస్థానాలకు వలసపోయారు. మన్రో యీ పరిస్థితులలో తా నీ వుపద్రవాన్ని ఆణచి ప్రజల కేవిధంగానయినా తిండి దొరకగలిగే సావకాశా లుంటే బాగుండునని ఆలోచించి, దక్షిణ దేశంలోని ధాన్యం, బియ్యం తుంగభద్రనుంచి బయటికి ఎగుమతికాకుండా ఆపాలని ఆజ్ఞాపించాడు. రాయలసీమలోకి దిగుమతి అయ్యే తినుబడి పదార్థాల మీద విధించే వర్తకసుంకాలను రద్దుచేయించాడు; ప్రభుత్వానికి రెవిన్యూవిధానం సులభంగానే వుందని అనుకొని ప్రవేశపెట్టినా పంటలే లేకపోవడంవల్ల, పన్నులు వచ్చే మార్గం కనబడకపోవడమే కాకుండా ప్రజలను పోషించి, వారికి ధనసాయం చేసి మళ్లా భూముల సాగుబడికి పంపిస్తే మళ్లీ ఏదయినా యీ బకాయిలుకూడా తీర్చగలుగుతారేమోనన్న ఆశ, ఆందోళన ఆరంభమయినాయి. ఇది రాయలసీమలోని కంపెనీప్రభుత్వపు తొలిరెవెన్యూపరిపాలనారంభంలోని ఆర్థికదురవస్థ. ఇక సర్కారుప్రాంతాల విషయం గమనించిన తరువాత ఎన్ని మార్పులు వచ్చినా, అక్కడ క్షామం లేదుగనుక, ప్రజలు ఏదోవిధంగా తట్టుకోగలిగారని కొంతమంది ఆర్థికవేత్త లన్నారు.

కాని, నిష్పాక్షికపుదృష్టితో యీ రెండు దేశభాగాలలోను కంపెనీ ప్రభుత్వపు రెవెన్యూవిధానాలను సాకల్యంగా పరిశీలిస్తే, యీ కరువుల కారణంచేతనే కాకుండా తరువాతయినా, యీ నాడు ప్రాతిపదికంగా ఏర్పరిచిన రైతువారీవిధానం తీరని అపచారమే చేసిందని తరువాతి రెవెన్యూచరిత్రవల్ల మన కనిపించకపోదు. ఇక సర్కారులలో పరిస్థితులను పరీక్షిస్తూ, అక్కడి శాశ్వత పన్నువిధానం అమలులోకి రాగానే సంక్రమించిన యమయాతనమాట అటుంచి, పోనీ యింతవరకయినా సక్రమమయిన రెవెన్యూ పరిపాలనావిధానాల విషయం ఏమయినా ఆలోచించారా అని అంటే, అక్కడ మాత్రం ఏమి సంతోషకరమయిన మార్గాలను రెవెన్యూపరిపాలన సాగింది. క్రీ. శ. ౧౭౬౬ నుంచి క్రీ. శ. ౧౮౦౩ దాకా ఒకే విధమయిన రెవెన్యూ విధానం లేకుండానే, అనేకసార్లు ఒకమారు కంపెనీ అధికారులకు లాభకరంగా వుండే

లాగ, ఒకసారి కంపెనీ వుద్యోగుల పారితోషికాలకు, ప్రయివేటు ఆస్తిసంపాదనలకు అవకాశా లుండేలాగ, ఒకసారి యింటివద్ద ప్రభుత్వం నియమించిన పెద్దల అభిప్రాయానుసారంగానూ, యింకోసారి రెవిన్యూ బోర్డు యిష్టప్రకారం మార్పులు జరుగుతూ మెకాలే అన్నట్టు 'ప్రజలను తలితండ్రులలాగ చూడండి; కాని మాకు డబ్బు కొంచెం ఎక్కువ పంపుతూవుండండి. ప్రజలమీద సానుభూతి కలిగి వారి కష్టసుఖాలను పంచుకోండి; కాని మాకు యింకా కొంత డబ్బు ఎక్కువగా వసూలుచేసి పంపండి. పాల ముంచినా, నీట ముంచినా మీదే భారం. పాలలో ముంచినా, నీటిలో కూడా మునగనివ్వండి' అన్నవిధానంగా ఆంధ్రదేశంలో కంపెనీ ప్రభుత్వపు తొలిరెవిన్యూ పరిపాలన క్రీ. శ. ౧౮౦౩ దాకా రకరకాలుగా మారుతూ వచ్చింది.



జాతకసోదరులు

❀

— శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు —

కొన్నాళ్లమునుపు నా ఆప్తమిత్రులలో నొక యుత్తమ శ్లోకుఁ డొనరించుచుండిన శాంతిక్రతువును చూచి ఆనందించు భాగ్య మబ్బుటచే నేనపు డొక గ్రామాంతర మునం దుంటిని. పారాయణములు, హరికథలు, పురాణ ప్రసంగములు, ఉపన్యాసములు, తత్త్వవిచారములు, కావ్య చర్చలు, సంగీతగోష్ఠులు మున్నగు రూపములతో నిరంతర ము "రామో రామో రామఇతి" అనురీతి శ్రీరామకథ కర్ణ రసాయనముగా నచట వినవచ్చుచుండెడిది. వేదవేదాంగ పారంగతులగు శ్రోత్రియశేఖరులు, తర్కవేదాంత తంత్ర వ్యాకరణాదిశాస్త్రములలో పేరుగాంచిన పండితప్రకాండులు, సంగీతసాహిత్యకవిత్వకళలలో నారితేరిన రసికవతంసులు, పురాణప్రబంధ హరికథా కాలక్షేప దక్షులగు భాగవతోత్తములు, సనాతనాచార ధర్మకర్మనిష్ఠాతులగు పరమైకాంతి పుంగవులు మొదలుగా ననేకులు పాల్గొనుచుండిన ఆ యాగము కన్నులపండువు సేయుటేకాక మనస్సులనయితము తనుపుచుండెను. జన్మము సార్థక మయ్యెనని తలఁచితిని.

ఆ సమావేశమునకు వచ్చినవారిలో నొక వ్యక్తి పలుపురి దృష్టి నాకర్షింపఁజాలినది. ఛాందసతేజఃపుంజ ముట్టిపడు ముఖకాంతి, బారెడుదూరమునుండియే పిశాచోచ్చాటనము సేయఁజాలిన ద్వాదశోర్ధ్వపుండ్రరేఖలు, నిక్కబొడుచుకొని నిలువున నాట్యమాడు పిల్లజుట్టు, మొలనుండి మోకాళ్లదాఁక దుర్భేద్యమగు పద్మవ్యూహమును పన్నిన పంచకచ్చల పింజకట్టుకలిగిన సచ్ఛ్రోత్రియపరమైకాంతి యతఁడు. ప్రాపంచికవాసనల కతీతమై ఋష్యశృంగుని యవతారమనఁదగినట్టిది అతని అమాయికప్రవర్తనము. అంగవస్త్రంపు మడుపు నుత్తమాంగమునకుఁ జుట్టి, నివీతంపు త్రాళ్ల పవిత్రమైన దక్షిణకర్ణమున వ్రేలవైచి, వివిక్తప్రదేశమున నిలుచుకొని, మడుగుసిల్కావిధోవతికి జేనెఁడు వెడల్పున కుచ్చెళ్లు పట్టిపట్టి పింజలు పోసి, మొలలో చెక్కి రెండు చేతులతో నొక్కొక్కటిగా పింజముడుపులను విడదీసి తీడితీడి, విన్నాణముగా సవరించు యోగముద్రలో మగ్నుఁడై, సూర్యభగవానుఁడు పశ్చిమాశను చేరినది సయితము గమనించక తదేకనిష్ఠతో నున్న ఆ యోగిపుంగవుని వైఖరి కనులార చూచితీరవలెను. ఒక్కొక్కప్పుడు పట్టిన ముక్కు పట్టి, చెప్పిన పదమే పదిమార్లు చెప్పి, చేసిన ఆచమనమే మరలమరల చెంబులోని నీరు ముగియుదాఁక చేయుచున్న పద్ధతిని చూచినవారికి అతని ప్రాతస్సంధ్య సాయంసంధ్యతో సాయుజ్యము బొందునని తోఁచకమానదు. భోజనావసరమున విస్తరిముందు కూర్చుండి, పంక్తిలో నూరారు మంది భాగవతులు ఆఁకటి యాత్రముతో కాచుకొనియుండుట సయితము గమనించక, పదినిమిషములయినా పరిషేచనపు చుట్లు చుట్టుచు, అభినయపూర్వకముగ పరబ్రహ్మార్పణము చేయు కార్యమున తక్కు ప్రపంచమును మరచి తన్మయుఁడైయుండు నా మహనీయుని జూచువారికి ఆ నాఁడు నవ్వులతోనే కడుపు నిండఁగలదు. ఆంధ్రకవితాపితామహుఁడు ప్రవరుని నోట అనిపించిన "బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్." అను వర్ణనమునకు చక్కని దృష్టాంత మయ్యెనని నవనాగరకు లనుకొనుట కవకాశ మిచ్చుచుండెడిది అతని యమాయికనైష్ఠికచర్య. సరివారు కన్నుగీటుచు నాడు ఛలోక్తులకు, నవనాగరకులు వ్రేలుచూపి చేయు నవ్వులాటలకు, బాలురు ప్రదర్శించు వెక్కిరింపుల వేళాకోళములకు, పూర్వసువాసినులు కావించు ముసిముసినగవుల మూతివిరుపులకు చలించని ఆ మహనీయుని నిత్యకర్మానుష్ఠాన ధోరణి వాస్తవముగ మెచ్చుకోఁదగినది.

ఒకనాఁ డామహాశయుఁడు నాకడకు వచ్చి తన ద్వితీయపుత్రుని కెవరో కన్యక నిచ్చుటకై పెత్తనము వచ్చినారని చెప్పి, కన్యావరులకు నక్షత్రానుకూల్య మున్నదేమో

పరిశీలించవలె నని కోరెను. ఆకన్యావరుల జాతకములను గుణించి చూడఁగా, పొంతనములలో గుణములు చాలినన్ని రాకుండుటే కాక, పరస్పర గ్రహదృష్టియోగములయినా వైవాహికజీవితమున కనుకూలించునవి కానరాలేదు. ఆకన్యావరులకు వివాహము జరుపుట శ్రేయస్కరము కాదని నా యభిప్రాయ మతనికి సూచించితిని.

"కన్యకకు సౌమంగల్యయోగము లేదా?" అని అతఁడు ప్రశ్నించెను. బాగున్నదని చెప్పితిని.

"ఇంకేమి బాధ?" అని అతని ప్రశ్న.

వివాహమునకై తగిన కన్యకను వెదకువారిలో నూటికి తొంబది వంతులు—జ్యోతిషశాస్త్రములో శ్రద్ధ కల దనుకొను వారే—నేఁటి కాలములో సర్వసాధారణముగా వేయు ప్రశ్న యిది. అనఁగా, ప్రశంసలో నున్న కన్యకను పరిణయ మాడిన తరువాత వరుఁడు చిరంజీవిగా జీవించఁగలఁడా అని. ఈవిషయము గమనింపనక్కరలేదని నా ఆశయము కాదు. కాని, ఈయోగ మొక్కటి యున్న దను కారణమున మాత్రమే తృప్తిపడి మనువులను నిర్ధరించుట అన్యాయమని నా మనవి. వైవాహికజీవితమున ముఖ్యముగా గణింపఁదగిన భక్తి, రక్తి, అనుకూల్యము పరస్పరముగ వధూవరుల కుండునా లేదా అని గమనించనినాఁడు పసుపుపూఁత, కుంకుమబొట్టు భద్రముగా నుండిననేమి, జీవితము భారమై, క్లేశభూయిష్ఠమై మరణమే మేలనిపించదా? దాంపత్యజీవితమున పురుషార్థములలో ధర్మార్థకామములు సిద్ధించనినాఁడు, నిరర్థకమైన నూరేండ్ల సౌమంగల్యయోగము గల సువాసినికి మోక్షము - అనఁగా, కపాలమోక్షము — స్పృహణీయ మగునుగదా?

"ఉరు ముండదె నూరేండ్లును,
పడియుండదె పుడమి పాము పదినూరేండ్లున్,
మడువున కొక్కెర యుండదె,
కడునిల పురుషార్థపరుఁడు కావలె సుమతీ."

అనుట భద్రభూపాలుని నీతివాక్యము.

అన్యోన్యహృదయముల నర్థము చేసికొనుటకు వలయు సహృదయత్వము చూపని, పరస్పరముగ అనుకూల్యముతో జీవించు పద్ధతుల నలవరచుకొను నేర్పు నీయని, ఒకరిపై నొకరికి భక్తిరక్తులు కుదురు నవకాశము కలిగించని జాతకయోగము లుండు కన్యావరులను, సౌమంగల్యయోగము కన్యకు, దీర్ఘాయుర్యోగము వరునకు కల దనుకారణమున ముడివేయుటకన్న ఘోరపాతకము వేరొండు కానరాదు. కాని, వయోధర్మము ననుసరించి తమకువలె తరుణీమణులకునయితము ఆశలు, ఆదర్శములు, అభిరుచులు ఉండుట సహజ మనుకొను వివేకము ఇప్పటి సాంఘిక పరిస్థితులలో అనేకులకు రాకుండుట శోచనీయమగు విషయము. తమ పరిచర్యకై భగవంతుఁడు సృజించి తమ కర్పించిన పరిచారికలు స్త్రీ లను జ్ఞానము ప్రాచీన సంప్రదాయపు పరమే కాంతుల కున్నది. తమ విలాసవిహారములకు పనికివచ్చుటకై ప్రకృతిమాత నిర్మించి సమర్పించిన క్రీడాపరికరములు తరుణీమణు లను భావము ఆధునిక నవనాగరిక విజ్ఞానసంపన్నులకు వచ్చినది. పురుషులనుగూర్చి స్త్రీలకునయితము ఏవో ఇట్టివే కొన్ని అభిప్రాయము లుండకపో వను వివేకము పలువురకు కానరాదు. కాననే ప్రకృతకాలమున వివాహము లనేకములు ఉట్టినిగాని, స్వర్గమునుగాని ముట్టలేకున్నవి.

వసంతాదేవికాఁబోలు, ఏదో యొక గ్రంథములో మన వివాహములను గూర్చి యిట్లు వ్రాసినది—

"Some of our matches are but safty matches which can ignite at the slightest rub."

[మన వివాహములలో కొన్ని అగ్గిపుల్లలవంటివి. ఏ కొంచెము ఘర్షణ కలిగినా, అవి భగ్గుమనును.]


ఎంత చక్కని ప్రపంచానుభవమో ఆమెది!

జాతకపద్ధతుల ననుసరించి దాంపత్యానుకూల్యము విషయమున నాయూహలను కొన్నింటిని నే నామహాశయునికి నివేదించితిని. ఫలము నాకే తృప్తికరముగ నుండలేదు. చెప్పినంతదూరము చెప్పి చాలించుకొని, "వీరి దాంపత్యము బాగుండదు. కారణములు చర్చించుట అనవసరము." అని ఆప్రసంగమును ముగించితిని. కాని, నామిత్రుఁ డంతటితో నన్ను వదలునట్లు కానరాలేదు.

"ఏవరునితో వివాహము జరిగినా, ఈకన్యక అదృష్ట మింతేనా?" అని యతఁడు మరల నెమ్మదిగా ప్రశ్నించెను.

"అట్లు కాదు. కన్యక జాతకమున దోషము లేదు. వేరు వరునితో గ్రహయోగములు సరిపడినచో, వివాహము సుఖకరముగా నుండఁగలదు." అంటిని.

"తమకు తొందర ఇచ్చుచున్నాను. క్షమించవలెను." అని చెప్పుచు మెల్లగ వేరొక వరుని జాతక మిది యని చెప్పి యొక రాశికుండలిని నాచేతి కిచ్చి ఆ కన్యకతో అనుకూల్య మెట్లుండునో చూచిచెప్పుమని ప్రార్థించెను. అతఁ డిచ్చిన కుండలి యిది:



వాస్తవస్థితిలో నా కీకేవలరాశికుండలినుండి యేమియు బోధపడదు. జన్మదినము, జన్మకాలము మున్నగు వివరములను తెలుసుకొని సాయనస్పష్టగ్రహభావములను తెలుపు కుండలిని సిద్ధముచేసుకొంటిని. ఈ వరుఁడు జనించుట 30-9-1895 వ దినమున;

వరునికి ఏఁబదిసంవత్సరముల ప్రాయము నిండు చున్నది. కన్యక 12 సంవత్సరముల పాలప్రాయముతో ఆతనికి మనుమరాలు కాఁదగిన వయస్సులో నున్నది. ఈ జాతక మెవ్వరిదో, ఇంతవయస్సు చెల్లి ఇపు డీవివాహ మేలనో తెలుసుకొనఁగోరి వివరముల నడిగితిని. ప్రతిచెప్పుటకు సంకోచించినట్లుగా నతని ముఖవైఖరి చూపట్టినది. కొంతతడవు నిశ్శబ్దముగ నుండి, ముఖమున నేమేమో వికారములు పొడగట్టఁగా నా మహాశయుఁడు "అనుకూల్యము సరిపోయినచో అంతా విజ్ఞాపనచేయుదును." అనియెను.

ఇదేమి చిదంబరరహస్యమో. నా కేల యీ అధిక ప్రసంగ మనుకొంటిని. పొంతనములు చూడఁగా, 28 గుణములు వచ్చినవి. గ్రహయోగాదులు పరిశీలించఁగా, ఏదో కించిత్తుగా అనుకూల్యము చూపట్టినది. వయస్తారతమ్యము నకు తగినంతమాత్రము అనుకూల్యము రావచ్చునని నా యభి ప్రాయమును సూచించితిని. ఏఁబదియేండ్ల వరునికి పండ్రెండేండ్ల వధువుతో ఏటి అనుకూల్యము?

నామిత్రుని ముఖమున వికాసము కానవచ్చెను. కాతరదృష్టులతో నతఁ డొకమారు చుట్టును చూచి, ఇతరు లెవరును లేకుండుటను గమనించి, సవినయముగ, "ఈ — ఈ — జాతకము దా - దాసునిదే." అని సంప్రదాయ శుద్ధముగా జారఁబలికెను.

జ్యేష్ఠపుత్రుఁ డింటిలో భార్యతో కాపురముచేయు చున్నాఁడు. కళత్ర మెప్పుడు వచ్చునో యని మధ్యముఁ డాత్రముతో ఎదురుచూచుచున్నాఁడు. ఇంతలో పెండ్లి కెదుగనున్నాఁడు కనిష్ఠపుత్రుఁడు. ముగ్గురు కూఁతుండ్రు ముచ్చట లున్నవి, సంసారభారమును నిర్వహించు శక్తి కలిగి గృహిణి యింట నున్నది. ఇపు డీవయస్సున మరల వివాహమా? రామరామ! కుమారునికి చేసుకోఁదగిన కన్యక నా తండ్రి తానే వివాహమాడఁగోరుట! ఈ ద్వాదశోర్ధ్వ పుండ్రముల పరమైకాంతిలక్షణమేమి, ఈ "విషాదసారంగధరనాటక"మును సంసారరంగమున ప్రదర్శించు కుతూహలమేమి?

"తలలు బోడులైన తలఁపులు బోడులా
విశ్వదాభిరామ వినర వేమ."

అను వేమనసూక్తి స్ఫురణకువచ్చినది. నాహృదయాంతరాళమున జనించిన అసహ్యభావము నాముఖమున దాఁగినది కాదు. ఇది కనిపెట్టి ఆతఁడు—

"ఇంటిలో ఆఁడుదాని కారోగ్యము లేదు. ఖాళీ అయినా కాలేదు. సౌమంగల్యయోగము బాగున్న దంటిరి కనుక, ఈకన్యక పనికివచ్చును గదా అనుకొన్నాను." అని సమాధానమిచ్చుట కారంభించెను.

ఏదో పరధ్యానములో నుండి "ఎవ్వరికో?" అంటిని.

అంతలో నెవరో పిలువఁగా త్వరలో వత్తునని యా శ్రోత్రియుఁడు వెడలిపోయినాఁడు. నాకేమో కష్టమనిపించినది.

ఏమి యీ జాతకమందలి వైచిత్ర్య మని నాలో నేను గమనించుచుండఁగా, ఆ సమావేశమునకు వచ్చినవారిలో జాతకశాస్త్రముపై నభిమానము గల నా మిత్రుఁ డొక న్యాయవాది నాకడకు వచ్చి—

"ఎవరిది జాతకము?" అని యడిగెను.

"ఒక మహాపురుషునిది." అంటిని. నా శ్రోత్రియ మిత్రుఁ డిచ్చిన కేవల రాశికుండలి నా సమీపమున నుండఁగా, ఆ న్యాయవాది దానిని గమనించిచూచి—

"ఏమి? నా జాతకమే చూచుచున్నారే?" అని ఆశ్చర్య మగుపరచెను. నేను భ్రాంతుఁడ నైతిని.

క్షణకాలము విమర్శింపఁగా నా మిత్రుని మాట యథార్థముగ కానవచ్చినది. మామూలుపద్ధతిచొప్పున కేవల రాశికుండలిని తయారుచేసినచో, ఆ న్యాయవాది జాతకమునకు, ఆ పరమేకాంతిజాతకమునకు ఏమాత్రమైనా భేదముండదు. లగ్నము, ఆధిపత్యము, గ్రహస్థితి, దృష్టి ఇత్యాదులన్నియు రెండింటికి సమానముగా నుండును. కాని, ఆ వ్యక్తుల గుణములలో, నడవడిలో, ధర్మములలో, ఆదర్శములలో హస్తిమశకాంతరతారతమ్య మున్నది. కేవల రాశికుండలిపద్ధతి అసంబద్ధ మనుట కిది చక్కని దృష్టాంత మగుటచే పాఠకమహాశయుల కిది యర్పించుట బాగని తలంచితిని,

ఈ జాతకసోదరులలో ప్రథముఁడు రాత్రి 10-38 గంటలకు జనించెను. ద్వితీయుఁడు ఆ రాత్రియే 11-38 గంటలకు పుట్టుట. ఒక గంటకాలమే అంతరము. ఈ క్రింద నున్నదే మా శ్రోత్రియమిత్రుని నిరయనజాతకకుండలి:—

		ఇ 25-42	ల 3-48
X 24-8 రా 19-3 చ 9-51	(నిరయనము)		న 12-9
			శే 19-3 శు 27-40
		బు 10-30 శ 13-48 వ 23-28	ర 14-56 కు 18-22

న్యాయవాదిమిత్రుని లగ్నము మిథునరాశిలో 16°-11' అగును. చంద్రుఁడు కుంభరాశిలో 10°-21' లో నుండును. వేరేమియు భేదముండదు. లగ్నము రమారమి 14 భాగలు జరిగినది. చంద్రుఁడు అర్ధభాగమాత్రము ముందుకు నడచినాఁడు. శతభిషానక్షత్రమే ఇరువురిది. ప్రథమునిది మొదటిపాదపు కొన: ద్వితీయునిది రెండవ పాదపు మొదలు. సర్వసాధారణముగా చూచు ఉడుదశలో ఇరువురికీ రాహుదశయే. జన్మకాలమున దశాశేషమిది:—

		ది	మా	సం
శ్రోత్రియునికి	....	13	8	13
న్యాయవాదికి	....	22	6	13

ఇఁక, ఒకరి లగ్నము తులాంశ కాఁగా, రెండవ యాతని లగ్నము కుంభాంశలో నున్నది. చంద్రుఁడు కుంభరాశిలో ధనురంశలో నొకరికి, మకరాంశలో మఱియొకరికి రాఁగలఁడు. నవాంశకుండలిలో నయితము వేరువ్యత్యాసము కానరాదు.

కాని, వీరి జీవితములు చాల భిన్నములయినవి. రాత్రికి పగటికి నున్నంత తారతమ్యము వాని కున్నది. స్థాలీపులాకన్యాయమున ముఖ్యమగు విషయములు కొన్ని మాత్రము వివరింతును.

వేదవిద్య నభ్యసించిన పరమఛాందసుఁడు నా శ్రోత్రియ మిత్రుఁడు; ఆంగ్లవిద్య నేర్చిన నాగరకుఁడు నా న్యాయవాది మిత్రుఁడు. వైదికవృత్తి నాశ్రయించి శరీరయాత్ర నడపుచున్న సాత్త్వికుఁడు ప్రథముఁడు; న్యాయవాదివృత్తి నవలంబించి కుటుంబపోషణము చేయుచున్న సాధుశీలుఁడు ద్వితీయుఁడు. సంధ్యావందనమైనా చక్కఁగ రాని పంద్రెండు సంవత్సరాల పసితనమున బొమ్మపెండ్లివంటి వివాహపు ముచ్చటను రుచిచూచినవాఁ డొకఁడు; ఇరువదిరెండేండ్ల యుక్తవయస్సున విద్యాభ్యాసానంతరము వివాహమాడిన గృహస్థుఁడు మఱియొకఁడు. ఇరువదినాల్గవయేఁట పితృమారకము సిద్ధించిన దొకరికి; సర్వతంత్రస్వతంత్రుఁడై "సహస్ర" చంద్రదర్శనశాంతి కెదురుచూచుచున్న సమర్థుఁడగు జనకుని సేవించు భాగ్య మబ్బినది మఱియొకరికి. ఇరువదియేడవ యేఁట నొకఁడు మాతను గోలుపోఁగా, రెండవ యతని కాక్లేశము రెండేండ్లకుపూర్వమే వచ్చినది. పనులలో "చాదస్త" మొకనిది; "చకచక" మఱియొకనిది.

వెదకిచూచినచో వీరి జీవితములలో ఏవో కొన్ని పోలికలు కానవచ్చును. కలిగిన కొడుకులు, కూఁతుండ్రసంఖ్య ఇరువురికి సమానమే. భార్య కనారోగ్య మను కారణమున నడివయస్సులో వీరిరువురికిని దాంపత్యజీవితమున సుఖము లేని కొఱఁతయే: గ్రహచేష్టయో, పిశాచావేశమో, రోగ లక్షణమో తెలియక విసికి ముఖహానికి చింతించి, "ఇల్లు ఖాళీ అయినా కాలేదే?" అని దుఃఖించుచున్నాఁడు మావేదాంతి. ఏ వైద్యునికి చూపినా ఏరోగమో తెలియకపోఁగా, ఏ మందులతోకాని గుణము కానరానందున, భగవంతునిమీఁదనే భారముపైచి భార్యను బ్రతికించుకొని కృతార్థుఁడై ఆనందించుచున్నాఁడు మా న్యాయవాది. ప్రాఁతభార్యను ప్రక్కకు త్రోసి వసువుచీరనవోఢ నొకదానిని సంపాదించుకొని దాంపత్యజీవితపు నూతన రుచులతోటి శృంగారరస మనుభవించుట కువ్విళ్లూరుచున్న రసికశిఖామణి ప్రథముఁడు. ఏండ్లకొలఁది పత్ని కనారోగ్య మగుటచే అలవరచుకొన్న నిర్బంధబ్రహ్మచర్య వ్రతమువలన మరచిపోయియుండిన దాంపత్యజీవితాశ మరల రేకెత్తిన శీలవంతుఁడు ద్వితీయుఁడు. నలువదినాల్గు సంవత్సరముల వయస్సున వీరిరువురికిని సంతానవిషయకమగు మనఃఖేదము కలిగినది. కాని దాని స్వరూపములో చాల తారతమ్య మున్నది. కుమారులలో నొకనికి మానసికవ్యాధి ఆకస్మికముగ సంభవించి కొంత కాలము బాధించుటచే, న్యాయవాదిమిత్రుఁడు చాల నొప్పి పడినాఁడు; అఁడుబిడ్డను అల్లుఁడు పరిత్యజించి రెండవ భార్యను సంపాదించుకొనుటచే శ్రోత్రియమిత్రునికి పెక్కు చిక్కులు దాపరించినవి. గ్రహచార మీవిధముగా వీరి జీవితములలో భిన్నమార్గములలో ప్రసరించినది.

X 16-30 రా 11-25 చ 2-13			ఇ 18-4 I 25-10
	(సాయనము) పరమేకాంతి		
	(మిథునలగ్నము)		న 4-31
	బు 2-52 శ 6-10 వ 17-45	ర 7-18 కు 10-44	శే 11-25. కు 20-2 (వ)

రా 11-25 చ 2-43	X 3-29		ఇ 18-4
	(సాయనము) న్యాయవాది		I 8-33
	(కర్కాటక లగ్నము)		న 4-31
	బు 2-55 శ 6-10 వ 17-45	ర 7-20 కు 10-45	శే 11-25 కే 20-3(వ)

సాయనపద్ధతి ననుసరించి వీరి జాతకకుండలు లిట్లుండును.

ఈ యిరువురి జీవితములలోఁ గల భేదమును సాయన గ్రహభావము లెట్లు స్పష్టపరచుచున్నవో చూతము. గ్రంథ విస్తరభీతిచే, ముఖ్యముగ కళత్రభావము నొకదానిని మాత్రము పరిశీలింతముగాక.

మిథునలగ్నజాతకునికి లగ్నాధిపతి బుధుఁడు, సప్తమాధిపతి బృహస్పతి. శనిసంయోగముచే స్తబ్ధుఁడై లగ్నాధిపతి (బుధుఁడు) సంకుచితదృష్టిని సంపాదించుకొన్నాఁడు. స్తుతిపాత్రములుకాని గుణము లనేకము లిట్టి బుధుఁడు సూచించునఁట. ఈ బుధునితో కళత్రాధిపతియగు బృహస్పతి కేంద్రప్రాతికూల్యదృష్టిలో నున్నాఁడు. గురుబుధులకు వైరము దృష్టిలో నున్న చోట విద్యాబుద్ధులకు కొదవ లేదు కాని, వివేకము మట్టమని పాశ్చాత్యు లందురు. ఇట్టి గుణ ధర్మములు కల బుధుఁడు (లగ్నాధిపతి) గురువును (కళత్రాధిపతిని) ద్వేషించుచున్నాఁడు. కుజశనులవంటి క్రూర గ్రహముల కిట్టి యాధిపత్యములో విషమదృష్టి వచ్చియుండెనేని, సంసారము రచ్చకెక్కియుండెడిది. కాని, బుధగురువు లిరువురు సౌమ్యులుకదా? ఇల్లాలు జీవించి ఇంట నుండఁగా, ఇల్లు ఖాళీఅయినా కాలేదే యని చింతించుచున్నాఁడు జాతకుఁడు.

కళత్రకారకుఁ డగు శుక్రుఁడు లగ్నమందలి ఇంద్ర గ్రహముతో కేంద్రప్రాతికూల్యదృష్టి నందుచున్నాఁడు. కళ

త్రమునుండి సుఖము లేదను భావము — భావమో, భ్రాంతియో— జాతకునికి వచ్చినది. మానసికవ్యాధియో, అనారోగ్యమో కారణమని అతనికి తోఁచవచ్చును. శుక్రునిపై శనికిఁ గల అర్ధకేంద్రదృష్టి ఈ ఊహ కవకాశమిచ్చు చున్నది. సంతాన (పంచమ) స్థానమున రవికుజు లున్నారు. వారిలో కుజుఁడు రోగస్థానాధిపతి. సంతానము మూలముగ నేవో కొన్ని క్లేశములు జీవితమున రావచ్చును. విషయసుఖస్థాన మగుటచే, తత్సంబంధమగు అనారోగ్యము నయినా ఇది సూచింపవచ్చును. భర్తజాతకమం దున్న యీధర్మముల వలని ఫలములో భార్యకు సయితము కొంత భాగము రాకతప్పదుకదా? ఆ కారణమున కల్గిన మానసిక క్లేశము కళత్రమునం దనారోగ్యముగా జాతకునికి చూపట్ట వచ్చును. ఇంద్రవేధితుఁ డగు శుక్రునికిని, లగ్నాధిపతియగు బుధునికిని సరిసరుమ కుజుఁ డుండుట గమనించితిమేని, ఇట్టి యూహ తప్పని లేదు. మఱియు, శుక్రుఁడు నీచపడి నాల్గవయింట నున్నాఁడు. ఇంటనున్న గృహిణి కొరకాదను విపరీతపు బుద్ధి జాతకునికి కలిగినది. సుఖము లేదే యని జాతకుఁడు తహతహపడుచున్నాఁడు. సంపాదించుకోవలె నని ప్రయత్నము:

1945- వ సంవత్సరమునకు దేవమానదశాపద్ధతి ననుసరించి చలితశుక్రుఁడు తులారాశిలో (విషయసుఖ స్థానములో) నున్న జన్మకుజునిపై అవాహనమైనాఁడు. "నన్యాస్తి పుంభిశశిరో మదన స్పృహాయః" అనిపించు దశ యిది. ఈదశ వచ్చినపుడు స్త్రీసుఖమును కోరకుండనుండఁ గల ఇంద్రియనిగ్రహశక్తి యే మహానుభావులగు యోగుల కోకాని సామాన్యులకు సాధ్యముకాదఁట! కాని, ప్రకృత మున్న భార్య పనికిరాదను నమ్మకి మున్నది. కావుననే, నూతన తారుణ్యము మిసమిసలాడుచున్న పుత్రునికి నెమ్మదిగా ఎప్పుడయినా వివాహము చేయవచ్చునులే అను కొని, వానికి పెత్తనమువచ్చిన వధువు తన అక్కరకే పనికి వచ్చును గదా యను బుద్ధి జాతకునికి వచ్చినది. లగ్నమం దుండి శుక్రుని వేధించుచున్న ఇంద్రుని మహిమ!

విశేష మేమనఁగా, ఆచిన్నదాని లగ్నము వృశ్చిక రాశిలో 14-వ భాగలో నుండఁగా, జాతకుని చలితకుజుఁ డీ వయస్సునకు నికరముగా ఆ భాగకే వచ్చినాఁడు! కుజునికి లాభాధిపత్య మున్నదిగదా? అందుకే ఈ ఉబలాట!

లగ్నమందున్న ఇంద్రుఁడు శుక్రుని విషమదృష్టికి లోనై, లగ్నాధిపతి యగు బుధునిపై సార్ధకేంద్ర ప్రాతికూల్యదృష్టిని ప్రసరించుచున్నాఁడు. ఇంద్రియవ్యామోహము, ప్రేమవిషయమున ద్రోహచింతనము, అశుద్ధమైనట్టి, లేక నిందార్హమగునట్టి విపరీతప్రవర్తన గలవారి సంబంధము ఈ మున్నగు గుణములలో కొన్ని ఏదోయొక విధముగా జీవితములో నీయోగము తెచ్చిపెట్టఁగలదఁట! ధర్మస్థానాధి పతి శని. అతనితో సయిత మీశుక్రుఁడు చెడినాఁడు. ధర్మలోప మేదయినా కలిగినచో, అది స్త్రీల సంబంధ మందో, (శుక్రుఁడు పంచమాధిపతి అగుటచే) విషయసుఖ వ్యామోహమందో, సంతానవిషయమందో అన్వయించుకో వలసియుండునుగదా? వస్తుస్థితిలో, జాతకుఁడు మంచి సాత్త్వికస్వభావము గలిగి సనాతనాచార శుద్ధమగు సంప్ర దాయమును చూపునట్టి పరమేకాంతి. పాపమని తోఁచెనేని, అట్టి కార్య మేదియు అతఁడు చేయునట్టివాఁడు కాదు. ఏఁబది సంవత్సరముల వయస్సులో కన్యకాత్వము తీరని కనుకందను వివాహమాడుట ఇప్పటి సాంఘికనైతిక పరిస్థితులలో అధర్మమని, అన్యాయ్యమని అతనికి స్ఫురించి యేయుండదు. ఆదే లగ్నములో నున్న ఇంద్రుని మాయ! వయసు చెల్లిన చ్యవనమహర్షి సుకన్యను వివాహమాడ లేదా? అశ్వినీదేవతల అనుగ్రహ మాకాలములో నుండఁగా, వాజీకరణయోగములు సమకూర్చు హక్కులు లివు డుండనే యున్నారు. ప్రాచీనాచారదూరులగు నవనాగరకయువకులలో నెవనికో భార్యయగుటకంటె, సదాచారసంపన్నుఁడగు తన వంటి యోగ్యునికి ధర్మపత్నియగుట ఏ కన్యకకయినా ముక్తిమార్గప్రదర్శక మను నమ్మకము జాతకునికి వచ్చినచో అది ఇంద్రుని వరప్రసాదమే యగును. ఇట్టి యూహలలో ధర్మమునకు కాకుండినా ప్రాపంచిక వివేకమునకు మోస మున్నదని అతనికి స్ఫురించకయే పోవచ్చును.

"Wedded she was some years, and to a man, of Fifty, and such husbands are in plenty: And yet, I think, instead of such a One, It were better to have two of five and twenty, especially, in countries near the Sun" (*From Byron's Don Juan*)

[ఏఁబది సంవత్సరముల వయస్సుగలవానితో ఆమెకు కొన్నియేండ్లక్రింద వివాహమైనది. అట్టి భర్తలు అనేకు లున్నారు: కాని, నా అభిప్రాయ మిది. అట్టివాఁ డొకఁ డుండుటకంటె, ఇరువది అయిదేండ్లవా రిద్ద రుండుట మేలు, అందులో, ఎండ దేశములలో ఇది ముఖ్యము.]

భైరవకవి వ్రాసిన పైపద్యమందలి భావము— ఎంత ధర్మభూమిలో పుట్టినవారయినా—ఇప్పటి నైతిక విప్లవదినములలో మన దేశపు కన్యలలో కొందరికైనా కలుగ వచ్చునని జాతకమహాశయునికి గోచరించియుండదు. పరాధి ప్రాయము వరకుచేయని అమాయికవర్తనుఁ డతఁడు.

అది యట్లుండె.

కర్కాటకలగ్నజాతకునికి లగ్నములో ఇంద్ర గ్రహము లేదు. పీడ వదలినది. లగ్నాధిపతి చంద్రుఁడు శుభక్షేత్రమగు మీనరాశిలో ధర్మస్థానము (నవమభావము)లో నున్నాఁడు. ఇంద్రశుక్రుల కేంద్రస్థితి యను దోషమున్నది కాని. అట్టి ఇంద్రుఁడు లగ్నములో (స్వభావములో). అట్టి శుక్రుఁడు చతుర్థస్థానములో (గృహస్థానములో). లేరనుట గమనించితిమేని. లగ్నాధిపతియొక్క ధర్మస్థాన స్థితివలన శీలస్వభావములలో కలిగిన ఉత్తమశ్లోకత్వము పాఠకమహాశయులు సులభముగా నూహింపఁగలరు. ఇంద్రవేధ కల శుక్రుఁడు సూచించు గుణము లగ్నకేంద్రమున కంటక తృతీయ వ్యయస్థానములకు వ్యాపించుటచే. జాతకుని స్వభావము నది స్పృశించకపోయినది. ఆ స్థానములు సూచించు ఇతరవ్యక్తులలోనో. పరిస్థితులలోనో కానవచ్చి జాతకునికి క్లేశము నిచ్చుచుండవచ్చును. పోనిండు.

సప్తమాధిపతి శని యైనాఁడు. బృహస్పతితో ఈ శనికి కేంద్రవేధ. ఈ బృహస్పతి షష్ఠ(రోగ)స్థానాధిపతి. భార్య ఆరోగ్యవతి కాదు. కళత్రకారకుఁడగు శుక్రుఁడు వ్యయస్థానమందలి ఇంద్రునితో విద్ధుఁడై కళత్రాధిపతికి (శనికి) అర్ధకేంద్రదృష్టిలో నున్నాఁడు. సుఖము దూర మైనది. కారణము ఇంద్రమాయః ఏదో, ఎవనికినిఅర్థముకాని వ్యాధి అది. క్రమక్రమముగా భార్యకు దేహబలము క్షీణించినది. క్షయరోగ మని 'నాటు'వైద్యు లనిరి: ఏదో వింత పేరు గల 'టి. బి.' అని ఇంగ్లీషుడాక్టర్లు పేరుపెట్టిరి. మందుమాకులు సేవించి చాలయినది. ఫలము కించిత్తయినా కానరాలేదు. భగవంతునిమీఁదనే భారముంచి అతని కటాక్షమును నమ్ముకొన్నారు దంపతులు.

ఈ జాతకమున లగ్నాధిపతితో కళత్రాధిపతి (శని) కెంత చక్కని శుభమిత్రదృష్టి యున్నదో పరిశీలింపుఁడు: శ్రోత్రియమిత్రుని జాతకములోవలె కేంద్రదృష్టి కాక. త్రికోణదృష్టి. ఈ జాతకునికి భార్యపై నపారవిశ్వాసము. అది భక్తిఅన్నను తప్పుగాదు. పితృసహాయమిందువు సింహ రాశిలో 70-25 లో గురువుచెంత నున్నది. పితృభాగ్యము జాతకునికి రమ్యముగా చూపబడుచున్నది. కాని శనితో (కళత్రాధిపతితో) ఈచిందువునకు కేంద్రవేధ కలదు. ఏదో కొంత ఘర్షణము తప్పినది కాదు. పితృస్థానాధిపతి (దశమాధిపతి) యగు కుజుఁడు రవితో చేరి గృహస్థానమందున్నాఁడు. జాతకునికి మనశ్శాంతి ఎప్పుడైనా తగ్గ నేని ఇంటి కలతలే కారణము కావచ్చును. సాధారణముగా చిత్తశాంతిని కోలుపోవని ధీరుఁడు జాతకుఁడు. చంద్రునితో శనిబుధులకు కల మైత్రివలని ఫల మిది.

"చెప్పులోని రాయి. చెవిలోని జోరీగ.
కంటిలోని నలుసు. కాలిముల్లు.
ఇంటిలోని పోరు ఇంతంత కాదురా"
అన్నాఁడుకదా, అనుభవశాలి వేమన్న?

ధర్మపత్నిపై జాతకునకుఁగల న్యాయ్యమగు విశ్వాసము అతని తంత్రిదృష్టిలో అశక్తతగనో. స్త్రీపరతంత్రతగనో కానరావచ్చును. లేదా. ఆమెయాజమాన్యమును సహించుటకు వలయు నోపికలేనివారు పెద్దలు కావచ్చును. ఏమైన నేమి. జాతకుని మనశ్శాంతి కిది భంగకారి. శని చంద్రుల మైత్రి దృఢమగుటచే. ఏవిఘ్నములకుఁగాని ప్రతిబంధకములకుఁగాని వెలలేదు. గృహస్థాశ్రమములో బ్రహ్మచర్యము నలవరచుకొన్నాఁడు జాతకుఁడు. భార్య కారోగ్యము కాలేదే యను చింతయే కాని. తనకు సుఖము లేకపోయెనే అను దుఃఖమతని కంటనేలేదు.

నాలుగైదు సంవత్సరములకు పూర్వ మొకనాఁడు నామిత్రునిభార్య జాతకమునుచూచి, మూఁడు సంవత్సరముల కాలములో దేవమానదశ బాగుపడుచుండిన కారణమున. ఆమె కారోగ్యము కలుగునని సూచించియుంటిని. అప్పు డామెదేహ స్థితి మిక్కిలి భయావహముగ నుండినది. కాని జాతకుఁడు ధైర్యము చెడలేదు. క్రమక్రమముగా జాతకుని భార్య ఆరోగ్యమును సంపాదించుకొన్నది. ఇంద్ర గ్రహము చారవశమున తులారాశి చేరి జన్మకాలిక బృహస్పతికి మిత్రదృష్టికి రాఁగా. దేవగురు కటాక్షమున నామెకు పూర్ణారోగ్యము కలిగినది. ఇప్పు డామె తన యింటికిని. భర్తశీలమునకును కళతెచ్చినది. జాతకునికి చలితశుక్రుఁడు జన్మకుజ సంయోగమును పొందిన కాలముకదా యిది?

ఇంత చాలును. ఈరెండు జాతకములలో సాయన కుండలికిఁ గల విలువ పాఠకమహాశయులు గమనించఁగల రని నాయాశ.

నిర్ణయము

•

— శ్రీ చెఱుకుపల్లి జమదగ్నిశర్మ —

[పితృమరణదుఃఖము కడచనిన వెనుక శత్రుఘ్నుఁడు తనలో—]

గద్దెనెక్కుట కాలిపైఁ గాలువెట్టి-కూరుచుండి సుఖమ్ము చేకొనఁగఁగాదు
అల కిరీటమ్ముకంటె శతాధికమ్ము-బరువు ధర్మమ్ము నిర్వహింపంగనగును.

రాజురా జన కరము కరమ్ము గొనుచు-కడుపులోఁ జల్ల కదలక కాళ్లు సాఁపి
స్వీయసౌఖ్యమ్ముపొంటె నుర్వీజనాళి-యభిమతార్థంబు త్రోసివేయంగఁగాదు.

రాజన తండ్రియై ప్రజల రక్షణసేయవలెన్, సమస్తభూ
మీజనమాన్యుఁడై యిలను మెట్టిన దైవమటన్న ఖ్యాతితో
రాజిలఁగావలెన్; దొసఁగు రాఁ జన దెన్నఁడు పాలనంబునన్;
రాజయినన్ సుఖమ్ము కనరాదుగదా తలక్రిందులైననున్.

దోషి నిర్దోషి నెఱిఁగి తద్దోషమునకుఁ-దగిన దండన విధియించు తరిని దొసఁగు
కొంతవానికి రావచ్చు నీకతాన-నృపున కంతాన యముని మన్నింపు నిజము.

అగుటన్ లోకమునందు నెవ్వఁడును రాజ్యాపేక్షఁ బోరాడఁగాఁ
దగ దెన్నండును, ధర్మభారవహనార్థం బెవ్వఁడే ముందుకున్
దగువాఁడై చనుదెంచుచో నయమె! స్వార్థం బెంచి యర్థార్థియై
జగమేల్ భారము నెత్తికెత్తికొనుటల్ సవ్యంబుగా దేనికిన్.

రాజే తానుగ ధర్మమున్ జెఱిచి సామ్రాజ్యమ్ము సాధించినన్
రా జెట్లో ప్రజ యట్లటన్న నుడి వ్యర్థంబౌనె! వెన్వెంట నీ
వ్యాజమ్ముం గొని యెల్లవారు ప్రభులై స్వార్థప్రతిస్పర్థులై
తేజోవంతమునైన ధర్మ మది నిస్తేజమ్ముగాఁ జేయరే!

రఘుకులమ్మున జ్యేష్ఠుండు రాజుగాఁగ-ధర్మముండంగ నేటి కధర్మవృత్తి
నకట!-తల్లియూఁగాక-నిశాటతన్వి-సకలగుణధాము రాముఁ గానకయి పంపె!

అన్న యెక్కంగనైన సింహాసనాన-తమ్ముఁ డొకఁ డెక్క నది యెట్లు ధర్మమగును?
ధర్మవిచ్ఛిత్తి సలుపుభూధవుఁడు గలుగ-నతని రాజ్యాన ధర్మ మేమగును ప్రజకు?

యోజనము చేయు కొలఁదిగ-రాజద్రోహమ్ము సలుప ప్రజలకు ధర్మం
బీజగతి ననుచుఁ దోఁచెడి-రాజుగ రామాధినేత రాఁగలవఱకున్.

ప్రకృతిశాస్త్రసిద్ధాంతములు

2. బ్రహ్మాండము

'విద్యార్థి'

౧. సూర్యుడు, ఇతర నక్షత్రములు

మనం చూచే సూర్యుడు నిజానికి ఒక నక్షత్ర మాత్రుడు. ఇక్కడికి ౯౩౦ లక్షల మైళ్ల దూరాన ఉన్నాడు. ఇతర నక్షత్రాలు అనేకంకన్న చిన్న వాడు. మనకు ఎంతో దగ్గర దనుకునే నక్షత్రము సూర్యునికన్న వేలరెట్లు దూరాన ఉన్నది. కనుకనే నక్షత్రాలు అంత చుక్కలుగాను, సూర్యుడు అంత ముద్దగాను కన్పిస్తున్నారు. మన భూమిలో చూచు కుంటే సూర్యుడు ఎంతో పెద్దవాడు. ఈ పోలికలు గ్రహించవలెనంటే న్యూయార్కునుంచి సాన్‌ఫ్రాన్సిస్కోకు నాలుగు రోజులలోనే పోయి చేరగల వేగిర మైన ఎక్స్‌ప్రెస్‌రైలు ఉంటే అది అదేవేగంతో భూమధ్యరేఖను భూమి చుట్టూతా తిరగటానికి ౩౫ రోజులు పడుతుందికాని సూర్యునిమధ్యరేఖను సూర్యుని చుట్టూ తిరగను పది సంవత్సరాలు పడుతుంది. దీన్ని బట్టి సూర్యుని ఆకారం గ్రహించవచ్చును. రైలు ఆకాశంలోకి వెళలిపోయి దివారాత్రాలు అదే వేగంతో పోతూనే ఉంటే సూర్యుని చేరేవరకు ౩౫౦ సంవత్సరాల కాలము పట్టుతుంది.

ఎనిమిదిన్నరఅంగుళాల వ్యాసము పెట్టి కాగితంతో బంతిలాగా చేసి అది సూర్యుడుఅనుకుంటే ఆ అంతరంలో భూమిఆకారము గుండుసూదితలను పోలిఉంటుంది. కాగితపు బంతికి ౮౫౦అడుగుల దూరాన గుండుసూదినిఉంచితే భూమికి,సూర్యునికిఉన్న దూరం ఏపాటిదో యీపోలికతో ఊహించుకోవచ్చును. అన్ని వైపులా సూర్యుడు వేడిరూపముగాను, వెలుగురూపము గాను శక్తిప్రసారముచేస్తూఉన్నాడు. అయితే అందులో ఎన్నోవీసం భూమికి వచ్చి చేరుకున్నదో ఆలోచించండి. కోట్లసంవత్సరాలుగా సూర్యుడు యీశక్తిని పంపిస్తూనే ఉన్నాడు. బహుశః ఇంకా కోట్లసంవత్సరాల తరబడి పంపుతూనే ఉంటాడు. ఈశక్తికి మూలం ఏమిటి? పదార్థములు కుంచుకోగా వేడి బయటపడుతుం దని సిద్ధిస్తున్నది కనుక సూర్యుడు చల్లపడి కుంచుకుంటూ ఉండటము యీ శక్తిప్రసారణకు ఒక హేతు వనవచ్చును. అయితే యీవిధంగా జరిగివచ్చే వేడి కొద్దిదే. మిగిలినదానిమాట యేమి? ఈశక్తికి కిరణ-కర్మ ఒకనిధానము కావచ్చునని శాస్త్రజ్ఞులు కొందరు తలుస్తున్నారు. ధాతువుల(మూలద్రవ్యముల)కణములు విరిసిపోగా వేడి పుట్టుతున్నది. దీనినే కిరణకర్మ అంటారు.

లోహమయమైన ఆవిర్ల నుంచి ప్రకాశమానమై మేఘములు ఏర్పడగా వాటివలన సూర్యుని బింబతలము మెరుస్తున్నది. భూమిమీద ఘనీభవించిఉండే ధాతువులన్నీ సూర్యునిలో వాయురూపము దాల్చిఉంటవి. ఒకొక్కప్పుడు సూర్యబింబంఅంత వేడిగా ఉంటుంది. సూర్యునిపైన నల్లని మచ్చలు కానవస్తవి. వీటిని సూర్యాంకము లంటారు. ధగధగ మెరిసే వేడివేడివాగ మబ్బుల మండలాలలో ఉప్పెనగాడ్పులలాగా రభసగా సుళ్లు తిరిగే తుఫానులే యీసూర్యాంకములు. నిమిషానికి ఇవి ఆరు వేలమైళ్ల వేగాన కదిలిపోతూఉండునని అంచనా వేశారు. ౧౯౩౫లో ఫ్లారిడాను నాశంచేసిన ఉప్పెన గాలి నిమిషానికి రెండుమైళ్ల ఝురితో వీచిందంటే

ఆవేగపు రివ్వు ఊహించుకోవచ్చు. ఈసూర్యాంకము ఒకటి లండనును తాకితే అక్కడి నెల్సన్ స్తంభము 3 వేలమైళ్ల దూరాన ఉన్న న్యూఫౌండ్ లాండ్ లోకి అరనిమిషంలో ఎగిరిపోయిపడుతుంది. పదకొండేళ్ల కోసారి ఈసూర్యాంకముల సంఖ్య వర్ధిల్లుతూ ఉంటుంది. ఆసమయంలో దిక్సూచిలోని సూది కొట్టుకుంటుంది. రేడియో, టెలిగ్రాఫ్ సందేశములకు ఆటంకం కలుగుతుంది. ఆకాశంలోని ఉత్తరాది జ్యోతి మరింతకాంతిగా వెలుగొందుతుంది.

సూర్యుడుసహా అన్ని నక్షత్రాలూ వాటివాటి వెలుగువల్లనే ప్రకాశిస్తున్నవికాని చంద్రుడివలె ఇతరంగా ప్రతిభానమయ్యే వెలుగువలన కాదు. వెలుతురు సెకనుకు ౧౮౬ వేల మైళ్లచొప్పున ప్రయాణంచేసినా సూర్యకాంతి మనకు చేరేప్పటికి ౮ నిమిషాలు పడుతుంది. ఇంత గొప్ప వేగము ఉన్నప్పటికీ, మనకు దగ్గరగా ఉన్న నక్షత్రకాంతి మనకు చేరను నాలుగేళ్లపైచిలుకు పట్టుతుంది. కొన్ని నక్షత్రాలు ఎంత దూరాన ఉన్నవనగా అవి ఇవ్వాళ లుప్తమైపోయినప్పటికీ యీ భూలోకవాసులకు ఆ సంగతి తెలిసేప్పటికి వందలాది వేలాదిసంవత్సరాలు గడిచిపోతవి.

౨. నక్షత్రగణములు

నక్షత్రాల గుంపులను నక్షత్రగణములు అంటారు. ప్రాచీనులు ఆకాశం వీక్షించి పశువులు, మునులు, దేవతలు మొదలైనవారికి సూచకముగా నక్షత్రములు గణవిభాగమైయున్నవని ఊహపడినారు. వారా గణములకు పెట్టిన పేర్లు ఇప్పటికీ అనుసూల్యంగా వస్తూ వాడుకలో ఉన్నవి. సప్తర్షి మండలము, ఉత్తర ధ్రువ మండలము అని ఇప్పుడున్నూ పేర్కొంటున్నాము. ఇవి ఏడాదిపొడుగునా ఆకాశంలో కనిపిస్తూనే ఉంటవి. ఇవి ధ్రువనక్షత్రంచేరువనే ఉంటవి. నిజానికి ధ్రువనక్షత్రం వల్లనే ఉత్తరధ్రువ మండలము ఏర్పడుతున్నది.

3. ధ్రువనక్షత్రము

ఆకాశంలో మెరిసే అన్నినక్షత్రాలలోకీ ధ్రువనక్షత్రం అనాదిగా నావికులకు, భూసంచారులకు మార్గదర్శినిగా ఉన్నందున ఎంతో ప్రసిద్ధమైనది. మిగిలిన నక్షత్రాలన్నీ దానిచుట్టూ తిరుగుతున్నట్లు ఉంటుంది. భూగోళపు ఇరుసుగీతకు అది ఇంచుమించు సూటీరుగా ఉన్నందున అలా అనిపిస్తుంది. మొదట ధ్రువనక్షత్రం ఏదో నిర్ధారించుకుంటే చాలా నక్షత్రగణాలను తేలికగా తెలుసుకోవచ్చును. ఈ నక్షత్రమేదో పోల్చుకోవలెనంటే రాత్రివేళ ఆకాశం స్వచ్ఛంగా ఉన్నపుడు ఎప్పుడైనాసరే ఉత్తరభాగాన చూడండి—సప్తర్షి మండలం పోల్చుకో వచ్చు. ఈ మండలం కొడగిన్నెలాగా ఉంటుంది. నాలుగు చుక్కలు నల్చుదరపుమూలలుగా గిన్నెవలె ఉండి, వరసగా ఉన్న మూడుచుక్కలు కాడలాగా ఉంటవి. ఎదురుబొదురుగా గిన్నె కొసనున్న రెండునక్షత్రాలను చూపుడు నక్షత్రాలంటారు. ఇవి సూటిగా ధ్రువనక్షత్రాన్ని చూపుతవి గనుక వీటికి యీ పేరు వచ్చింది. ప్రకాశానికి ధ్రువనక్షత్రము యీ రెండు చూపుడు నక్షత్రాల కాంతికీ సమమౌతుంది. ఆ రెండు నక్షత్రాలమధ్యనున్న దూరానికి అయిదింతల దూరం ధ్రువనక్షత్రానికీ, సప్తర్షి మండలానికీ ఉంటుంది.

౪. ఉత్తర ధ్రువమండలము

నిజానికి ఉత్తరధ్రువమండలంలోనే ధ్రువనక్షత్రంకూడా చేరుతుంది. వంపుతిరిగి, నాలుగు నక్షత్రాల రాశిని ఆనుకున్న గీతకు చివరన యిది ఉన్నది. ఈ మండలమూ కొడగిన్నెలాగానే ఉంటుంది. ఈ మండలాలు, యితర మండలాలు ధ్రువనక్షత్రం చుట్టూరా తిరుగుతూఉన్నవనిపిస్తుంది కనుకనే కాలభేదాన్నిబట్టి వీటి స్థానము మారుతూఉంటుంది. కాని నిజానికి యివి తిరుగుతున్నవనిపించటానికి హేతువు భూమి తిరగటమేను.

౫. నక్షత్రాల జన్మాదికము

ఆకారానికీ, కాంతికీ నక్షత్రాలలో చాలా భేదముంటుంది. కొన్ని నక్షత్రాలముందు మన యీ సూర్యుడే చాలా చిన్నగా కన్పిస్తాడు. వాటి వ్యాసము భూసూర్యుల కున్న దూరాన్ని మించిఉంటుంది.

పెద్దపెద్దనక్షత్రాలు భూమికి మరీ దూరాన ఉంటవి. కనుక అంత ప్రకాశంగా ఉండవు. జ్యోతి శ్శాస్త్రజ్ఞులు నక్షత్రాలను వాటి కాంతి తేజస్సులనుబట్టి జాతులుగా వర్గీకరణం చేస్తారు. అందులో మొదటి దలుగా లెక్కకువచ్చేవి ఎంతో ప్రకాశవంతంగా ఉండి, తేలికగా గుర్తుపట్టవీలవును.

గాలిలియో అనే ఆయన టెలిస్కోపును కన్పెట్టే వరకూ ఖగోళశాస్త్రజ్ఞుల నక్షత్రపరీక్ష తగుమాత్రంగా చాలా పరిమితమైవుండేది. ఆకాశం ఎంతో స్వచ్ఛంగా ఉన్నదనుకున్న రాత్రి దూరదర్శినిసాయం లేకుండా రెండువేలనక్షత్రాలకన్న గుర్తుపట్టవీలయేది కాదు. ప్రాచీనకాలపు గొప్పజ్యోతిశ్శాస్త్రజ్ఞులలో ఒకడు టాలిమీ అంతవాడుకూడా వెయ్యినక్షత్రాల పై చిలుకుమాత్రమే జాబితా వ్రాయగలిగాడు. కాని గాలిలియోసిద్ధివలన అపారఫలితములు లభించినవి. సూర్యాంకములు స్పష్టముగా కాన్పించినవి. చంద్రమండలంలోని కొండలు, లోయలు కంటబడినవి. బృహస్పతి చుట్టూ ప్రదక్షిణం చేసే చంద్రులు కనిపించారు. మన సౌరమండలాన్ని ఇముడ్చుకున్న నక్షత్రలోక మెంత భారీదో, దాని సాధారణఆకారవివ్యాసం ఎలాటిదో మొదటిసారిగా సర్ విలియం హర్షెల్ వల్ల తెలియవచ్చినది. పాలపుంత మసకమసక వెలుగుపట్టెడవలె కన్పిస్తుంది. కాని నిజానికి సూర్యునిపోలిన నక్షత్రాలు అంతకన్న ఎంతెంతో పెద్దవి పెక్కులుపెక్కులుగా పాలపుంతలో ఉన్నవి. పాలపుంతకు సమకోణంగా ఎన్నోనక్షత్రాలు లేవు. గిన్నెవంటి ఖగోళములో భూమి ఉన్నదని పాలపుంతనుగూర్చి సమాధానమైన వివరణ చెప్పకోవచ్చును.

నక్షత్రాల యీడును బట్టి వాటి రంగుల్లో భేదాలు ఉండును. పలచని వాయువులనుండి పవికందులుగా ఏర్పడుతున్నవి. అవి పెద్దపెరగగా చిన్నవి చిన్నవై లోపేడిని కొంత పలికి కక్కివేస్తవి. కాని చిన్నవవుతూ గట్టిపడగా వాటి తాపం హెచ్చి ఎర్రదనం పోయి తెల్లగానో, కొంచెం నీలంగానో తేలుతవి. కొంతకాలానికి ఒక స్థితి వచ్చేప్పటికి ఈ వేడిమి హెచ్చుడము ఆగిపోతుంది. అప్పుడు అవి తిరిగీ చల్లబడుతవి. అప్పటికున్న తెల్లరంగో, నీలనీలపు రంగో పోయి పసుపుపచ్చనో, లేక ఎరుపో అవుతవి. చివరకు అవి అంతర్ధానమౌతవి. కనబడే నక్షత్రాలకన్న నల్లగా కనబడకుండా ఉండేవి ఎక్కువగా ఉన్నవనే భావన కద్దు. అనేకనక్షత్రాలు జములువంటారు. అంటే ఒకేకేంద్రంగా రెండేసి నక్షత్రాలు తిరుగునంటారు. అటువంటి జంట ఒకటి, అరబ్బీలు దయ్యమనే అల్గోల్. ఇందులో రెండునక్షత్రా లున్నవి. వీటికాంతిలో తేడా ఉన్నది. అందువలన కొద్ది రోజుల్లోనే యీజంట ప్రకాశంగాను, మసకగాను కూడా ఉంటుంది. ౧౮, ౧౯ శతాబ్దాలలో అరబ్బీలు ఆకాశమును ఎంతో శ్రద్ధగా చదివినారు. మన ఖగోళ, గణితజ్ఞానమునకు వారికి మనం చాలా ఋణపడినాము.

౬. కొన్ని నక్షత్రాలు

సప్తర్షిమండలాగ్రంనుంచి అవగా, కాడగిన్నెను కాడచేరినచోటునుంచి పైగాఉన్న నక్షత్రానికీన్నీ, ఇంకా యీరెండుమండలాల వెడల్పుకు నాలుగింతలు అవలికిన్నీ ఒక గీత కల్పించుకుంటే ప్రథమజాతికి చెందిన బ్రహ్మహృదయమనే నక్షత్రం పసుపుపచ్చనిది కన్పిస్తుంది. ఇది సారథిమండలంలోనిది. సూర్య కాంతికన్న బ్రహ్మహృదయకాంతి ౧౨౦ యంతలు. జనవరి ఫిబ్రవరిమాసాలలో అది నెత్తిన ఉంటుంది.

అనతిదూరాన జంటనక్షత్రా లనేవి రెండున్నవి. వాటినే పునర్వసు, పునర్వసుద్వితీయ అంటాము. పునర్వసు పసుపు పచ్చనిది. సూర్యుని ఈడుది.

ధ్రువర్క్షస్య ద్వితీయ తెల్లనిది. జంటలోకి ఇది యీడుకు చిన్నది.

వేసవిలో ఆకాశంలో కల్లా పరమప్రకాశంగా ఉండేది అభిజిత్తు నక్షత్రము. ఇది తెల్లన. సూర్యుని కన్న ౯౦ రెట్లు వెలుగు నిస్తుంది. కాని భూమినుంచి సూర్యునికన్న చాలాదూరాన ఉన్నందున అంతగా వెలుగు అనిపించదు. సూర్యుడు అభిజిత్తు ముఖంగా కదులుతున్నాడు. శీతకాలంలో పరమప్రకాశమైనది లుబ్ధక నక్షత్రం. ఇది బహులుబ్ధక మండలంలోనిది. ఇది ఆ ఋతువులోని పరమప్రకాశవంతమైన మృగశిర మండలాని దని పూర్వులు భావించేవారు.

౭. సన్నమబ్బులు

పెద్ద టెలిస్కోపుతో ఆకాశవీక్షణ చేస్తే జ్యోతిబిందువులు నక్షత్రాలే కాక, మేఘాలవంటి మేట్లు గోపురంగాను, కొన్ని ఏ ఆకార మనటానికీ వీలులేక చీకిరిగాను కన్పిస్తవి. వీటిని సన్నమబ్బు లంటారు. ఇవి వాయువులతో ఏర్పడినవి. ఇలాటివి వేలాదివందలకొద్దీ గుర్తుపెట్టారు. ఇవి ఎంతెంత దూరాల ఉన్నవో అంచనా వేసి, అవి వేరేలోకాలు అని విశ్వసిస్తున్నారు. కొన్ని సన్నమబ్బులు నల్లగా ఉండి వాటి వెనకగా ఉన్న నక్షత్రాలను కమ్మివేస్తున్నవి. ఈ నల్లని సన్నమబ్బుల ప్రకృతి యిలాటిదని నిశ్చితంగా చెప్పటం అసంభవము.

౮. సౌరమండలం

సూర్యుని గురించి, నక్షత్రాలను గురించి ప్రాచీనులకు తెలిసినదానికీ, మన కిపుడు తెలిసినదానికీ ఎంతో తేడా ఉన్నది. బ్రహ్మాండానికి భూమి కేంద్రమని, ఆకాశం చాందినీవంటిదని, ఆకాశపథాల పరుగిడిపోయే అగ్నిరథం సూర్యబింబమనీ పూర్వం అనుకునేవారు. ఇతర లోకాలతో నక్షత్రాలను పోల్చితే భూమి చిన్నదనిన్నీ, ఇదిన్నీ, గ్రహాలనే మరి యేడున్నూ సూర్యునిచుట్టూ తిరుగుతున్నవనీ ఇపుడు మనకు తెలుసును. సూర్యుడు, ఇవి, వీటిచుట్టూ తిరిగే చిన్నవీ కలిసి సౌరమండలం ఏర్పడుతున్నది. నిజంగా సూర్యులే అయిన నక్షత్రాలకు వాటిచుట్టూ తిరుగాడే బింబాలు ఉండవచ్చును.

గ్రహాలు ఎనిమిది. వాటి ఆకారాన్ని బట్టి వరసగా వాటి పేర్లు యివి: బుధుడు, అంగారకుడు (కుజుడు), శుక్రుడు, భూమి, వరుణుడు, నెప్ట్యూన్, శని, బృహస్పతి (గురు). బుధుడు చిన్నవాడేకాక సూర్యునికి పరమసమీపాన ఉన్నాడు. అంటే ౩౬౦ లక్షల మైళ్ల దూర మున్నాడు. నెప్ట్యూన్ అత్యంత దూరాన ఉన్నాడు. అంటే ౩౦౦౮౦ లక్షలమైళ్ల దూర మున్నాడు. అన్నిట్లోకీ బృహస్పతి పెద్ద. భూమికన్న ౧౩౦౦ రెట్లు పెద్ద.

సౌరమండలాన్ని గురించి సర్ విలియం హర్షల్ పదచిత్ర మిచ్చాడు. నున్నని అయిదుమైళ్ల పొడుగు పొలంలో మధ్యన రెండు అడుగుల వ్యాసం గల భూగోళపు బంతి ఉంచండి. ఇది సూర్య డనుకోండి. అక్కడికి ౧౬౪ మైళ్లదూరాన ఉండే ఆవగింజ బుధుణ్ని సూచిస్తుంది. కేంద్రానికి ౨౮౪ అడుగుల దూరాన బటానీగింజ భూమివలె ఉంటుంది. ౬౫౪ అడుగుల దూరాన పెద్ద గుండుసూది తలకాయ అంగారకుని పోలిఉంటుంది. వెయ్యి, ౧౨౦౦ అడుగుల దూరాన ఇసుక రేణువులు ఉపగ్రహాలను సూచిస్తవి. అరమైలు దూరాన ఓ మాదిరి నారింజకాయ బృహస్పతి అవుతుంది. ౪/౫ మైలు దూరాన చిన్న నారింజ శనిగ్రహం వంటిది. మైలున్నరదూరాన దొండపండు వరుణుడవుతుంది. రెండున్నరమైళ్లదూరాన రేగుపండు నెప్ట్యూనును పోలి ఉంటుంది.

చర్మచక్షువుకు అయిదుగ్రహాలే కన్పిస్తవి. బుధుడు సూర్యుని కెంత దగ్గిరగా ఉన్నాడంటే ఎప్పుడో గాని మనకు కనబడడు. ఇంకా ఆపైన ఉన్న శుక్రుని చూచిఉంటారు. ఉదయాస్తమయాన తూర్పు ఆకాశానను, అస్తమయవేళ పడమరను అప్పుడప్పుడు కనపడే కాంతివంతమైన గ్రహం ఇదే. భూమికక్ష్యకు వెలుపల అంగారకుని కక్ష ఉన్నది. దాని రంగు

దాని నేలనుబట్టి ఉంటుంది. ధ్రువసంబంధమైన మంచుగుట్టలువినా అదంతా ఎడారి. వీటిని టెలిస్కోపుతో చూడవచ్చును. వీటి వృద్ధిక్షయాలు అంగారక ఋతువులనుబట్టి ఉండును. పెద్ద టెలిస్కోపుతో ఆకాశం స్వచ్ఛంగా ఉన్న రాత్రి చూస్తే దానిపైన నూటిగీతలవంటి గీరలు కనవస్తవి. ధ్రువ హైమనగాలనుంచి వచ్చే కాలువలప్రక్కన ఉండే పచ్చికలని, లేదా కాలువలని కొందరు వీటినిగురించి అభిప్రాయపడుతున్నారు. అంగారకునిమీది సహజమైన గాలిపాటు చాలా పల్చన. అక్కడ మామూలు వేడి ఇక్కడికన్నను తక్కువ. అక్కడ ప్రాణసంచారం ఉన్నదో లేదో తెలియదు. మామూలుకంటికి కనిపించే సుదూరగ్రహం శనిది. దీనిచుట్టూరా అనేక పల్చని, చదునైన, గిర్రున తిరిగే చక్రాలుండును. ఇవి టెలిస్కోపుకుగాని కనపడవు. వీటిపైన సూర్యకాంతి పడి అద్భుతరమణీయంగా ఉంటున్నది. వరుణుడు భూమికన్న ఎంతో పెద్దగాని చాలాదూరాన ఉన్నందున వచ్చిపడే సూర్యకాంతి ఎంతో ఉండదు. అందుకని కష్టంమీదగాని కనపడదు. దానిఉనికి బయటపడిన తర్వాత దాని చలనం పరిశీలించి ఆకాశ మార్గాల దాని గతి గుణించారు. ఊహించిన స్థానంలో ఆ గ్రహంలేదని కొన్నాళ్లతర్వాత గ్రహించారు. తెలియని మరొక గ్రహం వలన యీభంగం కలిగిఉండునని అనుమానించారు. ఇద్దరు ఖగోళశాస్త్రజ్ఞులు ఎవరికివారు స్వతంత్రంగా పూనుకొని యీ అవక్రమహేతువైన గ్రహం ఎక్కడ ఉంటే ఇలా భంగం కలుగుతుందో విచారించారు. ఒకేసమయాన ఇద్దరూ పరిష్కారం తేల్చారు. తరువాత కొంతకాలానికి త్వరలోనే కొత్తది, అన్నిటికన్నా అత్యంతం కొనవ ఉన్నది నెప్ట్యూన్ అనే గ్రహం ఆ ఖగోళశాస్త్రజ్ఞులు ఎక్కడ ఉండాలని చెప్పారో అక్కడే బయటపడింది.

౯. చంద్రులు

అనేకగ్రహాలకు వాటిచుట్టూ తిరిగే బింబాలు ఉన్నవి. భూమికి అలాటిది చంద్రబింబం ఉన్నదని మనకు తెలుసును. నెప్ట్యూన్‌కు ఒకటి, శనిగ్రహానికి పది బింబాలు ఉన్నవి. మనచంద్రబింబంలో గాలి వీచదు. సహజంగా ఆవరించే గాలిపాటులేదు. మనకేసి ఎప్పుడూ ఒకే ముఖమే దానిది తిరిగిఉంటుంది. ఆవలివైపు ఎవరూ చూడలేదు. పూర్ణచంద్రుడని, నెలవంక అని, అమావాస్యవెళ్లిన పాడ్యమినాటి చంద్రుడని వేళనుబట్టి అంటాము. సూర్యునినుంచి వచ్చిపడ్డ వెలుగుచాటున చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. కనుక సూర్యుని వెలుతురు పడే భాగమే కన్పిస్తున్నది.

చంద్రబింబంపైన కొన్ని భాగాలు చక్రాకారంగా అగ్నిగుండంలాంటి గోతు లున్నవి. వాటి మట్టం చదును. సామాన్యంగా గుండంమధ్యనుంచి లేచే గోపురంలాంటిగుట్ట లుంటవి. అగ్నిగుండాలనే వీటిని గూర్చి అనేకసిద్ధాంతాలు పుట్టినవి. కాని ఏదీ సమ్మతం కాలేదు. చంద్రబింబవ్యాసము ౨ వేల మైళ్లు.

చంద్రబింబం భూమి కన్న చిన్నది. భూమివలె ఇంత ఘనీభవించినదికాదు. కనుక చంద్రబింబంలో పదార్థాల తూకం ఇక్కడికన్న తేలికగా ఉంటుంది.

౧౦. ఉల్కలు

రాత్రివేళ స్వచ్ఛమైన ఆకాశంలో అదాటున వెలుగుబారు లనేకం కనబడటం కద్దు. ఒక త్రుటి కాలం కనబడి అవి మాయమైపోతవి. ఇవి ఉల్కల వల్లను పుడుతవి. అవి రాలుడు చుక్కలు. రోజా భూమిపైనున్న గాలిపాటులోకి ఇవి లక్షలాది వస్తూ ఉంటవనుకోవచ్చును. ఇవి అనేకం ఎంతో చిన్నవి. కొన్ని ఇసుకరేణువులంత చిన్నవి. ఎంతో వేగాన అంతరాళంలో అవి దూసుకువస్తూండగా గాలిరాపిడికి వేడెక్కి మెరుస్తవి. ఆరే వరకూ వెలుగుతవి. లేదా రాపిడివలన వేడిపుట్టనంతగా మందగించేవరకూ వెలుగు

తవి. వీటిలో కొన్ని మన సౌరమండలానికి చెందినవే. ఏటేటా ఆగస్టుమాసంలో ఇవి కొల్లలుగా కన్పిస్తవి. మిగిలినవి ఈ మండలానికి ఆవలనుంచి వస్తు వవచ్చును. భూమికి చేరేలోగా విశీర్ణమైపోనంత పెద్ద ఉల్కలను రాలుడుచుక్కరాళ్లు అంటారు. ప్రదర్శనశాలలలో అనేకం ఇలాటివిచూచి 'ఇవి ఎలాటివో గ్రహించవచ్చును. అవి విశేషం ఇనుముతో కూడినవి. ఇంతవరకు తెలిసిన ౯౨ ధాతువులలోకీ ౩౦ వీటిలో కన్పిస్తున్నవి. పుట్లకొద్దీ బరువుతూగే అసాధారణమైనవి ఒకొక్కప్పుడు లభించినవి. నేలమీదను చుట్టూరా మైళ్లమేర మార్మోగిన మోతతో రాలుడుచుక్కరాళ్లు బద్దలైన సందర్భా లున్నవి. మీకు కుతూహలముంటే ౧౯౩౩ లో సెంట్ లూయిస్ మీద బద్దలైన రాలుడు చుక్కరాతి వైనంగూర్చి తెలుసుకోండి.

—'ది సైన్సుఆఫ్ ఎవరిడేలైఫ్'లోనుంచి.



వేవెల్ ప్రస్తావన వీగిపోయింది

జూన్ 14-జూలై 14 ఉపక్రమణ ఉపసంహారాలు

— శ్రీ వేలూరి సదానందం —

వేవెల్ ప్రస్తావన వీగిపోయింది. ఆ ప్రస్తావన కొండంతఆశ పెట్టింది. దాన్ని పురస్కరించుకొని ఉబలాటపరులు అనేకులు ఆశపడ్డారు. ఆశ లొకప్పుడు పేరాశ లనిపించినవి. చివరికి అడియాశ లైనవి. ప్రస్తావన ఆమూలము గర్హించినవారుకూడా చివరికి యీడేరకపోతుందా అనుకున్నారు. ఇంతా అవుతుందని నాడే చెప్పామన్నవారున్నా లేకపోలేదు. వైఫల్యం ఆ ప్రస్తావనము ఖాన వ్రాసిపెట్టిఉన్నమాట నిజమేకాని వేవెల్ లాఘవంవలన కొంతవరకు ఆశాజనకంగా అపోహలు కలగకపోలేదు. కాని సిమ్లాసభ జూన్ ౨౫, ౨౬, ౨౭, ౨౯ తేదీలలో సమావేశమై కొంత విపరీతంగా జూలై ౧౪ కి వాయిదాపడినపుడే యిక గాలిలో దీపమా అనిపించింది. అనుకున్నట్లుగానే తిరిగి జూలై ౧౪ న సమావేశమైనపుడు ఎక్కువ కాలహరణం లేకుండానే తేలిపోయింది.

సిమ్లాలో వైస్రాయి చేసిన సభ కడసారి జూలై ౧౪ వ ౧౧ గంటలకు సమావేశమైనది. వైస్రాయి జూన్ ౨౯ నుంచి జరిగిన సంగతులపైనం తెలిపాడు. కొత్త కార్యవర్గం ఏ విధంగా, ఎంతమందితో ఏర్పడవలెను అనే విషయమై సభవారు ఒప్పుదల అయి, ఆ పైన పార్టీలవారు పేర్లజాబితాలను తనకు అందించవలెనని వైస్రాయి ఉద్దేశించాడు. అవసరమనిపిస్తే తనకు తోచినపేర్లు చేర్చి బ్రిటిష్ ప్రభుత్వానికీ, తనకూ, సభవారికీ అంగీకారయోగ్యమైన కార్యనిర్వాహకవర్గాన్ని కాగితంమీద ఏర్పరచ జూచేవాడు. ముందుగా పార్టీనాయకులతో తాను ఏరుకున్న పేర్ల జాబితానుగురించి చర్చించి ఫైసలాగా సభవారికి తెలియజేయాలనుకున్నాడు.

కాని దురదృష్టం అలా ఉండనట్టి కార్యవర్గం ఏవిధంగా, ఎంతమందితో ఏర్పడవలెను అనే విషయమై సభవారు ఏకీభవించలేకపోయినందున ముందర స్థిరంగా అంగీకృతమైన యేమాత్రానుసారముగానున్నా కాక పరిష్కారోపాయము అన్వేషించుటకు వైస్రాయి సభవారి ఆమోదంతో పూనుకున్నాడు. పార్టీలవారిని పేర్లజాబితాలు యివ్వమన్నాడు. పార్టీనాయకులకు, సభవారికి అంగీకారయోగ్యమైన సమన్వయము సాధించుటకు తనచేతనైనది చేస్తానన్నాడు.

యూరపియన్ గ్రూప్‌వారు తమకు ప్రమేయం లేని కేవలభారతీయమైన యీ విషయంలో తామెవరి పేర్లనూ సూచించమన్నారు. ఈ గ్రూపునూ, ముస్లింలీగునూ తప్ప మిగిలిన పార్టీలవారందరూ జాబితాలు పంపారు. సభాసాఫల్యానికి సాయశక్తులా ప్రయత్నించేవరకూ సభ వీగిపోరాదని వైస్రాయి నిశ్చయించుకున్నవాడై ముస్లింలీగు పేర్ల జాబితా పంపక పోయినప్పటికీ తానే ముస్లింలీగుపేర్లు కొన్ని చేర్చి తాత్కాలికంగా ఒక జాబితా తయారుచేశాడు. సభవారు అంగీకరించినంతే బ్రిటిష్ప్రభుత్వంవారికిన్నీ అది అంగీకారయోగ్య మయేదని భావించాడు. వైస్రాయి వ్రాసిన జాబితా యేమిటో, అందెవరి పేర్లు ఉన్నవో లోకానికి తెలియదు. కాని అన్నిపార్టీలకూ సమంజసమైన విధాన, తూకంగా, కార్యకుశలమైన కార్యవర్గం తన జాబితాను పురస్కరించుకొని ఏర్పడే

దని వైస్రాయి విశ్వసించాడు. ఏపార్టీకోర్కెలనూ పూర్తిగా అంగీకరించటం వైస్రాయికి సంభవమనిపించలేదట. వైస్రాయి తన సూత్రమును జిన్నాగారికి వివరించిచెప్పగా అది ముస్లింలీగుకు అంగీకారం కాదని చెప్పివేశాడు జిన్నా. అంతటితో ఇంక చర్చసాగించడము వ్యర్థమనుకున్నాడు వైస్రాయి. ఈపరిస్థితిలో వైస్రాయి తన జాబితా సంపూర్ణంగా జిన్నాగారికి చూపించలేదు. ఇతరనాయకులకు ఆ జాబితా చూపించవక్కరలేదనుకున్నాడు. సభ భగ్నమైనదని వెల్లడించాడు.

సభ భగ్నమైనదని కించపడ్డాడు. సభ ఏర్పాటు చేయవలెననే సంకల్పం ప్రధానంగా తనదే; సభ సఫలమైతే ఆ ఘనత తనకే వచ్చేది; కనుక భగ్నమైనందుకు పూచీ తనదేనన్నాడు. అందుకు ఏ పార్టీలను గాని నిందించనన్నాడు. ఈ మాట విని, ఖండన దూషణలకు దిగకుండా ప్రవర్తించమని పరమోదారంగా ఆహూతులకు మనవిచేశాడు. తాను చేసిన యీ ప్రయత్నానికి పర్యవసానంగా మతకులవిరసము మరీ చెడరాదన్నాడు. జపాన్‌తో యుద్ధము జరగవలసినదే; పరిపాలన సాగవలసినదే; యుద్ధోత్తరవికాసపన్నాహము కావలసినదే; ఈ పనులు ఇప్పటి ప్రభుత్వము నిర్వహించవలసినదే నన్నాడు. అందుకు ఎలాటి ఆటంకమూ కలగనివ్వనన్నాడు. తాను విధించగల మిక్కుటమైన పాటవంతో యీ పనులు చేయించటం తన విధి అన్నాడు. ఇకముందు తాను చేయవలసిన పనినిగూర్చి ఆలోచించుకొనే నిమిత్తము కొంత తడవు కావలెనన్నాడు. జపాన్‌తో యుద్ధము సాగవలెను, శాంతిభద్రతలు నిలుపవలెను అని తిరిగీ రెట్టించిచెప్పినాడు. తనకు విశదంగా తోచేవరకూ కొత్త ఉపాయం సూచించడం అసంభవమన్నాడు. వైస్రాయి రెట్టించి చెప్పిన మాటలో ధ్వని ఉన్నది. అది సుగ్రాహ్యము. నిత్యం అస్థిరమనుకునే ప్రభుత్వంవల్ల నిర్వాహం కాదు కనుక తరచుగా యిలాటి రాజకీయ చర్చలకు పూనుకోవడం కుదరదన్నాడు. ఇంతలో బ్రిటిష్ ప్రభుత్వం ఏమైనా నిర్ణయిస్తే కొంతకాలంవరకూ ఆ నిర్ణయాలు చెల్లవలెనన్నాడు. సభవారి సాయానికీ, ఓర్మికి, గ్రహింపుకు వారలకు ధన్యవాదాలు చెప్పి యీ వెనుపాటుకు కుంగకండన్నాడు. చివరకు కష్టాలు తరిస్తాము, భారత భవిష్యదున్నతినిగూర్చి శంక లేదని సభవారిని ఊరడించి, హెచ్చరించి, సాగనంపాడు.

తాత్కాలిక ప్రభుత్వమును గూర్చి ఏర్పరిచేవిషయమై సిమ్లాసభ నిష్ఫలమైనది. వేవెల్ ప్రస్తావనలోని వేరేఏర్పాట్లకన్నిటికీ యిదే ప్రాతిపదిక. అయితే యీ విధంగా విఫలమే అయినప్పటికీ దాన్ని అంటిపెట్టుకొని కొన్ని మంచిచెడ్డలు మిశ్రంగా సంక్రమిస్తున్నవి.

వైస్రాయి చూపిన కొన్ని పేర్లు ముస్లింలీగుకు అంగీకారంకావని జిన్నా చెప్పాడు. అంతతో వైస్రాయి ఫీటీఅయినాననుకున్నట్లు చెబుతున్నాడు.

వైస్రాయి వేవెలూ, ముస్లింలీగు అధ్యక్షుడు జిన్నా యీసందర్భములో వ్రాసుకున్న ఉత్తరప్రత్యుత్తరాలు వెలువడినవి. జిన్నా పత్రికాసమావేశంలో చేసిన ప్రకటనలు, వేరేచేసిన వివరణలు, యీఉత్తరాలు, ఇందుకు సంబంధించి పంజాబ్ ప్రధాని మున్నగువారు చేసిన ప్రకటనలు—వీటన్నిటినీబట్టి ముస్లింలీగువైఖరి కొంత తెలుస్తున్నది.

వైస్రాయికి పేర్లజాబితాలను పంపిన పార్టీలలో కాంగ్రెస్‌తప్ప మిగిలినవన్నీ అల్పాల్పములు. కాంగ్రెస్ ఏపేర్లను సూచించినదో, వైస్రాయి యేమి మార్పుదలచాడో, రాష్ట్రపతి ఆజాదూ వైస్రాయి వేవెలూ ఉత్తరాలలో ఏమి వ్రాసుకున్నారో పత్రికలవారి ఊహారచనలనుబట్టితప్ప మరేవిధంగానూ తెలియదు. ఏహేతువుచేతనో ఆఉత్తరాలు ప్రచురణ కాలేదు. అవి బయటపడితే సిమ్లాసభ భగ్నతకు ఎవరు బాధ్యులో నిజంగా తెలుస్తుంది, అప్పుడు చెప్తాగదావని జిన్నాగారు ఒక ప్రకటనలో తెలిపారు.

సభ ముగిసి ఆహూతులందరూ తరలిపోయిన కొన్నాళ్లవరకూ సభాభగ్నతకు బాధ్యులెవరనే వివాదరభస కొంత తీవ్రంగానే సాగి స్వాభావికంగానే చల్లారినది.

జిన్నా గారు ఏకవాక్యతపాసగకుండా మాట్లాడారు. సభకు హాజరై, కొత్తకార్యవర్గసభ్యుల పేర్లను సూచించేవరకూ కథనడిచినపుడు వేవెల్ ప్రస్తావనాంశములను ఆయాపార్టీలవారు హర్షించినారనేది స్పష్టమే. సిమ్లాసభకు పూర్వమే పై ప్రాయితో ముచ్చటించి శంకా నివృత్తి చేసుకోబూని, ఆపైన సభలో వరసగా పాల్గొన్నందున ఎవరికీ ఆవిషయమై సందేహం కలగ లేదు. కాని వేవెల్ ప్రస్తావన ముస్లింలీగుకు బోను అనిపించిందని జిన్నా గారనటం అసలు మొదటికే వచ్చి పట్లయినది. కథ అడ్డంతిరిగేసరికి జిన్నా గారు అంత వరకూ ఒప్పుదల అయినది తోసేసి ముందువ్యవహారానికి ఎలాటి బందాలున్నూ లేకుండాచేసుకున్నారు. నూటికి ముస్లిములు ౨౫ మందిన్నీ, సవర్ణహిందువులు ౫౦ మందిన్నీ ఉండగా వేవెల్ పథకంవలన ౫౦ మందితోను ౨౫ మందికి సామ్యంలభించినది. ఎక్కడి ౫౦, ఎక్కడి ౨౫! భారతదేశంలో ముస్లిములకు ఏనాడూ లభిస్తుం దనుకోని మహావరము బ్రిటిష్ప్రభుత్వము ప్రసాదించింది. సిమ్లాసభలో పాల్గొన్నవారు కొందరు అయిష్టం తెలిపినా లేచిపోలేదు; కంఠగతంగానైనా ఒప్పుకున్నారు. కాంగ్రెసుకూడా ఒప్పుకున్నది.

బీరములు, గర్జనలు, గంభీరోక్తులు, పాకిస్తాన్ జపనము, బ్రిటిష్వారికేసి మెల్లమూపులు, కాంగ్రెస్ నింద, హైందవదూషణ—యీ ద్వేషాతిరేక ప్రచారణవల్లనే జిన్నా ప్రతీపుడు ముస్లిములకు జన్మదుర్లభమనిపించినది వరప్రసాదిగా గ్రహించినాడు. క్రమేపి దిగజారుతున్న బ్రిటిష్ సర్కారుగాని, కాంగ్రెసుగాని ఇదంతా కాదని తుడిచిపెట్టవు. లభించినదేదో దక్కినట్లే; ఇక యింతతో ముస్లిములు సవర్ణహిందువులతోడి సామ్యమునకే సంతోషించరు. కార్యవర్గంలో ఎందరు సభ్యులున్నప్పటికీ సగముమంది ముస్లిము లుండవలెను. ౨౫ డోకడాలు (నూటిలో భాగము) ౫౦ డోకడాలకు సమానమంటే చాలదు. ౨౫ డోకరాలు మిగిలిన ౭౫ డోకడాలతో తుల తూగునవనిపించాలి. ఇదీ జిన్నా గారి కొత్తకోరిక. ఇంతేకాదు. ఆ ౨౫ డోకరాల తరఫున ౫౦ (౭౫?) డోకరాలతోను సరిసమానంగా ప్రతినిధులను నియమించే సర్వాధికారమూ ముస్లింలీగుకే ఉండవలెను. అంటే ముస్లిములకు శేష భారతముతో సమానస్థాయీ కలిగి, ముస్లిములంటే ముస్లింలీగే నన్నట్లుగా వ్యవహారం జరగవలెను—ఇదీ ముస్లింలీగు నవాకాంక్ష. సిమ్లాసభవలన ముస్లింలీగుకు లాభమేగాని నష్టంలేదు. అయితే సభ భగ్నమైనందున కలిగే పర్యవసానాలు ముస్లింలీగుకు అపకారం కావచ్చును.

జిన్నా గారు తిరిగీ పాకిస్థాన్ ఆవాహన చేస్తున్నందున సిక్కుల తరఫున మాస్టర్ తారాసింగు సిక్‌స్తాన్ కావలెనంటున్నారు. పాకిస్తాన్ హెచ్చుగా పంజాబును బాధిస్తుంది. పంజాబులో సిక్కులు ముఖ్యులు; కనుక సిక్కుల అంగీకారం అవసరము. పాకీస్తాన్ ఏర్పడకతప్పకపోతే సిక్‌స్తాన్‌కూడా ఏర్పడి తీరవలెనని వీరి వాదము.

ఇంతతో అఖండభారతనినాదముకూడా ఫుంజుకుంటున్నది. సవర్ణహిందువులకు, ముస్లిములకు సాటువ కల్పించినట్టి, అనగా లోకవిరుద్ధముగా, మరెచటనైనా దూష్యమై ప్రాణగొడ్డముగా ఎంచబడే పద్ధతిని, నూటికి ౫౦ మంది ఉన్న హిందువుల బలగంతో నూటికి ౨౫ మంది ఉన్న ముస్లిముల బలగమును సరిసమానంచేసివేసినట్టి యీ వేవెల్ ప్రస్తావనాంశమునకు ఇపుడిపుడు రాజకీయలాభము మాయమైన తరుణమున ప్రతిరోధం పుడుతున్నది. నూటికి ౧౫ మంది నిమ్నజాతులవారు, అంటే హరిజనులు ఉన్నారు. ఇపుడు యీ జాతుల సంఘమువారు తమ్ము చాలా ప్రాస్య పరచినారని భావిస్తూ తమకు ఇతర కులమతాలవారితోబాటు అధిక ప్రాతినిధ్యం కల్పించవలెననీ, కనీసం సంఖ్యనుబట్టియైనా దామాషా హెచ్చించవలెననీ అంటున్నారు.

అయితే ముస్లిములలోనే జిన్నా నూతనవాదము, "వర"తిరస్కారము విపర్యయహేతువులు అవు

తున్నవి. ఈ సిద్ధించిన సవర్ణహిందూ - ముసల్మాన్ సామ్యతను వదులుకోవడం ఇష్టంలేని వారి బలగం ఎక్కువవుతున్నది. జిన్నా కొత్తకోరికలు చెల్లేవి కావనే అభిప్రాయము రూఢం అవుతున్నది.

ముస్లిములకు ప్రతినిధి సంస్థలు అనేకం ఉన్నవి; ముస్లింలీగే ఏకైకసంస్థ అనటం తగదు; పోయిన ఎన్నికలప్పుడు ముస్లింలీగు మొత్తం ౧౧ రాష్ట్రాల లోను ౪౮౫ ముస్లింస్థానాలకు ౧౧౦ మాత్రం గెలుచుకోగలిగింది. ఆతర్వాత కూటతంత్రంవలన ప్రతినిధులను తిరుగదోడి బలపడింది. పాకిస్తాన్ పురస్కృతమూ, ద్వేషభూయిష్ఠమూ అయిన ప్రచారాతిరేకంచేతను, బ్రిటిష్ప్రభుత్వపు ఆసరావల్లను, జాతీయసంస్థల అవ్యవస్థితఘోరణివల్లను ముస్లింలీగు బలపడినట్లు కన్పించిందే గాని అది ఆభాసమాత్రమేనని ముస్లిములు పలుకుతుంటున్నారు. ౧౯౩౭ లో ముస్లింలీగు సర్కారు కుమ్మకుతో వాయవ్య, సింధు, వంగ, అస్సాం, పంజాబ్ రాష్ట్రాలలో రాజ్యంచేసింది. ౧౯౪౬ లో ఆ అండ పోగానే కూలిపోయింది. వాయవ్యంలో కాంగ్రెస్ మంత్రివర్గం వచ్చింది. పంజాబులో యూనియనిస్టుమంత్రివర్గం ముస్లింలీగును తృణీకరించింది. బెంగాలులో ఓడిపోయింది. అస్సాంలోను, సింధులోను కాంగ్రెసుఆసరాతో నిలిచింది. నేడో రేపో ఆమద్దతు తొలగగానే నేలకూలుతుంది అని లీగుప్రతికక్షులు తెలుపుతున్నారు. బలాబలాలు ఎన్నికలవల్లనే గాని తెలియవు కనుక వెంటనే కేంద్ర, రాష్ట్రీయ శాసనసభలకు యెన్నికలు పెట్టవలసినదని ముస్లింలీగు కోరుతున్నది. ఈఆగస్టు ఒకటిరెండు తేదీలలో ౧౧ రాష్ట్రాల గవర్నర్లూ వైస్రాయిని కలుసుకొని ఆయా రాజకీయవిషయాలు ముచ్చటించారు. ఎంతత్వరగా ఎన్నికలు జరుగవనున్నా ౧౯౪౬ సాలు మధ్యనేరకు జరిగే వీలుండదేమోననిపిస్తున్నది.

ఇక కాంగ్రెసు విషయము చర్చించడానికిగాని, వ్యాఖ్యానించడానికిగాని ఎక్కువ పత్రికలలోని వ్రాతలే ఆధారమగుచున్నవి. లోగడ తెలిపినట్లు ఆజాద్-వేవెల్ ఉత్తరాలు ప్రచురణకాలేదు. గాంధీ-వేవెల్ ఉత్తరాలు ఏమున్నాయుంటే అవిన్నీ ప్రచురణకాలేదు. కాంగ్రెసు కార్యసంఘం ఏమన్నా తీర్మానం తేల్చివ్రాసిఉంటే అదిన్నీ ఏమీ వెల్లడి కాలేదు. కాంగ్రెసు జాతీయధ్యాసతో ప్రవర్తించడం స్వాభావికము. అందులో విశేషము లేదు. రాజకీయంగా వేవెల్ ప్రస్తావన స్వరాజ్యద్వారం కాగలదని భావించి రాజ్యాధికారం ప్రజలపరం కావలెననే ఉత్కంఠతో కాంగ్రెసు ప్రవర్తించింది. ముస్లిములకు సహజంగా లేనట్టి అధికారప్రాతినిధ్యము అధ్యారోపితంగా కలిగించడము కాంగ్రెసుకున్నా హితవుకాదు. ఇలాటి 'వరము' ముస్లిములకు ఉపకారం కాకపోగా అసహజమైన యీ 'ఉబ్బు' ముస్లిములకే నిజబలం తెలియనీయక విభ్రాంతులను చేస్తుంది. ముందు స్వరాజ్యం వస్తే ఇపుడు ఎలాటి షరతులకు ఒప్పుకున్నా బాధలేదనే విభ్రాంతిలో పలువురు పడిపోతున్నారు. ఇలాటి 'దానములు', 'స్వీకారములు' యిచ్చేవారికిగాని, పుచ్చుకునేవారికిగాని, హర్షించే వారికిగాని ప్రతిష్ఠ తీసుకురావు. మతకులపరంగా ఎప్పటికప్పుడూ ఇలాగే ఉపశమనచేస్తూ రాగా తీరని దాహము మండుకువస్తున్నది. స్వరాజ్యం రాకపోగా ఇప్పట్లో బాధలు హెచ్చిపోయి ఆవచ్చే స్వరాజ్యము వచ్చేనాటికి అర్థవిశీర్ణంగా రాగలదనే భీతు కలగడము సహజము. లోకంలో అన్నిరాజ్యాలలోను అధికులున్నారు, అల్పులున్నారు. అధికులపాలబడి అల్పులు నలిగిపోతారేమోననే జంకు కలగటం అసహజ మనిపించుకోదు. కాని అల్పులు మిగిలిన అధికులతోపాటు రాజ్యశ్రేయస్సే తలచుకునే యెడల సమాధానం తేలికగా కుదురుతుంది. అల్పుల నాగరికసంస్కృతీ, మత దేవతార్చన భాషాదివిషయాలలో ఎలాటి అపకారమూ జరగకుండా కాపుదలగా కొన్ని సంప్రదాయపు షరతులు పెట్టుకోవచ్చును. అది లోకవ్యవహారము.

కనుక్క కాంగ్రెసు యీ ఉపశమనఉపాయమును మార్చుకోవలెనని ప్రతికక్షులు చెప్పే మాటలో అర్థమున్నది. దుర్బలస్థితిలోనే యిలాటి ఉపాయాలంబన

చేస్తారు. ముస్లింలీగు, లీగు నాయకుడు జిన్నా కాంగ్రెసును హిందూసంస్థగా, శత్రుకోటిగా ఎంచుకుంటూన్నారు. ఇప్పుడేకాదు, వెనకనుంచీ అంతే. కాంగ్రెసు యింకా ఆభాసపు మంచితనానికిపోక, ఉన్న స్థితి ఉన్నట్లుగా గ్రహించి, ప్రవర్తించవలెననే వాదము కాంగ్రెసువారిలోకూడా బలపడుతున్నది. ముస్లిములలోకూడా లీగ్ వ్యతిరిక్తమైన జాతీయముస్లిం సంస్థలు అనేకం ఏకోన్ముఖంగా ప్రవర్తించి ముస్లిం ప్రజానీకపు జాతీయస్వభావాన్ని ప్రతిఫలింపజేయ బూనుకుంటున్నవి. మౌలానాహుస్సేన్ అహమ్మద్ మదానీగారిని (జమైతుల్ ఉలేమా అధ్యక్షుడు) కాంగ్రెసు కార్యసంఘసభ్యునిగా నియమించటం ఈసందర్భంలో ముఖ్యమైనదే.

కాంగ్రెసు ప్రభుత్వంతో కలహించి విరోధించుటకు చాలా సబబున్నది. కాని దేశంశ్రేయస్సుకోరి కాంగ్రెసు వ్యాకులగతాన్ని మరచి ఉదారంగా ప్రవర్తించింది. దేశానికి లభించగల రాజ్యాధికారం యియత్తను వివేచించడంలోనేమి, తాత్కాలిక ప్రభుత్వరచనను యోచించడంలోనేమి కాంగ్రెసు చాలా గణ్యతగా మెలిగింది.

బ్రిటిష్‌ప్రభుత్వం యింతవరకూ బాసటగా నిలుస్తూవచ్చిన ముస్లింలీగును యీసమయంలో హీనపరచడం అవసరమైనది. అందువల్ల చాలా లాఘవంగా వైస్రాయి-అల్లాగని వాచా అనకుండా-ముస్లింలీగే సిమ్లాసభభగ్నతకు కారణమని ధ్వనింపజేశాడు. కాంగ్రెసు సూచించిన పేర్లలో కాంగ్రెస్‌వారినే-అందులోను కాంగ్రెస్‌లోని ముస్లిములనే వైస్రాయి కొట్టివేశాడని వినికిడి. అయితే ఆసంగతి వైస్రాయి రాష్ట్రపతికి తెలుపలేదు. ఈసారి యీ 'బద్నామ్' జిన్నామీదుగా పోనివ్వదలచి వైస్రాయి యిలాచేశాడనే వ్యాఖ్యానం వినవస్తున్నది. అయితే యీసందర్భంలో రాష్ట్రపతి ఆజాద్ చెప్పినమాట జ్ఞప్తికివస్తుంది. ఆఖరుకు కాంగ్రెసులోని ముస్లిముల పేర్లనుగూడా వదులుకొనుటకు ఇష్టపడ్డామనీ, కాంగ్రెసుకూ లీగుకూ చెందని యిద్దరుముస్లిములుండాలనీ రాష్ట్రపతి ఆజాద్ స్వంతపూచీమీద, అంటే కాంగ్రెసుకార్యసంఘప్రసక్తి లేకుండా జిన్నాగారికి సూచిస్తే ఆయనగారు అందుకుగూడా అంగీకరించలేదని ఆజాద్ వెల్లడించారు. ఇది జిన్నాగారు అంగీకరిస్తే కాంగ్రెస్‌కార్యసంఘంచేత ఒప్పించగల్గుదుననికూడా అన్నారట. ఈసూచనలో రాజకీయమైన గాఢాభిలాష ద్యోతకమౌతున్నది. స్వయముగా ముస్లిమై, కాంగ్రెస్‌కు తలమానికంగా ఉన్న ఆజాదే యిలా సూచించారంటే వారి ఉత్కంఠను గ్రహించవచ్చును. కాని జిన్నాగారు కోరేది ముస్లింలీగుకు సర్వసామ్యము, సర్వస్వామ్యమూను. కాంగ్రెస్ చేయవలసినంతా చేసింది. ఇంకా దిగితే ఆత్మహానము.

"వైస్రాయి ఏమన్నప్పటికీ ముస్లిములకు ముస్లింలీగే ఏకైకప్రతినిధి యని కాంగ్రెస్ ఒప్పుందపడితే అంతా తేలిపోయేది కదా! అంతదూరం వెళ్లిన కాంగ్రెసు ఆకాస్తగూడా ఒప్పుకుంటే యేమయ్యేది? ఈ విధంగా కాంగ్రెసు, ముస్లింలీగు సంఘీభవించి రాజ్యాధికారం సాధించగలవుగదా! ఇంతతోనే కాంగ్రెసు జాతీయత పోతుందా" అని అనేకులు ప్రశ్నిస్తున్నారు.

ఒకవేళ ఇలాగున కాంగ్రెసు, ముస్లింలీగు ఏకీభవించి ప్రవర్తిస్తే బ్రిటిష్‌ప్రభుత్వం ఎలా ఫిరాయించేదో బ్రిటిష్‌వారి నడవడి తెలిసినవారికి వేరే చెప్పనక్కరలేదు. "కాంగ్రెసు, లీగు ఏకమై, ఆ రెండు సంస్థలకూ చెందని జనబాహుళ్యం వద్దంటూండగా శాసించనివ్వటానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒప్పుకోదు. భారతదేశమంటే లీగు కాంగ్రెసులే కాదు. తద్భిన్నమైనవారియెడల బ్రిటిష్ సర్కారు నెరవేర్చవలసిన పూచీబాధ్యతలను ఉపేక్షించి ఊరుకోలేదు." అని యీ ధోరణిలో వేవెల్ జవాబుచెప్పిఉండేవాడనేది దురూహ్యం కాదు. కాంగ్రెసు ముస్లిముల పేర్లను తీసివేసి, వైస్రాయి లీగుకాంగ్రెసులకు చెందని ముస్లిములను సూచించాడనటంలోనే యిది తెల్లమౌతున్నది. ముస్లింలీగే ముస్లిములకు ఏకైకప్రతినిధిసంస్థ అని కాంగ్రెసు అంగీకరించినా బ్రిటిష్ ప్రభుత్వం అంగీక

కలగూరగంప

క్రీడాభిరామము - అధ్యాత్మరామాయణము

క్రీడాభిరామములో (౨౬-వ పుట)లో నీ క్రింది పద్యము గలదు:—

"కోయిల పంచమస్వరము
 క్రోల్చినభంగిని విద్దికూచి రా
మాయణ మాఱుకాండలును
 నచ్యుతజాగర వేళ బాడె నా
రాయవికంఠురత్న మను
 రాగముతోడ "నమశ్శివాయ శాం
తాయ సమస్తదోషహర
 ణాయ" సమానమె దాని కెవ్వరుక ?"

పై పద్యము లక్ష్మణ వఙ్ఝల యుంటిపట్టుగ్రన్థ లోనిది. ఇందు సూచింపబడిన రామాయణ మాఱు కాండలును నధ్యాత్మరామాయణమని చెప్పదగియున్నది. అధ్యాత్మరామాయణమున తొలికీర్తనయందలి పదములే యిందును కానవచ్చుచున్నవి. మరియు నా కీర్తన యందలి తొలిపదముగు "నమశ్శివాయ" యనునదియే పై పద్యమునందుగూడ నెత్తుగడ. అధ్యాత్మరామాయణ ప్రథమ కీర్తన యిది :

ధన్యాసి : ఆదితాళము

"పల్లవి—నమశ్శివాయతే నమోభవాయ

అనుపల్లవి - సమానాధికరహితాయశాంతాయ స్వప్రకాశాయ - ప్రమోదపూర్ణాయభక్తాఘపాలనాయ.

తరుణేందుశేఖరాయ పరమపురుషాయ భవహర ణాయ శ్రీకాళహస్తీశ్వరాయ"

ఇందును నాఱుకాండలే కలవు. క్రీడాభిరామములోని పద్యము ఆగ్రంథములోనిదే యగుచో శ్రీనాథుని కాలమునకు, అనగా ౧౫-వ శతాబ్దమునకే ఈకీర్తనలు ప్రఖ్యాతములై యున్నవని యెన్నవగును. దీనిని రచించిన మునిపల్లె సుబ్రహ్మణ్యకవి అధునాతనుడని తెలియుచున్నది. కాని, యధ్యాత్మరామాయణమందలి సంస్కృతాంధ్రరచనను, కీర్తనయందలి కట్టుబాట్లను గమనించినచో ఇది ప్రాచీనమనియే యూహింపదగియున్నది. తాళ్లపాక అన్నమయ్యగారి సంకీర్తన లక్షణములందలి లక్షణముల కధ్యాత్మరామాయణములోని కీర్తనలు సరిపోవుచున్నవి.

సంగీతసాహిత్యవేత్త లధ్యాత్మరామాయణమునకు గల ఉత్తమసాహితీస్థానమును నిరూపించినయెడల తెలుగున పదవాఙ్మయమునకు గల ప్రశస్తి వెల్లడి గలదు. పదవాఙ్మయమునకే పడియుండి యున్నత సాహితీశ్రేణికి జెందదగిన పెక్కుకీర్తనలవలె నిదియు నేటికిని తెలుగునాటియింతుల నాల్కలయందు నాట్యమాడుటయే దీని ప్రాచీనతకు గుఱుతు.

నిడుదవోలు వెంకటరావు.

* * *


మౌనవ్రతము

మౌనమును మనవారు వ్రతములలో ఉత్తమ వ్రతముగా పరిగణించినారు. మన ప్రాచీన

మహర్షులు, యోగులు దీనిని తప్పనిసరివిధిగా అనుష్ఠించి చూపినారు. గాంధీజీ అన్నపానముల విషయములో నయినను ఎవంత పట్టుదల వీడుచేసెనో కాని మౌనమును మాత్రము సడలివిడవని పట్టుదలతో సక్రమముగా సాగించుకొనివచ్చుచున్నాడు. దీనిలో ఎంతసుగుణమో నిక్షిప్తమయియుండనియెడల ఆయనకు దీని నింతటి శ్రద్ధాసక్తు లెందుకువచ్చును? అతివిస్తర మెందుకు? 'మౌనం సర్వార్థసాధక'మ్మని ఆభాణకమే వచ్చినది. దీని గుణగణములను గురించి శాంతిఆశ్రమవాసులయిన ఓంకారస్వామిగారు రచించిన ఒక రచననుండి ఉద్ధృతములైన ఈ క్రింది కొలదిపంక్తులను పరికించి దీని విశిష్టలక్షణమును గ్రహించునది:

"బుద్ధిని తప్పుత్రోవకు మరల్పుటకును, జీవుల నధోగతిపాలు చేయుటకును 'మాయ'యొక్క ముఖ్యాయుధమైనటువంటి దశేంద్రియములను వశీకరించుకొనుట మహత్తరమైన కార్యము. ఈ దశేంద్రియములలో ముఖ్యమైనది 'వాక్కు'. దీనిచేతనే మంచియైనను చెడ్డయైనను మనకు లభించును. ఈ వాక్కు మనవశములో లేనిసమయమునందే మన కోపము కొలదిగా ఎదుటివానిని తప్పొప్పులను పాటించకుండ దూషణ చేయుచున్నది. దీనివల్ల సకలకార్యములును పాడగుచున్నవి. ఈ 'వాక్కు' పరిశుద్ధముగ, మాధుర్యముగ నున్నప్పుడే ఎదుటివాడు దాసానుదాసుడై సమ్మోహితు డగుచున్నాడు. "వాగ్భూషణమే సుభూషణము", "నోరు మంచియయిన ఊరు మంచి" అన్నట్లు మన నోటిని, మన 'వాక్కును' మనవశములో ఉంచుకొనగలుగుట ఎంతో భాగ్యము. ముఖ్యముగా కోపము వచ్చినప్పుడు, ఎక్కువ సంతోషముగా నున్నప్పుడు ఈనోరు విచ్చలవిడిగా ప్రేలుచుండును. అందుచేత అకస్మాత్తుగా ఏరెండుమూడు దినములలోనో దీనిని వశపరచుకొనగల మనుకొనుట వెర్రితనము. కావున దీనిని వశపరచుకొనుటకు దేహపరిశ్రమ చేయు విధముగనే 'మౌన'మును సాధన చేయవలెను.

నోటినుండి ఏమాట కూడ పైకి వెడలగక్కకుండ దినమున కొక అరగంటయో, పావుగంటయో ఏకాంతస్థలమునకూర్చొని యుండవలెను. ఇదియే మౌనము. ఇటువంటి సమయాలలో బుద్ధినికూడ ఏవిధమైన విషయవాంఛలపైగాని పోనీరాదు. పరిగెత్తిపోవు మనస్సును పట్టుకొనిధ్యానమందే యుంచవలెను. ఇట్టి మౌనమునేగదా గాం



దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారికి మద్రాసు కార్పొరేషను వారి సన్మానము.

దీక్ష అవలంబించి "మహాత్ము"డైనాడు. దీనిచేతనే పెద్ద పెద్ద మహర్షులు, యోగులు, సన్యాసులు అవలంబించి మాయను దాటగల్గుచున్నారు. ఇది ఒక్క దినములో, ఒక్క వారములో, ఒక్క నెలలో, లేక ఒక్క సంవత్సరములో వచ్చెడి విద్యగాదు. కొన్ని సంవత్సరాలు సాధనచేసినను కొంతమంది దీని ఫలము సాధింపజాలకున్నారు. కారణము వారు పేరునకు మౌనముగ నుందురు గాని వారి బుద్ధి చంచలమైయుండును. అందుచేత బుద్ధినిగూడ బంధించి మౌనముగ నుండుటయే 'మౌనము'.

పోత్తిగా మాట్లాడకుండ కూర్చొనియుండుట "కారణమౌనము". ఏ పనియు చేయకుండ, కదలకుండ, ఎదుటివారితో ఏదైన మాట్లాడవలసినప్పుడు ఏదో కాగితముమీద వ్రాసియో, సంజ్ఞలచేత చేయూపియో తెలుపుట మొదలగునవి ఏవియు లేకుండుట "కష్ట మౌనము". కష్టమౌనము చాల కష్టమైనను త్వరలో ఫలిత మగుపడును.

మౌనములో ఉండునప్పుడు "ఓహో... ఆహా!" అనునవికూడ మానవలెను. ఇవి అనునప్పుడు తెలియకయే మననోటినుండి మాటలు వచ్చివేయును. అందుచేత మాట్లాడుటకంటె ఇది మరియు చెడ్డది. దీనివల్ల ఎక్కువ శక్తి వినియోగపడును. ప్రతిరోజు మనము పనిచేసి కష్టపడుచున్నాము. మన దేహమునకు విశ్రాంతి కావలసియుంటూనేయున్నది. అట్లాగే మనము తెలివిగా ఉండగనే మన నోటికికూడ కొంచెము విశ్రాంతి నివ్వవలెనుగదా! ఎక్కువసేపు మౌనమవలంబించుట కవకాశములేని రోజులలో దినానికి ఒక అరగంటయో, పావుగంటయో మౌనముగనుండి ఆకాలమందు భగవంతునిపై ధ్యానము, జపము, తపము, మంత్రోపాసన మొదలగునవి చేయవచ్చును.

ఈమౌనము ఉదయమో, సాయంకాలమో, లేక అథవా నిద్రపోవుటకుముందో ఒక్క అరగంట అయినను చాలు. దినమునుచేయుట కవకాశమున్నచో

మంచిది. "పెద్దపెద్ద పనులకంటె" వారమున కొకసారి చేసినను చాలు. ఆఖరుకు ఇట్లుచేయుటకుకూడ వీలులేకపోయినచో దినచర్యలలో ఇతరులతో మాట్లాడునప్పుడు పెద్దపెద్ద లెక్చర్లు, అనవసరపుమాటలు, వాదనలు, తర్కవితర్కాలు తగ్గించి ఎంత మాట్లాడవవసరమో అంతటితోనే సరిపుచ్చవలెను. మన యునికి మనకు సరిపడనిచో ఏకాంతప్రదేశమునకు ఏపార్కుకో, ఏబీచికో, జనసంచారము తక్కువగ నుండు స్థలమునకు పోవలెను. లేదా, ఏదేవాలయములోనైన కూర్చొనవచ్చును.

ఈ మౌనము మొట్టమొదట ప్రారంభదశలో తక్కువకాలములో ప్రారంభించి తరువాత క్రమముగా అభివృద్ధిచేయుట మంచిది. కొంచెము కష్టమని తోచినప్పుడు జపము, ధ్యానము, వేదాధ్యయనము, గీత మొదలగువానిని లోలోనపఠించుట మొదలగునవి చేయ


వచ్చును. ఒకవేళ అది చేయుట కష్టమని తోచినచో మౌనమును ఆపివేయుటయే మంచిది. దీనిని క్రమముగా అభివృద్ధిచేసినందువలన లాభములనేకము లున్నవి. కాని ఒకేసారి పట్టుగా కూర్చునునది కష్టసాధ్యము; కష్టతమము. కాన, మౌనమునకు వారముదినములలో ఏదో ఒకదినము ఎంచుకొని అందులో ఒకగంటయో, రెండు మూడుగంటలో మౌనముగా నుండుట మంచిది. సెలవుదినాలలోను, తీరికయున్నప్పుడును మౌనములో నుండుట మంచిది. దినమునకు రెండుగంటలతో మొదలు పెట్టి క్రమేణ, అభివృద్ధిచేయుచు పోయినచో కొన్ని నెలలతర్వాత ఆవ్యక్తిలో నెంతో ఆనందము, కళ, ఉత్సాహము, ధైర్యము కన్పించును. లిఖితజపము కూడ ఈమౌనములో చేయవచ్చును. మౌనములో నుండునప్పుడు తలపులను బాహ్యేతరముగా త్రిప్ప వలెను. దురుద్దేశాలను ఆపుచేసి మనస్సును భగవంతునిపై కేంద్రీకరించవలెను.

'మౌనములో' కష్టమని తోచినప్పుడు కథల పుస్తకాలు, నవలలు, పత్రికలువగైరాలు చదివినచో మన మనస్సు ప్రాపంచిక బంధాలపైకి పోవును. అట్టిమౌనమును తుదకు హిమాలయపర్వతములదగ్గర చేసినను ఎన్నాళ్లు చేసినను ఫలము లభించదు.

ఏ మాత్రము మైమరచినను చెడ్డత్రోవలోపడి మాయాసాగరమున జొచ్చి కుశితిలోని ఎలుకమాదిరిగా గింజుకోవలెను. అందుచేత మనస్సును వశమునందుంచు కొని ఏకతానత్వమున నిలుపుట చాల అవసరము. దానికి ఈ మౌనము ఒక పరమోపాయము. మనో నిశ్చలత, సత్యము, ధైర్యము మొదలైన అనేక సుగుణములు ఈ మౌనమువల్ల అలవడగలవు.

కనుకనే ఇది వ్రతములలోకెల్ల ఉత్తమ వ్రతమైనది.

గుత్తి నాగేశ్వరరావు.



ఆనాటి కనకవాడ - నేటి బెజవాడ.



విమర్శనము

ఆంధ్రజ్యోతి

సచిత్రమాసపత్రిక. సంపాదకుడు: చక్రపాణిగారు. కార్యస్థానము: ౮౩, ఆచారప్పన్ వీథి, జి. టి., మద్రాసు. డెమ్మీ ఎనిమిది పుటల సైజు. సుమారు ౮౦ పుటలు. సంవత్సర చందా ౫ రూపాయలు. విడిప్రతిక ౭ అణాలు.

ఇదివరలో వారపత్రికగానుండిన ఆంధ్రజ్యోతి రెండు సంవత్సరములుగా అజ్ఞాతవాసముచేసి తిరిగి ఇప్పుడు మొన్న జూలై ప్రారంభమునుండి మాసపత్రికగా పునర్నిర్మాణము చేయబడినది. దీని ఆదర్శ ఉద్దేశ్యములను గురించి సంపాదకులు మనస్ఫూర్తిగా ఇట్లు వ్రాసియున్నారు: "ఈ ఆంధ్రజ్యోతి ఆంధ్రులకు కొత్తగా మార్గం చూపిస్తుందనిగానీ, కనీసం పెద్ద వెలుగు నిస్తుందనిగానీ మేము చెప్పలేము. కాని పెద్దలు నడిచే మార్గాలనూ, నాయకులు వేసే దోవలనూ మాత్రం ఇది చూపించగలదు. ఇదే మేము ఆంధ్రులకు చేయగలిగిన సేవ."

జూలైలో వెలువడిన మొదటి సంచికనుబట్టిచూడగా ఈ పత్రికలో కథలు, కబుర్లు, విజ్ఞాన వినోదములు, విమర్శలేశములు మొదలైన లఘురచనలకే ఎక్కువ ప్రాముఖ్యముండగలదన్నట్లు ఊహింపనయియున్నది. కాని అందులోనే ఒక శిష్టప్రమాణమును నెలకొల్పి, ఉత్తమస్థాయిలో నిర్వహించి, పైన చెప్పిన ఆదర్శోద్దేశ్యముల కనుగుణముగా ఈ పత్రిక కలకాలము కర్తవ్యనిర్వహణచేయగలదను సూచనలు ఈ తొలిసంచికలో రూఢములై యున్నవి.

ఆముక్తమాల్యదపర్యాలోకనము

రచయిత: వెల్లండ ప్రభాకరరావుగారు. ప్రకాశకులు: సాధనసమితి, సికింద్రాబాదు. వెలరూపాయి.

రాయలవారి ఆముక్తమాల్యద ఉద్దండపండితులకే అయఃపిండము. దాని వస్తుతత్త్వపర్యాలోకనమనగా మాటలతో పనికాదు. అది అనేకవాదవివాదలకును, గహనమైన సిద్ధాంతరాద్ధాంతములకును ఆకరమయినది. వానినెల్ల తడవుటకు పెద్ద పోకడ పోవలెను. ప్రస్తుతగ్రంథము అంత పెద్ద పనిమాత్రము కాదుగాని, ఇది సాహిత్యోత్సాహులయిన నవవిద్యార్థులకు ఆ ప్రకృష్టప్రబంధమును గురించి పరిచయలేశము గలిగించుటకు మాత్రము బాగుగా తోడ్పడవచ్చును. ఉత్సాహోద్రేకములకోలది ఒక వర్ధిష్ణురచయిత వ్రాసిన ఈపర్యాలోకన గ్రంథము నింతకన్న విపులముగా విమర్శించి నెరసులను వెదకుట పాడిగాదు. కాని ఈసాహిత్యోత్సాహమును సమగ్రముగా పెంపొందించుకొని యీ రచయిత మున్ముందు ఇతోధికసంపన్నమైన రచనలను తప్పక సృష్టింపగలడని మాత్రము గట్టిగా చెప్పనయియున్నది.

(గ్రంథస్వీకారము)

నయాగరా

రచయితలు: రామదాస్, అంజనేయులు, సుబ్రహ్మణ్యంగార్లు. ధర రూపాయి. ప్రకాశకులు: నవ్యకళాపరిషత్తు, నరసరావుపేట.

కమలాభాస్కరము

అడ్డేపల్లి నాగభాస్కరరావు, కమలాదేవిగార్ల కల్యాణమహోత్సవ బహూకృతిగా రచింపబడిన చిన్న పద్య సంగీతనాటిక. రచయిత: శ్రీ సత్యనారాయణరావుగారు (శ్రీ వాత్సవ).

శృంగారతరంగమాల

రచయిత: ఆమంచ మాణిక్యశర్మగారు. ప్రాప్తిస్థానము: చంద్రమౌళీశ్వర ముద్రాశాల, కర్నూలు. వెల ౧౦ అణాలు. ౧౯౩౭ ప్రచురణ.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.